శనివారం 4-11-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 224

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



‘పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది’


శుభ
ధంతెరాస్
స్వర్ణ సంబరం
28th Oct. to 10th Nov 2023
1=2
మీరు కొనే బంగారానికి
రెండింతల
వెండి
ఉచితం
సిల్వర్ ఆర్టికల్స్‌పై
తరుగు మజూరీ
లేదు
DIAMOND
JEWELLERY
EF-VVs DIAMOND CARAT PRICE
55,999 ONLY
ఐశ్వర్యలక్ష్మికి ఆహ్వానం పలకండి
ది చెన్నయ్
జ్యుయలర్స్
916 గోల్డ్ • డైమండ్స్ • సిల్వర్ ఆర్టికల్స్
హైదరాబాద్ మరియు సికింద్రాబాద్



'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 224

శనివారం 4-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అఫ్గాన్... అదే జోరు

ప్రపంచకప్‌లో నాలుగో విజయం.
నెదర్లాండ్స్‌పై 7 వికెట్లతో గెలుపు -15లో



వారం గరిష్టానికి సూచీలు

కొనసాగిన ప్రపంచ సానుకూలతలు..
అన్ని రంగాల షేర్లకూ డిమాండ్ -బిజినెస్‌లో

రైతుల గోస తీర్చినం!



ఇప్పుడు ఎరువుల కోసం చెప్పల లైన్లు లేవు.. కల్తీ విత్తనాలు లేవు

భైంసా, కోరుట్ల, ఆర్మూర్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

- రైతుబంధు, రైతు బీమా, ఉచిత కరెంటు ఇస్తున్నాం.. ప్రధాని మోదీకి ప్రైవేటు పిచ్చి.. అన్నింటినీ ప్రైవేటీకరణ చేస్తున్నారు
- మోటార్లకు మీటర్లు పెట్టబోమన్నందుకు రూ.25 వేల కోట్లు నష్టం చేశారు
- రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు, నవోదయ విద్యాలయాలు ఇవ్వలేదు
- ఏముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని బీజేపీ వాళ్లను నిలదీయాలి
- కొందరు మన మధ్య చిచ్చుపెట్టాలని ప్రయత్నం చేస్తున్నారు
- కేసీఆర్ బతికున్నంత కాలం తెలంగాణ సెక్యులర్‌గా ఉంటుంది
- కొత్తగా దరఖాస్తు చేసుకున్న బీడీ కార్మికులకు పింఛన్ ఇస్తాం.. చేనేతల సంక్షేమం కోసం అదనపు బడ్జెట్ కేటాయిస్తామని హామీ
- ఎవరు మంచి చేశారో ఆలోచించి ఓటు వేయాలని ప్రజలకు పిలుపు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/ ఆర్మూర్/ నిర్మల్: తెలంగాణ వ్యవసాయ రాష్ట్రం కాబట్టి వ్యవసాయ స్థిరీకరణతోనే గ్రామాలు పటిష్టం అవుతాయని గుర్తించి చర్యలు చేపట్టామని.. రైతుల గోస తీర్చామని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. దేశ చరిత్రలో లేని స్థాయిలో 24 గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా, సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకాలను వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌తోపాటు ఐక్యరాజ్యసమితి కూడా మెచ్చుకుందని చెప్పారు. ఇప్పుడు ఎరువుల కోసం చెప్పుల లైన్లు లేవని, కల్తీ విత్తనాలు లేవని తెలిపారు. ఎవరు మంచి చేశారో ఆలోచించి ఓటు వేయాలని

మిగతా 2వ పేజీలో ▶

ఛత్తీస్‌గఢ్ సీఎంకు రూ.508 కోట్ల ముడుపులు

- ఓ బెట్టింగ్ యాప్ నుంచి అందాయి
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ప్రకటన
- క్యాష్ కొరియర్ వాంగ్మూలమిచ్చినట్లు వెల్లడి
- ఫోరెన్సిక్ విశ్లేషణలో విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయన్న దర్యాప్తు సంస్థ
- అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు చిక్కులు
- మోదీ సర్కారు నాటకమంటూ ఎదురుదాడి

6లో



తొలిరోజు వంద నామినేషన్లు దాఖలు

సాక్షి నెట్‌వర్క్: శాసనసభ ఎన్నికల పోరులో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వానికి శుక్రవారం తెరలేచింది. రాష్ట్రవ్యాప్తంగా పలు నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తొలిరోజు వంద నామినేషన్లు దాఖలైనట్టు తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వికాస్ రాజ్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

సాక్షి బిజినెస్
శనివారం
4-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	283	64,364
నిఫ్టీ ▲	97	19,231

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,468	▲	174
డోజోన్స్	34,089	▲	250
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,418	▼	29
డాక్స్	15,189	▲	46
షాంఘై	3,031	▲	21
నికాయ్	31,950	▲	348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,075	▼	17
బంగారం (99.5 స్వచ్ఛత)	60,830	▼	17
వెండి (కిలో)	70,771	▲	913


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.99	103.36
€	యూరో	ఒకటి	87.01	90.10
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.58	56.26
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.53	54.84
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.20	62.14
SAR	సౌదీ రియాల్	ఖాయపేటిక	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాయపేటిక	21.78	23.57
¥	చైనా యువాన్	ఖాయపేటిక	10.26	12.34

తనిష్క్.. 'ధరోహర్' కలెక్షన్

హైదరాబాద్: టాటా గ్రూప్‌నకు చెందిన తనిష్క్ దీపావళి సందర్భంగా 'ధరోహర్' పేరుతో కొత్త కలెక్షన్‌ను ఆవిష్కరించింది. భారతదేశ సుసంపన్న సాంస్కృతిక వారసత్వం, ఆధునిక సాంకేతికత సమ్మేళనాల ప్రేరణతో కొత్త కలెక్షన్‌ను రూపొందించామని కంపెనీ తెలిపింది. 'వెలుగుల పండుగకు దేశ సంప్రదాయాల లోతైన మూలాల నుంచి అత్యుత్తమ ఆభరణాల డిజైన్లను తీసుకొస్తున్నందుకు గర్విస్తున్నాము' అని టైటాన్ కంపెనీ చీఫ్ డిజైన్ ప్రతినిధి రేవతి కాంత్ తెలిపారు.

5న జోయ్ అలుక్కాస్ ఆత్మకథ



దుబాయ్: జోయాలుక్కాస్ గ్రూప్ అధినేత జోయ్ అలుక్కాస్ అత్మకథ 'స్ప్రెడింగ్ జాయ్' నవంబర్ 5న విడుదల కానుంది. షార్జాలో జరిగే అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనలో ఆటోబయోగ్రఫీని ఆవిష్కరించనున్నారు. సినీ నటి., జోయాలుక్కాస్ బ్రాండ్ అంబాసిడర్ కాజోల్ దేవగణ్ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేయనున్నారు. హార్పర్ కాలిన్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. అసంఘటితమైన ఆభరణాల పరిశ్రమను ఏకతాటిపైకి తెచ్చిన ఔత్సాహిక పారిశ్రామికవేత్త ప్రయాణాన్ని, అతని గురించి అరుదైన అంశాల్ని ఇందులో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 'స్ప్రెడింగ్ జాయ్‌ని నాన్నగారికి అంకితం చేశా ను. నా ఆత్మకథ చదివిన ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కలిగిస్తుందని ఆశిస్తున్నాను.ఎన్నడూ పట్టు వదలొద్దనే ధోరణిని ప్రోత్సహిస్తుందని నమ్ముతున్నాను' అని తన ఆత్మకథపై జోయ్ అలుక్కాస్ స్పందించారు.

యూఏఈకి లీ ఫార్మా స్మూత్‌వాక్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కీళ్ల వ్యాధి చికిత్సలో వాడే బయో–కార్టిలేజ్ స్మూత్‌వాక్ ట్యాబ్లెట్లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో విక్రయించేందుకు అనుమతి పొందినట్టు లీ ఫార్మా ప్రకటించింది. భారత్‌లో తయారైన న్యూట్రాస్యూటికల్‌కు యూఏఈలో ఆమోదం రావడం తొలిసారి అని కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. కీళ్ల సర్జరీని నివారించగలిగే ఈ ఔషధానికి మంచి డిమాండ్ ఉందన్నారు. కొలాజెన్ టైప్–2, ఎగ్ షెల్ నుంచి సేకరించిన పొర, గుగ్గిలం, పసుపు నుంచి తీసిన కుర్కుమిన్, విటమిన్ డి–3 మేళవింపుతో ఔషధం తయారైంది. మృదులాస్థిని (కార్టిలేజ్) పెంచి, కీళ్ల రుగ్మతలను తగ్గిస్తుందని కంపెనీ తెలిపింది.

రిలయన్స్ రిటైల్ చేతికి అరవింద్ బ్యూటీ బ్రాండ్స్



న్యూఢిల్లీ: వేగంగా వృద్ధి చెందుతున్న సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల (బీపీసీ) వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్‌ఆర్‌వీఎల్) దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అరవింద్ ఫ్యాషన్‌కి చెందిన అరవింద్ బ్యూటీ బ్రాండ్స్ రిటైల్‌ను కొనుగోలు చేస్తోంది. ఇందుకు సంబంధించి ఆర్‌ఆర్‌వీఎల్ అనుబంధ సంస్థ రిలయన్స్ బ్యూటీ అండ్ పర్సనల్ కేర్‌తో షేర్ల కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ) కుదిరినట్లు అరవింద్ ఫ్యాషన్ వెల్లడించింది. ఈక్విటీ వాటా విక్రయ విలువ రూ. 99.02 కోట్లుగా ఉండనున్నట్లు పేర్కొంది. చెల్లించాల్సిన రుణాలు, ఈక్విటీ అంతా కలిపి సంస్థ మొత్తం విలువను రూ. 216 కోట్లుగా లెక్కగట్టినట్లు వివరించింది. డీల్‌లో భాగంగా అరవింద్ ఫ్యాషన్స్ నిర్వహిస్తున్న ఫ్రాన్స్ బ్యూటీ రిటైల్ బ్రాండ్ సెఫోరాకు భారత్‌లో ఉన్న 26 స్టోర్స్ కూడా ఆర్‌ఆర్‌వీఎల్‌కు దక్కుతాయి. ఇకపై తాము పూర్తిగా ఫ్యాషన్ (యూఎస్ పోలో, యారో మొదలైన 5 బ్రాండ్స్) పైనే దృష్టి పెట్టనున్నట్లు అరవింద్ ఫ్యాషన్స్ తెలిపింది.

గత ఆర్థిక సంవత్సరంలో అరవింద్ బ్యూటీ బ్రాండ్స్ రిటైల్ టర్నోవరు రూ. 336.70 కోట్లుగా నమోదైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్‌లోని రిటైల్ కంపెనీలన్నింటికీ ఆర్‌ఆర్‌వీఎల్ హోల్డింగ్ సంస్థగా ఉంది. బ్యూటీ రిటైల్ ప్లాట్‌ఫాం 'టిరా' కొనుగోలుతో సౌందర్య సాధనాల వ్యాపారంలోకి ప్రవేశించింది. నైకా, టాటా, హిందుస్తాన్ యూనిలీవర్‌కి చెందిన లాక్మే మొదలైన దిగ్గజ బ్రాండ్స్‌తో పోటీపడుతోంది. రెడ్‌సీర్ స్ట్రాటెజీ కన్సల్టెంట్, పీక్ 15 సంయుక్త నివేదిక ప్రకారం 2022లో 19 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీ సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల మార్కెట్ 2027 నాటికి 30 బిలియన్ డాలర్లకు చేరనుంది.

అక్టోబర్‌లో 'సేవలు' పేలవం

ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ సూచీ 58.4కు డౌన్

న్యూఢిల్లీ: భారత్ సేవల రంగం అక్టోబర్‌లో నిరాశ పరిచింది. ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 58.4కు పడిపోయింది. గడచిన ఏడు నెలల్లో ఇంత తక్కువ స్థాయికి ఇండెక్స్ పడిపోవడం ఇదే తొలిసారి. సెప్టెంబర్‌లో 13 యేళ్ల గరిష్ఠ స్థాయి.. 61కి చేరిన సూచీ మరుసటి నెలలోనే కిందకు జారడం గమనార్హం. అయితే సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఈ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల సూచీ వరుసగా 27 నెలల నుంచీ వృద్ధి బాటన కొనసాగుతోంది.

సేవలు–తయారీ కలిపినా కిందకే..

మరోవైపు సేవలు–తయారీ రంగాలను కలిసి లెక్కించే ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ సెప్టెంబర్‌లో 61 వద్ద ఉంటే, తాజా సమీక్షా నెల అక్టోబర్‌లో 58.4కు పడిపోయింది. మార్చి తర్వాత ఇంత తక్కువ స్థాయి ఇదే తొలిసారి. ఒక్క తయారీ రంగాన్ని చూస్తే, అక్టోబర్‌లో బలహీన ధోరణి నమోదుచేసుకుంది.

జొమాటో లాభాల బాట

- క్యూ2లో రూ.36 కోట్లు
- మెరుగుపడిన మార్జిన్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్ 'జొమాటో' ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) అంచనాలను మించి పనితీరు చూపించింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు గణనీయంగా నష్టాలను తగ్గించుకుని, లాభాల్లోకి ప్రవేశించింది. రూ.36 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో జొమాటో రూ.251 కోట్లు నష్టపోవడం గమనించొచ్చు. కార్యకలాపాల ద్వారా ఆదాయం రూ.1,661 కోట్ల నుంచి రూ.2,848 కోట్లకు దూసుకుపోయింది. ఇదే కాలంలో వ్యయాలు కూడా గణనీయంగా పెరిగాయి. రూ.2,092 కోట్ల నుంచి రూ.3,039 కోట్లకు ఎగిశాయి. పోర్చుగల్‌కు చెందిన అసోసియేటెడ్ కంపెనీ 'జెడ్‌ఎంటీ యూరప్ ఎల్‌డీఏ'లో తనకున్న 30 శాతం ఓటింగ్ హక్కులను 1.80 లక్షల యూరోలకు విక్రయించాలని (సుమారు రూ.1.59 కోట్లు) జొమాటో బోర్డ్ నిర్ణయించింది. స్థూల ఆర్డర్ విలువ (జీవోవీ)లో మార్జిన్లు మైనస్ 7.3% నుంచి ప్లస్ 1.3%కి మెరుగుపడ్డాయి. జూన్ త్రైమాసికం మాదిరే, సెప్టెంబర్ క్వార్టర్లోనూ అన్ని విభాగాల్లో వృద్ధిని కొనసాగించినట్టు జొమాటో ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో జొమాటో షేరు ఎన్‌ఎస్‌ఈలో 10% శాతం బలపడి రూ. 118 వద్ద ముగిసింది.

టైటన్ లాభం అప్

క్యూ2లో రూ. 916 కోట్లు



న్యూఢిల్లీ: జ్యువెలరీ, వాచీల తయారీ దిగ్గజం టైటన్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 916 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 835 కోట్లు ఆర్జించింది. నికర అమ్మకాలు సైతం 25 శాతం జంప్‌చేసి రూ. 10,708 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 8,567 కోట్ల అమ్మకాలు సాధించింది. అయితే మొత్తం వ్యయాలు 41 శాతం పెరిగి రూ. 11,402 కోట్లకు చేరాయి. ఇక మొత్తం కన్సాలిడేటెడ్ ఆదాయం 37 శాతం ఎగసి రూ. 12,653 కోట్లయ్యింది. దీనిలో జ్యువెలరీ విభాగం ఆదాయం 39 శాతం జంప్‌చేసి రూ. 11,081 కోట్లను తాకగా.. వాచీలు తదితర బిజినెస్ 32 శాతం వృద్ధితో రూ. 1,092 కోట్లకు చేరింది. వెరసి వాచీలు, వేరబుల్స్ విభాగం తొలిసారి రూ. 1,000 కోట్ల టర్నోవర్‌ను అందుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ఐకేర్ ఆదాయం 13 శాతం బలపడి రూ. 189 కోట్లయ్యింది. ఈ కాలంలో కొత్తగా 10 టైటన్ వరల్డ్ స్టోర్లతోపాటు, హీలియోస్ 5, ఫాస్ట్‌ట్రాక్ 5 చొప్పున స్టోర్లను ఏర్పాటు చేసింది.

ఫలితాల నేపథ్యంలో టైటన్ షేరు బీఎస్‌ఈలో 2.3 శాతం బలపడి రూ. 3,273 వద్ద ముగిసింది.

మళ్లీ లాభాల్లో ఇండిగో

క్యూ2లో రూ. 189 కోట్లు



న్యూఢిల్లీ: ఎయిర్‌లైన్స్ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో రూ. 189 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,583 కోట్ల నికర నష్టం ప్రకటించింది. సామర్థ్యం పెంపు, అధిక ట్రాఫిక్ ఇందుకు సహకరించాయి. వెరసి ఇండిగో బ్రాండు సర్వీసుల కంపెనీ వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. అయితే ఈ కాలంలో విదేశీ మారక నష్టం రూ. 806 కోట్లను మినహాయించి లాభాలు ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 21 శాతం జంప్‌చేసి రూ. 15,503 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 12,852 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ క్యూ2లో ప్రయాణికుల సంఖ్య 26.3 మిలియన్ల నుంచి 33.4 మిలియన్లకు ఎగసింది. సెప్టెంబర్ కల్లా విమానాల సంఖ్య 334కు చేరగా.. రూ. 30,666 కోట్ల నగదు నిల్వలు కలిగి ఉంది.

ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు 1% బలపడి రూ. 2,509 వద్ద ముగిసింది.

వారం గరిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ సానుకూలతలు
- అన్ని రంగాల షేర్లకూ డిమాండ్
- 19,200 స్థాయిపైకి నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ లాభాలు ఆర్జించాయి. ఇటీవల విడుదల కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కూడా సెంటిమెంట్‌ను బలపరిచింది. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం సెన్సెక్స్ 283 పాయింట్లు బలపడి 64,364 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు పెరిగి 19,231 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు వారం గరిష్టం. ఉదయం భారీ లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 454 పాయింట్లు పెరిగి 64,535 వద్ద, నిఫ్టీ 143 పాయింట్లు బలపడి 19,276 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. అయితే వారాంతాపు రోజు కావడంతో మిడ్ సెషన్ తర్వాత గరిష్ట స్థాయికి చేరిన కొన్ని షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలకు కొంతమేర లాభాలు తగ్గాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒక శాతం లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.12 కోట్ల షేర్లను విక్రయించగా, దేశీ ఇన్వెస్టర్లు రూ.403 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల యథాతథ కొనసాగింపు, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. అత్యధికంగా రియల్టీ సూచీ 2.50% ర్యాలీ చేసింది. సర్వీసెస్ 1.60%, కన్జూమర్ 1.50%, ఎఫ్‌ఎంసీజీ, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్సులు 1% పెరిగాయి. ఆటో, ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, ఐటీ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి.
- సెప్టెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో టాటా మోటార్స్ షేరు 2% పెరిగి రూ.648 వద్ద క్లోజైంది. ట్రేడింగ్‌లో 4.5% ఎగసి రూ.665 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- రియల్టీ రంగ షేర్లు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ షేరు 7% పెరిగింది. ప్రెస్టేజ్ఎస్టేట్, గోద్రెజ్ ప్రాపర్టీస్, డీఎల్‌ఎఫ్, శోభ, ఒబేరాయ్ రియల్టీ షేర్లు 5–2% లాభపడ్డాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు

- నాని


● ఎస్‌ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ' సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పెట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్ నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు కార్తీ. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని ఎస్ఆర్ ప్రభు అన్నారు. రాజు మురుగన్ మాట్లాడుతూ– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు

- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణ రావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, సువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది


- ఆర్‌పీ వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పీ వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పీ వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి

- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరప్పు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం

- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 224

శనివారం 4-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

జంగ్ తెలంగాణ


కారుకు.. నో ఎంట్రీ

భూ ఎజెండాకు చోటేదీ?

చట్టసభల్లో నల్ల సూరీళ్లు

కాంగ్రెస్‌కు 'ఆ నలుగురు'

- 7,8లో



కాలుష్యం కోరల్లో ఢిల్లీ విలవిల

ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.


- వివరాలు 6లో



చక్రబంధంలో గాజా సిటీ!

గాజాలో హమాస్ మిలిటెంట్లతో హోరాహోరీ పోరు కొనసాగుతోందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

- వివరాలు 6లో



కర్ణాటకలో కుర్చీలాట!

కర్ణాటక కాంగ్రెస్‌లో వర్గపోరు పెరుగుతోంది. ఎవరికి వారు వర్గాలుగా మారి సీఎం కుర్చీపై గురి పెట్టారు.

- వివరాలు 6లో



అఫిడవిట్లతో అత్యంత జాగ్రత్త

నామినేషన్ల దాఖలులో అభ్యర్థులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు.

- వివరాలు 12లో

అవినీతి బాబు చుట్టూ రాజకీయమేంటి?



- కులం పేరుతో కట్టడి మంత్రమేంటి?
- పవన్, చంద్రబాబు రాజకీయ ఎత్తులేంటి?
- ఏపీలో ఒక రకంగా.. తెలంగాణలో ఇంకో తీరా?
- సెటిలర్స్ పేరుతో గాయాన్ని రేపడం సరికాదు
- టీడీపీ కేవలం ఒక సామాజిక వర్గానిదేనా?
- ఎన్టీఆర్ బీసీలకు 50 శాతం అంటే.. వీళ్లేంటి ఇలా?
- రోతపుట్టిన నేటి రాజకీయాలు ప్రముఖ సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ -7లో

మరోసారి 'ప్రవాసీ'

నియోజకవర్గాలకు బీజేపీ పాలిత రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఇతర నేతలు.. నేటి నుంచి ఎన్నికలు ముగిసేదాకా అక్కడే మకాం

పార్టీ ప్రచారం, నేతల మధ్య సమన్వయం, ఇతర అంశాలపై పర్యవేక్షణ.. దిశానిర్దేశం చేసిన జాతీయ నేతలు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా బీజేపీ పాలిత రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు శనివారం నుంచి రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు తరలివెళ్లనున్నారు. పార్టీపరంగా చేపడుతున్న 'ప్రవాసీ యోజన'లో భాగంగా ఇప్పటికే రెండు, మూడు విడతలుగా వారు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. తాజాగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ సైతం వెలువడి నామినేషన్ల పర్వం కూడా ప్రారంభం కావడంతో..వీరంతా తమకు కేటాయించిన నియోజకవర్గాల పరిధిలో నెలరోజుల పాటు మకాం వేయనున్నారు. అంటే ఎన్నికలు ముగిసే దాకా అక్కడే ఉండనున్నారు. పార్టీ ప్రచారం, నేతల మధ్య సమన్వయం ఇతర అంశాలను అధిష్టానం దూతలుగా పర్యవేక్షించనున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, ఇంటింటి ప్రచారం, ప్రధాన పార్టీల బలాబలాలు వంటివి పరిశీలించి నాయకత్వానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు.



ఇన్‌చార్జీల నియామకం!

పార్టీ పరంగా రాష్ట్రాన్ని 38 జిల్లాలు, 6 జోన్లుగా విభజించిన సంగతి తెలిసిందే. కాగా ఈ జిల్లాలు, జోన్ల వారీగా ఇతర రాష్ట్రాల నేతలు దృష్టి కేంద్రీకరించనున్నారు. కాగా రాష్ట్రంలో ఇప్పటికే వివిధ రూపాల్లో పనిచేస్తున్న వారితో పాటు కిందిస్థాయిలో పరిస్థితుల అంచనాకు ఈ నేతల సేవలను పార్టీ ఉపయోగించుకోనుంది. ఈ నేతలు థర్డ్ పార్టీ మాదిరిగా పనిచేస్తుండడంతో, ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు జవాబుదారీతనంతో పనిచేసే వీలుంటుందని నేతలు చెబుతున్నారు. జోన్లకు ఇన్‌చార్జీలుగా కూడా వీరు వ్యవహరిస్తారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు, ఆంధ్రప్రదేశ్ నుంచి కొందరు నేతలు ఇప్పటికే ఇక్కడకు చేరుకున్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన వర్క్‌షాపులో జాతీయ నేతలు ప్రకాశ్ జవదేకర్, తరుణ్ ఛుగ్, అర్వింద్ మీనన్ వారికి దిశానిర్దేశం చేశారు. ఆరుజోన్లు, జిల్లాలు, ఆయా నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీల నియామకం జరిగినట్టు సమాచారం.

డబుల్ చెక్‌కు దోహదం

బీజేపీ జాతీయ నాయకత్వం కొంతకాలంగా అనుసరిస్తున్న రాజకీయ విధానంలో భాగంగానే ప్రవాసీ యోజనను మిగతా 14వ పేజీలో ▶

జానారెడ్డి ఇంట్లో సోదాలు!

- కేఎల్‌ఆర్ ఇల్లు, కార్యాలయాల్లో కొనసాగిన ఐటీ శాఖ తనిఖీలు
- 6న తమ ఎదుట హాజరు కావాలని బడంగ్‌పేట్ మేయర్‌కు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నాయకులు, వారి బంధువుల ఇళ్లలో గురువారం ఉదయం మొదలైన ఐటీ అధికారుల సోదాలు రాత్రి తర్వాత కూడా కొనసాగాయి. గురువారం రాత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఆయన కుమారుడు జయవీర్ నివాసంలోనూ తనిఖీలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే సాధారణ తనిఖీల్లో భాగంగానే వీరి ఇళ్లలో సోదాలు చేపట్టినట్టు, కొన్ని పత్రాలను ఐటీ అధికారులు పరిశీలించి వెళ్లినట్టు సమాచారం. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్)కి చెందిన ఇళ్లు, విల్లా, ఫామ్‌హౌసుల్లో, బాలాపూర్‌లోని బడంగ్‌పేట్ మేయర్, పీసీసీ నేత, చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, వారి బంధువులు, అనుచరుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు చేప ట్టిన విషయం తెలిసిందే. కాగా కేఎల్ఆర్ నివాసం ,కార్యాలయాల్లో శుక్రవారం మరో సారి తనిఖీలు చేపట్టారు. 15 మంది అధికారులు తుక్కుగూడలోని కేఎల్ఆర్ నివాసానికి చేరుకున్నారు. పలు డాక్యుమెంట్లతో పాటు కేఎల్ఆర్‌ను వెంటబెట్టుకుని నార్సింగ్ ఎన్‌సీసీ అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. గంట పాటు అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించారు. అక్కడి నుంచి మాదాపూర్‌లోని కేఎల్ఆర్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. రాత్రి పొద్దు పోయే దాకా సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. బడంగ్‌పేట్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ఇంట్లో గురువారం రాత్రే సోదాలు ముగిశాయి. ఇంట్లో లభించిన రూ.8 లక్షలు సహా పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని, ఈ నెల 6న విచారణకు హాజరు కావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. తమను రాజకీయంగా దెబ్బ తీసేందుకే ఈ దాడులు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

మేడిగడ్డ 7వ బ్లాక్ పూర్తిగా పునర్నిర్మించాల్సిందే..!

ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదిక స్పష్టీకరణ

ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో నాణ్యత, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలతోనే బ్యారేజీ కుంగింది

ఇతర బ్లాకులూ దెబ్బతింటే బ్యారేజీ పూర్తిగా పునర్నిర్మించక తప్పదు

ఫ్లోటింగ్ స్ట్రక్చర్ డిజైన్ రూపొందించి రిజిడ్ స్ట్రక్చర్ పద్ధతిలో నిర్మించారు

ఊర్ధ్వ పీడనం పునాదుల కింద ఇసుకను తన్నడంతో బ్యారేజీ కుంగింది

5లో

కేసీఆర్ ఓటమి ఖాయమైంది

- బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒకవైపు.. మేం, టీజేఎస్, ప్రజాసంఘాలు మరోవైపు
- ఏ కూటమి కావాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు
- రాష్ట్రంలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి లేవు
- కేసీఆర్ నియంత.. క్రిమినల్ పొలిటీషియన్
- ఆయన పాపాలపుట్ట పగిలినందుకే మేడిగడ్డ కుంగింది
- 'మీట్ ది ప్రెస్'లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి - 12లో



'కర్ణాటక' కుట్రపై అధికారులు అలర్ట్!


- తెలంగాణ నుంచి పరిశ్రమలు, సంస్థలను తరలించుకుంటున్నారనే ఆరోపణలపై నజర్
- బెంగళూరుకు వస్తే ప్రోత్సాహకాలు ఇస్తామంటూ ఆ రాష్ట్రం నుంచి కంపెనీలకు లేఖలు వెళ్తున్నాయనే ప్రచారం
- అక్కడి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రి పాటిల్ తెరవెనుక పావులు కదుపుతున్నారనే ఆరోపణలు -2లో
- దీనిపై రాష్ట్ర అధికారుల దృష్టి.. కంపెనీలు తరలకుండా చర్యలు



క్లుప్తంగా...

'దళిత ద్రోహి' కేసీఆర్

డిసెంబర్ 3న బీఆర్ఎస్ భారీ మూల్యం చెల్లించాల్సిందే: ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ దళిత ద్రోహి అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ధ్వజమెత్తారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం దళితులు, వెనుకబడిన తరగతులు, ఆదివాసీలు, మైనారిటీలు, పేదలను మోసం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన మోసంతో రాష్ట్రంలో రమాకాంత్ అనే 30 ఏళ్ల దళిత యువకుడు నిస్సహాయ స్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మల్లికార్జున్ ఖర్గే 'ఎక్స్'లో అభిప్రాయాన్ని పోస్ట్ చేశారు. రమాకాంత్ తన చివరి లేఖలో దళితబంధు పథకం పట్ల కేసీఆర్ ప్రభుత్వ ఉదాసీనతను, నిరాకరణను స్పష్టంగా బయటపెట్టారని ఖర్గే తెలిపారు. తెలంగాణలోని బడుగు బలహీన వర్గాలను నిర్వీర్యం చేసినందుకు బీఆర్ఎస్ డిసెంబర్ 3న భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని జోస్యం చెప్పారు.

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కర్ణాటకలోని కరెంట్ కష్టాలు తెలంగాణలోనూ పునరావృతం అవుతాయని, దానికి కర్ణాటక మంత్రి రామలింగారెడ్డి చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని 'ఎక్స్'(ట్విట్టర్)లో ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. మోసపూరిత హామీలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. కర్ణాటకలో 5 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆ రాష్ట్ర మంత్రి అంగీకరిస్తూ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్'ద్వారా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని మండిపడ్డారు. 'తెలంగాణలో 3 గంటల కరెంట్ చాలని పీసీసీ అధ్యక్షుడు అన్నారు. దీన్నిబట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే తెలంగాణలో 3 గంటల కరెంటే వస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు'అని పేర్కొన్నారు.

పల్లె నుంచి పట్టణం వరకు అభివృద్ధి

తెలంగాణ భవన్‌లో ఎన్ఆర్ఐల సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పల్లె నుంచి పట్టణం దాకా అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ విభాగం సమన్వయకర్త మహేశ్ బిగాల పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు, తెలంగాణవాసులు బీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తారని ప్రకటించారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన తెలంగాణ ఎన్ఆర్ఐల సమావేశంలో మహేశ్ బిగాల పాల్గొని అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే సుమారు వందమంది ప్రవాస తెలంగాణవాసులు బీఆర్ఎస్‌కు ప్రచారం చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ విపక్షాలకు అందనంత ముందుందని, కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికీ అభ్యర్థులను ప్రకటించకుండా కాలక్షేపం చేస్తున్నాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం నాయకులు అశోక్ దూసరితో పాటు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రియా, మాల్దీవులు తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. గత ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పుల వివరాలు తప్పుగా చూపించారంటూ సీహెచ్.రాఘవేంద్రరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ...రాఘవేంద్రరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా.ఎం. త్రివేదిల ధర్మాసనం విచారించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలంటూ శ్రీనివాస్‌గౌడ్‌కు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం, విచారణను వాయిదా వేసింది.



ఇదే పార్టీలో ఉంటే ఎప్పటికీ టికెట్ రాదనే.. వేరే పార్టీలోకి జంపయ్.. మళ్లీ ఈ పార్టీలోకి మారితే టికెటిచ్చారు!

'కర్ణాటక' కుట్రపై అధికారుల అలర్ట్!

- తెలంగాణ నుంచి పరిశ్రమలు, సంస్థలను తరలించుకుంటున్నారనే ఆరోపణలపై నజర్
- బెంగళూరుకు వస్తే ప్రోత్సాహకాలు ఇస్తామంటూ ఆ రాష్ట్రం నుంచి కంపెనీలకు లేఖలు వెళ్తున్నాయనే ప్రచారం
- తెరవెనుక అక్కడి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రి పాటిల్ !
- ఆంగ్ల, కన్నడ పత్రికల్లో కథనాలు.. సోషల్ మీడియాలో వైరల్



డీకే శివకుమార్



ఎంబీ పాటిల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల వేళ హైదరాబాద్‌లోని పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను బెంగళూరుకు తరలించుకెళ్లేందుకు కర్ణాటక ప్రభుత్వం కుట్రలకు తెరతీసిందన్న ప్రచారంపై రాష్ట్ర అధికారులు దృష్టి పెట్టి తెలిసింది. సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరును తలదన్నేలా హైదరాబాద్ దూసుకెళ్తుండటం, ఐటీ రంగంలో అవకాశాలు సన్నగిల్లుతుండటం, పారిశ్రామికంగానూ దెబ్బతిన్న క్రమంలో కర్ణాటక ప్రభుత్వం ఈ వ్యవహారానికి తెరలేపిందన్న ప్రచారంపై ఫోకస్ చేసినట్టు సమాచారం. దీనికి సంబంధించి కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ ఇటీవల ఫాక్స్‌కాన్ సహా పలు ప్రముఖ కంపెనీలకు లేఖ రాసినట్టుగా ఆ రాష్ట్రంలోని పలు ఆంగ్ల, స్థానిక పత్రికల్లో కథనాలు రావడం, ఈ అంశాలు సోషల్ మీడియాలోనూ వైరల్ కావడాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిసింది.

ఎన్నికల సమయమే అదనుగా..

బెంగళూరులో మౌలిక వసతుల కల్పనలో పురోగతి లేకపోవడం, ట్రాఫిక్, సరైన మంచినీటి సౌకర్యం లేకపోవడం, రహదారులు అస్తవ్యస్తంగా మారడం, తీవ్ర కరెంటు సంక్షోభంపై బడా పారిశ్రామికవేత్తలు బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కర్ణాటక స్థానిక పత్రికలు పేర్కొంటున్నాయని అధికార వర్గాలు చెప్తున్నాయి. బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్‌షా, ఖాతాబుక్ స్టార్టప్ సీఈవో రవీశ్ నరేశ్, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన మోహన్‌దాస్ తదితరులు బెంగళూరు మౌలిక వసతులపై పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారని.. ఇదే సమయంలో హైదరాబాద్‌లోని వసతులను ప్రశంసించారని అంటున్నాయి. ఈ క్రమంలోనే కర్ణాటక ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కీన్స్ కంపెనీ సీఈవో రాజేశ్ శర్మ.. బెంగళూరులో ఏర్పాటు చేయతలపెట్టిన తమ కంపెనీని హైదరాబాద్‌ను మార్చాలని నిర్ణయించుకున్నారని పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో ఐటీ ఉద్యోగులు కూడా హైదరాబాద్–బెంగళూరు వసతులను పోలుస్తూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేస్తున్నారని అంటున్నాయి.

గతంలోని అంశాలను ప్రస్తావిస్తూ..

గతంలోనూ కర్ణాటక ప్రభుత్వం హైదరాబాద్ నుంచి కంపెనీలను తమ వైపు తిప్పుకొనేలా ప్రయత్నించిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని అధికారులు చెప్తున్నారు. ఈ ఏడాది మార్చి 1న టీ–వర్క్స్ ప్రారంభోత్సవానికి హాజరైన సందర్భంగా సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన ఫాక్స్‌కాన్ సీఈవో యంగ్‌లీ యూ.. త్వరలో తెలంగాణలో రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామని, తద్వారా ఇక్కడ లక్ష ఉద్యోగాల కల్పన జరుగుతుందని ప్రకటించారని గుర్తు చేస్తున్నారు. ఆ మరునాడే ఫాక్స్‌కాన్ తెలంగాణలో కాకుండా బెంగళూరులో పెట్టుబడులు పెట్టబోతోందంటూ సోషల్ మీడియాలో వైరల్ చేశారని పేర్కొంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమై.. ఫాక్స్‌కాన్‌తో సీఈవోతో మాట్లాడటంతో, తెలంగాణలోనే పెట్టుబడులు పెడుతున్నామంటూ మార్చి 6న ఫాక్స్‌కాన్ సీఈవో లేఖ రాశారని గుర్తు చేస్తున్నాయి.

కోడై కూస్తున్న కన్నడ పత్రికలు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు రాజకీయ పార్టీలు కూడా ఎన్నికలపైనే దృష్టి సారించాయని.. దీన్ని సావకాశంగా తీసుకుని పరిశ్రమలను బెంగళూరుకు తరలించుకునేందుకు కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కన్నడ పత్రికల్లో కథనాలు వస్తున్నాయని అంటున్నారు. బెంగళూరు కోల్పోయిన ప్రభను తెచ్చేందుకు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రి ఎంబీ పాటిల్ ఇటీవల జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు లేఖలు రాశారని సదరు పత్రికలు పేర్కొంటున్నాయని చెప్తున్నారు. బెంగళూరుకు వస్తే అనేక ప్రోత్సాహకాలు ఇస్తామంటూ ఆశచూపుతున్నారని.. తెరపై ఫాక్స్‌కాన్‌కు రాసిన లేఖ కనిపిస్తున్నా, ఇలా మరెన్ని కంపెనీలకు లేఖలు రాశారన్నది తెలియాల్సి ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందని అంటున్నారు.

ఊహకందని రీతిలో పురోగతితో..

హైదరాబాద్ గత పదేళ్లలో ఐటీ, ఐటీఈఎస్‌తో పాటు పారిశ్రామికంగానూ ఊహించని రీతిలో పురోగతి సాధిస్తోందని.. టీఎస్ ఐపాస్‌తో పరిశ్రమల ఏర్పాటు సరళీకృతమై బడా కంపెనీలు వస్తున్నాయని అధికారులు చెప్తున్నారు. మౌలిక వసతుల కల్పన, 24 గంటల కరెంటు, పుష్కలమైన నీటి సరఫరా, రవాణా వ్యవస్థ, తెలంగాణ ప్రభుత్వ ప్రగతిశీల చర్యలతో అంతర్జాతీయ ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు ఇక్కడ కొలువుదీరాయని అంటున్నారు. అమెజాన్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, గూగుల్, మైక్రాన్ వంటి దిగ్గజ కంపెనీలు ఇక్కడ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద క్యాంపస్‌లను ఏర్పాటు చేసుకున్నాయని.. తెలంగాణ ప్రభుత్వ చొరవతో హైదరాబాద్ ఐటీ రంగం గణనీయ వృద్ధి సాధించిందని వివరిస్తున్నారు. పదేళ్లలో ఐటీ ఎగుమతులు సుమారు రూ.53 వేల కోట్ల నుంచి ఏకంగా రూ.2.41 లక్షల కోట్లకు.. ఐటీ ఉద్యోగుల సంఖ్య మూడు లక్షల నుంచి దాదాపు పది లక్షలకు చేరాయని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే కర్ణాటక తాజా కుట్రలకు తెరతీసినట్టు ప్రచారం జరుగుతోందని పేర్కొంటున్నారు.



పూర్ణాహుతి చేస్తున్న పండితులు. చిత్రంలో కేసీఆర్ దంపతులు, స్వరూపానందేంద్ర స్వామి

ముగిసిన రాజశ్యామల యాగం

మర్కూక్ (గజ్వేల్): సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న రాజశ్యామల యాగం శుక్రవారం ముగిసింది. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు యాగం చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం మహా పూర్ణాహుతితో యాగ క్రతువు పూర్తయింది. యాగశాలలో రాజశ్యామల అమ్మవారు శుక్రవారం నర్తనకాళి అలంకారంతో దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే రాజశ్యామల, సుబ్రహ్మణ్యేశ్వర మూల మంత్రాల హవనం ప్రారంభమైంది. మహాపూర్ణాహుతిలో కేసీఆర్ దంపతులతో పాటు బంధుమిత్రులు, సన్నిహితులు పాల్గొన్నారు. పూర్ణాహుతిలో వినియోగించే పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలకు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర సమక్షంలో కేసీఆర్ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం స్వరూపానందేంద్ర స్వామికి కేసీఆర్ పాదపూజ చేసి పుష్పాభిషేకంతో గురువందనం సమర్పించారు.

ఈటల కన్నా పెద్ద మనిషి కాసాని

ముఖ్యమంత్రి కేసీఆర్

- కాసాని రాకతో ముదిరాజ్‌లకు పదవులు వస్తాయి
- ముదిరాజ్ వర్గానికి పెద్దపీట వేస్తాం
- సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన టీటీడీపీ మాజీ అధ్యక్షుడు కాసాని



కాసాని జ్ఞానేశ్వర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాజకీయంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తామని, రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు ముదిరాజ్‌లకు వస్తాయని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ సమక్షంలో టీటీడీపీ మాజీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తన అనుయాయులతో కలసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ వంటి నాయకుడు బీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామమని అన్నారు. జ్ఞానేశ్వర్ ఏడాది కిందటే బీఆర్ఎస్‌లోకి రావాల్సిందని, ఆలస్యమైనా రాజకీయంగా ఎంతో అనుభవజ్ఞులైన ఆయన రావడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈటల రాజేందర్ కన్నా పెద్ద మనిషి జ్ఞానేశ్వర్ అని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఎన్నికల తరువాత ముదిరాజ్‌లతో సమావేశం అవుతానని, ఎవరెవరికి ఎక్కడ అవకాశం ఇవ్వాలో నిర్ణయం తీసుకుంటానని సీఎం చెప్పారు. ముదిరాజ్‌ల నుంచి ఎక్కువ సంఖ్యలో నాయకులు తయారు కావాలని, ఈసారి రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులతో పాటు ఇతర నామినేటెడ్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ చైర్మన్, స్థానిక సంస్థల పదవుల్లో పెద్ద పీట వేస్తామని స్పష్టం చేశారు. పార్టీలో ఈటల ఎవరినీ ఎదగనివ్వలేదని, ఈటలను మించిన నాయకులు ముదిరాజుల్లో ఉన్నారని అన్నారు. ముదిరాజ్ వర్గానికి చెందిన బండ ప్రకాశ్‌ని తీసుకొచ్చి ఎంపీ, ఎమ్మెల్సీ, కౌన్సిల్ వైస్ చైర్మన్ పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. ఎన్నికల తరువాత జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కులపెద్దలను కూర్చోబెట్టుకొని వారి ప్రధాన సమస్యల పరిష్కారంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేత మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జ్ఞానేశ్వర్‌తోపాటు బీఆర్ఎస్‌లో చేరినవారిలో కాసాని వీరేశ్, బండారి వెంకటేశ్ ముదిరాజ్, ముప్పిడి గోపాల్, బియ్యని సురేశ్, ప్రకాశ్ ముదిరాజ్ తదితరులున్నారు.

తెలంగాణ ద్రోహులంతా ఒక్కటయ్యారు

పవన్‌కల్యాణ్ బీజేపీతో చేతులు కలిపారు

- ఓట్లు చీలొద్దని చంద్రబాబు లోపల నుంచి సపోర్టు చేస్తున్నారు
- రేవంత్‌ది క్రిమినల్ గ్యాంగ్.. సంగారెడ్డిలో మంత్రి హరీశ్ ధ్వజం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణను దెబ్బ తీయడానికి, రాష్ట్రాన్ని ఆగం చేయడానికి కాంగ్రెస్, బీజేపీల ముసుగులో తెలంగాణ ద్రోహులంతా ఒక్కటయ్యారని మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం సంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'పవన్ కల్యాణ్‌తో బీజేపీ చేతులు కలిపారు. షర్మిలమ్మ కాంగ్రెస్‌లో కలుస్తుందంటా.. వీరిద్దరూ తెలంగాణ ద్రోహులు కాదా. తెలంగాణ ప్రకటిస్తే భోజనం మానేసిన పవన్‌తో బీజేపీ చేతులు కలిపింది. తెలంగాణ అంటే సిగరేటా.. బీడీనా అన్న షర్మిల, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందట. లోపల నుంచి చంద్రబాబు కూడా సపోర్టు చేస్తారంటా. ఓట్లు చీలవద్దని చంద్రబాబు తెలంగాణలో పోటీ చేయబోమని ప్రకటించారు. దీన్ని బట్టి చూస్తే తెలంగాణ ద్రోహులంతా ఒక్కటవుతున్నారని అర్థమవుతోంది'అని విమర్శించారు.

రేవంత్ క్రిమినల్ నం.4170

తెలంగాణ గెలవాలంటే ప్రజలు కేసీఆర్ పక్షాన నిలవాలని, తెలంగాణ ఓడాలంటే రేవంత్‌రెడ్డి క్రిమినల్ గ్యాంగ్‌కు మద్దతు ఇవ్వాలని హరీశ్‌రావు ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ క్రిమినల్ గ్యాంగుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఓటుకు నోటు కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా రూ.50 లక్షలతో దొరికిన రేవంత్‌రెడ్డే క్రిమినల్. ఆయన క్రిమినల్ నం.4170 బెయిల్ మీద బయట ఉన్న ఖైదీ రేవంత్ అని చెప్పారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే తిప్పలు తప్పవు..

కాంగ్రెస్ పార్టీ రకరకాల కుట్రలతో బయలుదేరిందని, తప్పిపోయి ఆ పార్టీకి ఓటేస్తే తిప్పలు తప్పవని హరీశ్‌రావు అన్నారు. 'కర్ణాటకలో ఐదుగంటల కరెంటు కూడా ఉండటంలేదని వార్తలు వస్తున్నాయి. ఆ పరిస్థితి తెలంగాణలో కూడా వస్తుంది. సాఫీగా కేసీఆర్ పాలన జరుగుతున్న ఈ తరుణంలో రిస్క్ ఎందుకో ఆలోచించుకోవాలి'అని ఆయన ప్రజలకు సూచించారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిపైనా హరీశ్‌రావు విమర్శలు చేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం రాజీనామా చేయాలని డిమాండ్ వచ్చినప్పటికీ కిషన్‌రెడ్డి పదవి పట్టుకుని వేలాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కోరుట్లలో శుక్రవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు భారీగా హాజరైన ప్రజలు

రైతుల గోస తీర్చినం!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజలకు పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా భైంసా, జగిత్యాల జిల్లా కోరుట్ల, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు కేసీఆర్ మాటల్లోనే..

"ప్రజాస్వామ్యంలో ప్రజల చేతిలో వజ్రాయుధం ఓటు. అది దేశ భవిష్యత్తుకు బాట వేస్తుంది. గుడ్డిగా ఓటు వేయొద్దు. అభ్యర్థి వెనుక ఉన్న పార్టీలను, వాటి నడవడికను చూడాలి. ఈ అంశాలపై మీ ఊళ్లలో చర్చ పెట్టాలి. అలాగైతే మంచి నాయకులు వస్తరు, మంచి ప్రభుత్వాలు వస్తాయి. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏం జరిగింది? అంతకుముందు కాంగ్రెస్ హయాంలో ఏం జరిగిందో ఆలోచించాలి. గతంలో పోచంపల్లి, దుబ్బాకలలో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. భూదాన్ పోచంపల్లిలో ఏడుగురు నేతన్నలు చనిపోతే.. లక్ష రూపాయల చొప్పున ఇవ్వాలని అప్పటి సీఎంను కోరాం. కానీ రూపాయి కూడా ఇవ్వలేదు.

ఎరువుల కోసం చెప్పుల లైన్లతో..

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎరువుల బస్తాల కోసం రైతులు పోలీస్‌స్టేషన్ల దగ్గర గంటల తరబడి నిలబడేది. చెప్పులు లైన్లలో పెట్టి ఎదురుచూసేది. ఆ పరిస్థితిని మార్చాం. కల్తీలేని విత్తనాలను కూడా అందుబాటులోకి తెచ్చాం. ధరణిని రద్దు చేస్తామని, రైతు బంధు దుబారా అని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. ధరణితో దళారులు, లంచావతారాల బెడద, వ్యవసాయ భూముల్లో అక్రమాల బాధ తప్పాయి. ఇప్పటికే రెండుసార్లు రైతు రుణాలను మాఫీ చేశాం. ఈసారి రూ.లక్షకుపైగా ఉన్న రుణాలు మాఫీచేసేలోగా ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ ఆగిపోయింది.

రోడ్డును చూస్తే తేడా తెలుస్తది

పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి మీరు వస్తుంటే మన తెలంగాణ వచ్చిందన్న విషయాన్ని రోడ్లే చెప్తాయి. ఎక్కడి నుంచి రోడ్డు నున్నగా వస్తదో అక్కడి నుంచే తెలంగాణ అని మహారాష్ట్రవాళ్లు అంటున్నరు. అది మన అభివృద్ధికి సూచిక. ఇళ్లు, పరిశ్రమలు, ఐటీ, వ్యవసాయ రంగాలకు 24 గంటలపాటు కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్ర మనదే. మహారాష్ట్రలో కరెంటు లేదు.

మన మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు

వందల ఏళ్ల నుంచి భైంసా, ముథోల్, ఆదిలాబాద్, హైదరాబాద్‌లలో హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి ఉండి పని చేసుకుంటున్నరు. భైంసా అంటే రోజూ కొట్టుకుంటారనే అబద్ధాలు ప్రచారం చేసి, మన మధ్యనే చిచ్చు పెట్టాలని చూస్తున్నరు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కరోజు కూడా కర్ఫ్యూ, లాఠీచార్జి లేదు. తెలంగాణ ప్రశాంతంగా ఉండాలా లేక మతపిచ్చి మంటలతో నెత్తురు పారాలా? కేసీఆర్ బతికున్నంతకాలం తెలంగాణ సెక్యులర్‌గానే ఉంటుంది. గత పదేళ్లలో మైనార్టీల సంక్షేమానికి రూ.12వేల కోట్లు ఖర్చు చేశాం.

బీడీ కార్మికులకు కొత్త పింఛన్లు

బీడీలు చేసే వారి బాధలు నాకు తెలుసు. ఎవరూ దరఖాస్తు చేసుకోకముందే వారికి పింఛన్ ఇచ్చిన. బీడీ కార్మికులకు పింఛన్ రూ.2వేల నుంచి రూ.5 వేల వరకు దశలవారీగా పెంచి ఇస్తాం. కొత్తగా నమోదు చేసుకున్న బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్, జీవన్‌రెడ్డి, కేటీఆర్‌లు కోరుతున్నారు. తప్పకుండా ఇస్తాం" అని చెప్పారు.

ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నరు?

ప్రధాని మోదీకి ప్రైవేటు పిచ్చి పట్టుకుంది. చివరికి కరెంటు కూడా. కరెంటు ప్రైవేటు చేసి నాకొక ఆర్డర్ ఇచ్చిండు. రైతుల బోరు మోటార్ల కాడ మీటర్లు పెట్టాలన్నడు. తల తెగిపడ్డా నేను పెట్టనన్న. ఏడాదికి ఐదువేల కోట్లు మీ రాష్ట్రానికి వచ్చేది కట్ చేస్తామన్నడు. మనకు రూ.25 వేల కోట్లు నష్టం చేసిండు మోదీ. కేంద్రం 157 మెడికల్ కాలేజీలు పెడితే ఒక్కటి కూడా తెలంగాణకు ఇవ్వలేదు. నవోదయ పాఠశాలలను కూడా మంజూరు చేయలేదు. ఇలాంటి బీజేపీ వాళ్లు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు? ప్రజలు నిలదీయాలి.

సీఎం కాన్వాయ్‌ను తనిఖీ చేసిన పోలీసులు

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు వచ్చిన సీఎం కేసీఆర్ కాన్వాయ్ వాహనాలను నిజామాబాద్ బైపాస్ రోడ్డు మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో వచ్చి వెళ్లగా.. రోడ్డుపై వెళ్తున్న కాన్వాయి వాహనాలను పోలీసులు తనిఖీలు చేశారు.



నేడు కోనాయిపల్లికి కేసీఆర్

- వేంకటేశ్వరస్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలు ఉంచి పూజలు
- 1985 నుంచీ ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్న కేసీఆర్
- నాడు వెంకన్న ఆశీస్సులతోనే టీఆర్ఎస్ పార్టీ స్థాపన



కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయం

సాక్షి, సిద్దిపేట/నంగునూరు: ఎన్నికల సమయం వచ్చిందంటే చాలు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయం చర్చనీయాంశంగా మారుతుంది. ఎందుకంటే ఈ ఆలయం బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు సెంటిమెంట్. ఆయన ఏ పని చేపట్టినా మొదట ఇక్కడి వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి, ఆశీస్సులు తీసుకున్నాకే మొదలుపెడతారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్, కామారెడ్డిల నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్, సిద్దిపేట నుంచి పోటీ చేస్తున్న హరీశ్‌రావు ఇద్దరూ తమ నామినేషన్ పత్రాలతో శనివారం ఈ ఆలయానికి వస్తున్నారు. వేంకటేశ్వర స్వామి వద్ద ఆ పత్రాలను ఉంచి పూజలు చేశాక వాటిపై సంతకాలు చేయనున్నారు. వారు ఈ నెల 9న ఆలయానికి రానున్నట్టు ప్రకటించినా ముందుగానే వస్తున్నారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌లో చేపట్టిన రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం శుక్రవారంతో ముగిసింది. దీంతో ముందుగానే కోనాయిపల్లి వెళ్లి ప్రత్యేక పూజలు చేయాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ నెల 9న కేసీఆర్ తన నామినేషన్లను దాఖలు చేయనున్నారు.

1985 నుంచీ సంప్రదాయంగా..


కేసీఆర్ 1985 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే సమయంలో కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశా రు. ఆ ఎన్నికల్లో గెలవడంతో కోనాయిపల్లి ఆల యం ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. 1989, 1994, 1999, 2004, 2009, 2014, 2018.. ఇలా ప్రతి ఎన్నికలో ఆయన ఈ ఆలయంలో పూజలు చేశాకే నామినేషన్ వేస్తూ వచ్చారు. మంత్రి టి.హరీశ్‌రావు నామినేషన్‌కు ముందు కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశాకే నామినేషన్ వేస్తున్నారు.

వెంకన్న ఆశీస్సులతోనే ఉద్యమంలోకి..

2001లో డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్ టీడీపీతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేసి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోకి దిగారు. ఆ సమయంలోనూ కోనాయిపల్లి ఆలయంలో పూజలు చేశారు. హైదరాబాద్‌లోని జలదృశ్యంలో టీఆర్ఎస్‌ని స్థాపిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రం ఏర్పడేదాకా పార్టీ చేపట్టే కార్యక్రమాలను ఇక్కడి నుంచీ ప్రారంభించారు.

రెండు సీట్లు రాని బీజేపీ బీసీని సీఎంను చేస్తుందా?

- 'మీట్ ది ప్రెస్'లో మంత్రి తలసాని
- మాది ఏ టీమ్.. మేం హ్యాట్రిక్ కొట్టడం ఖాయం



సాక్షి, హైదరాబాద్: గత ఎన్నికల్లో రెండు సీట్లు కూడా గెలవని బీజేపీ.. ఇప్పుడు బీసీలకు సీఎం పదవి అనడం హాస్యాస్పదమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎద్దేవా చేశారు. ఏదైనా చెప్పేముందు దానిలో వాస్తవికత ఉండాలని అన్నారు. సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తామన డం కొందరికి ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాము ఏ పార్టీకీ బీ టీమ్ కాదని తలసాని స్పష్టం చేశారు. తమది ఏ టీమ్ అని, సింగిల్ గానే విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధే తమను గెలిపిస్తుందన్నారు. బీఆర్ఎస్‌కు తగినన్ని సీట్లు రావనే ప్రశ్నే ఉత్పన్నం కాదని, 78 సీట్లతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి హ్యాట్రిక్ కొట్టబోతున్నామని చెప్పారు. కేంద్రంలోనూ కీలక భూమిక పోషిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు లేరు!

పోటీ చేసేందుకు తగిన అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి లేరని తలసాని విమర్శించారు. ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన 27 మందికి సీట్లివ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయిన వారికి వెంటనే సీట్లు ఇస్తోందన్నారు. బల్దియా ఎన్నికల్లో ఎక్కువ మంది బీజేపీ కార్పొరేటర్లు గెలిచినప్పటికీ ఇప్పుడా పరిస్థితి లేదని చెప్పారు. బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్రం మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తేవడం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆడిన డ్రామా అని విమర్శించారు. తాము అమలు చేస్తున్న పథకాలను దేశమే కాపీ కొడుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజలు ఓటువేసే హక్కును ఉపయోగించుకోవాలని, ఓట్లు వేయరనే అపప్రదను చెరిపి వేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో టీడీపీ పోటీ చేయకపోవడం, చంద్రబాబు అరెస్టు, తదితర పరిణామాల ప్రభావం ఇక్కడ ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యల్ని బీఆర్ఎస్ ప్రభుత్వమే పరిష్కరిస్తుందంటూ, తమ(ఎమ్మెల్యేల)ఇళ్ల స్థలాలు కూడా ఆగిపోయాయని వ్యాఖ్యానించారు.



దేహధారికి బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం ఎలా కలుగుతాయో, అలాగే మరో దేహం లభించడం కూడాను.
– హైందవ ధర్మం

ఫోకస్

సాక్షి
శనివారం, 4 నవంబర్ 2023

కృత్రిమ మేధపై మథనం!

సృష్టిలో నూతనత్వాన్ని ఆహ్వానించటం, హత్తుకోవటం, తలకెత్తుకోవటం మనిషి సహజ లక్షణం. అదే లేకుంటే ప్రపంచంలో ఇంత అభివృద్ధి సాధ్యమయ్యేది కాదు. కానీ కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) విషయంలో మొదటినుంచీ అనుమాన దృక్కులు తప్పడం లేదు. ఆరంభంలో టెక్ సిబ్బందిని మాత్రమే వణికించిన ఏఐ ఇప్పుడు సమస్త జీవన రంగాల్లోకి చొచ్చుకొస్తూ అందరినీ భయపెడుతోంది. ఈ వారం చోటుచేసుకున్న రెండు పరిణామాలు ఈ భయసందేహాలు కేవలం అపోహల పర్యవసానం మాత్రమే కాదనీ, చేదు వాస్తవమనీ రుజువు చేస్తున్నాయి. వ్యూహాత్మకమైన అణుబాంబుల వ్యవస్థలోకి కూడా అది చొరబడితే ఏమవుతుందన్న ఆందోళనలు మొదలయ్యాయి. ఏఐకి కళ్లెం బిగించేందుకు ఉద్దేశించిన ఉత్తర్వులపై ఈ వారం మొదట్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేయగా, బ్రిటన్‌లో ఈ విషయమై అమెరికా, చైనా, భారత్ సహా 28 దేశాలు పాల్గొన్న రెండు రోజుల శిఖరాగ్ర సదస్సు గురువారం ముగిసింది. ఇందులో ప్రభుత్వాల ప్రతినిధులతోపాటు కంప్యూటర్ శాస్త్రవేత్తలు, టెక్ దిగ్గజాల ప్రతినిధులు కూడా పాల్గొనటం సమస్య తీవ్రతను తెలియజెబుతోంది. ఏఐతో ఏర్పడే అవకాశాలతోపాటు, అందులో చోటుచేసుకుంటున్న నూతన ఆవిష్కరణలు మానవాళికి పెనుముప్పు కలిగించే ఆస్కారం ఉందన్న అంశంలో అన్ని దేశాల మధ్యా ఏకాభిప్రాయం కుదిరింది. శిఖరాగ్ర సదస్సుకు ఎంచుకున్న బ్లెచ్లీ పార్క్ చరిత్రాత్మకమైనది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జర్మనీ రూపొందించి, దేశదేశాల్లోని తన సైనిక బలగాలకూ పంపే 'నిగూఢ సంకేతాన్ని' ఛేదించింది అక్కడే. అది పంపే సందేశాలేమిటో తెలియక కాకలు తీరిన నిపుణులే తలలు పట్టుకున్న తరుణంలో ఈ పరిణామం జర్మనీ కట్టడికి, రెండో ప్రపంచ యుద్ధ ముగింపునకు కారణమైంది.

'ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి' అన్న చందంగా ఏఐ తయారవటం వాస్తవం. అంతక్రితం మాటెలావున్నా ఏడెనిమిది నెలల క్రితం రంగంలోకొచ్చిన చాట్‌జీపీటీ అందరినీ ఒక్కసారి దిగ్భ్రమపరిచింది. దాన్నుంచి తేరుకునే లోగానే చాట్‌జీపీటీ–4 కూడా అందుబాటులోకొచ్చింది. దాని సాయంతో పాఠశాల, కళాశాలల విద్యార్థులు గణిత శాస్త్ర సమస్యలను క్షణాల్లో ఛేదిస్తున్నారనీ, మెదడుకు పదును పెట్టడం మానేశారనీ మొదట్లో వినగా... అమెరికావంటి దేశాల్లో ఏఐని ఉపయోగించి పరిశోధక పత్రాలు కూడా తయారు చేశారని తర్వాత బయటపడింది. లక్షల మంది బుర్రలు బద్దలుకొట్టుకునే జటిలమైన సమస్యకు ఏఐ క్షణంలో పరిష్కారం చూపుతుందనీ, దాని సాయంతో భారీ సొరంగాల తవ్వకాల్లో ఎదురయ్యే కష్టాలను అవలీలగా అధిగమించవచ్చనీ రుజువవుతూనే వుంది. ప్రయోజనాల సంగతి తేలినా పూర్తి స్థాయిలో వినియోగంలోకొస్తే ఏమవుతుందోనన్న బెంగ అందరిలోనూ గూడుకట్టుకుని వుంది. ఆ మధ్య స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులను సర్వే చేయగా, వారిలో మూడోవంతుకు మించి ఏఐ వల్ల అనర్థాలున్నాయని అభిప్రాయపడ్డారు. మొన్న మార్చిలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వాజ్నిక్ సహా 1,300 మంది ఏఐ పరిశోధనలను ఆర్నెల్లపాటు నిలిపివేయాలని పిలుపునిచ్చారు. ఎవరు ఏం చెప్పినా వేలంవెర్రి ఆగదు. ఏఐ విషయంలో జరిగింది అదే. దానివల్ల కలిగే ముప్పేమిటో దాదాపు అన్ని దేశాల్లోనూ రుజువవుతూనే వుంది. క్షణాల్లో ఉన్నది లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చూపి మాయ చేయటం ఏఐకి చాలా సులభమని తేలిపోయింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ రష్యా అధ్యక్షుడు పుతిన్ సేనలకు దాసోహమంటున్న వీడియో కొన్నాళ్లు హల్‌చల్ చేసింది. 'నన్ను అడగకుండా, నా ప్రమేయం లేకుండా, నాకు అసలు తెలియకుండా ఏదో ఒకరోజు నన్ను ఏఐ ద్వారా దృశ్యబద్ధం చేసే ప్రమాదమున్నద'ని పేర్కొంటూ బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ న్యాయస్థానం తలుపుతట్టాడు. ఉత్తర్వులు కూడా పొందాడు.

దేనికైనా అనుకూల, ప్రతికూల అంశాలు రెండూ వుంటాయి. సాంకేతికత అనేది ఎప్పుడూ రెండువైపులా పదునున్న కత్తి. ఏఐతో ఒక మనిషికి జీవం పోయొచ్చు. వేలాదిమంది కుత్తుకలు తెగ్గొట్టవచ్చు. తులనాత్మకంగా చూస్తే మొదటి అంశంలో ఏఐ పురోగతి నత్తనడకన వుండగా... ఉద్దేశపూర్వకంగా, సమాజానికి నష్టం కలిగించే రీతిలో దాన్ని ఉపయోగించుకునే ధోరణులు వేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వాల నియంత్రణలు సృజనాత్మకతకు అవరోధమవుతాయని, కట్టడిలో మనుగడ సాగించే సమాజాలు ఎదగవని ఒకప్పుడు నమ్మేవారు. సామాజిక మాధ్యమాల రాకతో కాలం మారింది. ఇప్పుడు ప్రభుత్వాలే చడీచప్పుడూ లేకుండా వాటి సాయంతో జనంలో ఆమోదాన్ని సృష్టించుకుంటూ బతకనేరుస్తున్న వైనాన్ని చూస్తున్నాం. లాభార్జనే తప్ప మరేం పట్టని కార్పొరేట్ సంస్థల తీరు కూడా కళ్లముందే వుంది. కనుక ఏఐ నియంత్రణలో పాటించాల్సిన ధర్మాలేమిటో, పౌరుల గోప్యత పరిరక్షణకు ఏం చేయాలో, స్వీయభద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో నిర్ణయించటం అంత సులభం కాదు. అమెరికా వరకూ తీసుకుంటే బైడెన్ ఉత్తర్వులిచ్చారుగానీ, వాటిని పెద్దగా బలంలేని ప్రతినిధుల సభలో ఆమోదింపజేసుకోవటం కష్టమే. బ్రిటన్ కూడా సొంతానికి ఒక నిబంధనావళి రూపొందించుకుంది. చైనా, యూరోపియన్ యూనియన్‌లు సైతం అంతే. మన దేశం ఇంకా ఆ దిశగా నిర్ణయం తీసుకోలేదు. ఏదేమైనా అల్లావుద్దీన్ అద్భుత దీపం నుంచి బయటికొచ్చిన భూతాన్ని తెలివిగా వినియోగించుకోవటమెలాగో, అదుపు చేయటమెలాగో గ్రహించటం ప్రపంచానికి పెను సవాలే. దీన్ని మానవాళి ఎలా అధిగమిస్తుందో చూడాలి.

వాయు కాలుష్యానికి విరుగుడు

ఢిల్లీ మహానగరం ఇప్పటికే వాయుకాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతోంది. చలిని తట్టుకోవడానికి చలిమంటలు వేయడం, పంట పూర్తయిన తర్వాత కొయ్యకాళ్లను కాల్చడం, రవాణా వాహనాల నుంచి వచ్చే పొగ, అవి నిరంతరం లేపే ధూళి... ఇవన్నీ వాయు నాణ్యతను దారుణంగా తగ్గిస్తున్నాయి. పైగా రానున్నది దీపావళి పండుగ కావడంతో ఈ ఆందోళన మరింత పెరుగుతోంది. వాయు కాలుష్య సమస్య ఢిల్లీలో తీవ్రంగా ఉన్నప్పటికీ, దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లోనూ ఇది పట్టించుకోవాల్సిన అంశమే. ఈ తీవ్ర సమస్యను ఎదుర్కోవడానికి, ఉద్గారాల జాబితా అని చెబుతున్న కారకాల పరిమాణంపై కేవల సమాచారం సరిపోదు. ఈ ఉద్గారాల మూలాలపై డేటా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ప్రభావవంతమైన వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు. ప్రాథమికంగా ఉన్న సమాచారంతో కొన్ని సమర్థవంత మార్గాలనైతే చేపట్టవచ్చు.

మనం దీపావళికి దగ్గరవుతున్న కొద్దీ, గాలి నాణ్యత గురించిన ఆందోళన 'జాతీయ రాజధాని ప్రాంతం'(నేషనల్ క్యాపిటల్ రీజియన్ – ఢిల్లీ)లో ఊపందుకుంటుంది. ఈ ఏడాది కూడా అదే జరుగుతోంది. చలిని తట్టుకోవడానికి కలపను కాల్చడం, తదుపరి పంటకు నేలను సిద్ధం చేయడం కోసం పంట కోతల తర్వాత మిగిలిన చెత్తను తగులబెట్టడం, రవాణా వాహనాల నుంచి ఉద్గారాలు వెలువడటం, అనేక మూలాధారాల నుండి వచ్చే ధూళి కలిసి ఒక ప్రాణాంతక మిశ్రమాన్ని సృష్టిస్తాయి. కొన్నేళ్లుగా ప్రజలు తమ నివాసాల నుంచి బయటకు రావడం కూడా క్షేమకరం కాని పరిస్థితి. స్పష్టంగా చెప్పాలంటే, ఇది కొనసాగకూడదు. పరిష్కారాన్ని కనుగొనడానికి, ఢిల్లీ ప్రభుత్వం గాలి నాణ్యతా నిర్వహణ కోసం ఒక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది.

ఈ తీవ్ర సమస్యను ఎదుర్కోవటానికి వ్యూహాలను రూపొందించడం కోసం, ఉద్గారాల జాబితా అని చెబుతున్న కాలుష్య కారకాల పరిమాణంపై కేవలం సమాచారం సరిపోదు. ఈ ఉద్గారాల మూలాలపై డేటా అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే ప్రభావవంతమైన వ్యూహాలను అభివృద్ధి చేయవచ్చు. వాటి కాలానుగుణమైన వైవిధ్యాలతోపాటు, ఈ ప్రతి ఒక్క మూలాధారం నుండి ఉద్గారాల వాటా ఎంత అనేది కీలకం. గాలి నాణ్యతా నిపుణులు దీనినే మూల విభజనగా సూచిస్తారు. సరళంగా చెప్పాలంటే, మనం ఎదుర్కొనే కాలుష్య స్థాయికి వివిధ కార్యకలాపాలు ఎలా కారణం అవుతున్నాయనేది ఇది మనకు తెలియజేస్తుంది.

ఈ ప్రతి మూలాధారం నుండి వచ్చే మొత్తం ఉద్గారాల వాటా ఏడాది పొడవునా లేదా రోజంతా కూడా స్థిరంగా ఉండదు. ఇంకా, అవి నగరంలోని వివిధ ప్రాంతాలలో కూడా మారుతూ ఉంటాయి. అందువల్ల, రోజులో ఏ సమయంలో లేదా సంవత్సరంలో ఏ కాలంలో, లేదా నగరంలోని ఏయే ప్రదేశాలలో కాలుష్యానికి దోహదపడుతున్నవి ఏమిటన్నది అర్థం చేసుకోవడం ముఖ్యం.

పనికొచ్చే అధ్యయనాలు

నిపుణులు మూలాలను కనుగొనడానికి ప్రయత్నించినప్పుడు సాధారణంగా నాలుగు ముఖ్యమైన అధ్యయనాలను సూచిస్తుంటారు. అవి: ఒకటి, ఢిల్లీ కోసం... ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాన్పూర్ సమర్పించిన కాలుష్య మూలాల విభజన, మూలాల జాబితా (2015); రెండు, ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ (తేరి) అధ్యయనం (2018); మూడు, ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యయనం (2018); ఇక నాలుగవది, సిస్టమ్ ఆఫ్ ఎయిర్–క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రీసెర్చ్(సఫర్) అధ్యయనం (2018).

గాలి కాలుష్యానికి వివిధ కారకాలు అందిస్తున్న సాపేక్ష సహకారంలో గణనీయ స్థాయిలో సీజన్ పరమైన తేడాలు ఉన్నట్లు ఈ



అధ్యయనాలు చూపుతున్నాయి. వేసవిలో, ధూళి ప్రభావం దాదాపు 31–34 శాతం వరకు పెరుగుతుంది. శీతాకాలంలో దాని వాటా 6–15 శాతం వరకు తగ్గుతుంది. వాహనాలు, పరిశ్రమలు, బయోమాస్ దహనం తోడ్పాటు శీతాకాలంలో దాదాపు 85–94 శాతం వరకు పెరుగుతుంది. ముఖ్యంగా ద్వితీయ కణాల వాటా (సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, అమ్మోనియా, అస్థిర కర్బన సమ్మేళనాలు వంటి దహన మూలాల నుండి వాతావరణంలో ఏర్పడేవి) శీతాకాలంలో 26–30 శాతంగా, వేసవిలో 15–17 శాతంగా ఉంటుంది.

స్పష్టంగా, రవాణా, రహదారిపై ధూళి అనేవి సంవత్సరం పొడవునా గాలి కాలుష్యానికి ముఖ్యమైన దోహదకారులు. అయితే, అధ్యయనాలు జరిగిన సమయంలో కొయ్యకాళ్ల దహనం ప్రధాన సమస్యగా లేదు. అందువల్ల దాని ప్రభావం గురించి తగినంత సమాచారం లేదు. అయినప్పటికీ, గాలి కాలుష్యానికి అధికంగా దోహదం చేస్తున్న కొయ్యకాళ్ల దహనం ఒక నెల వ్యవధిలో మాత్రమే జరుగుతుంది.

ఆకుపచ్చటి రోడ్లు

రహదారిపై ధూళిని తగ్గించడానికి, మోటారు వాహనాల నుండి ఉద్గారాలను తగ్గించడానికి తీసుకోగల చర్యలు దీర్ఘకాలికమైనవి. రహదారి దుమ్ముతో వ్యవహరించడానికి రోడ్డు పక్కలను పచ్చగా మార్చడం లేదా వాటిపై నీటిని చిలకరించడానికి గట్టి ప్రయత్నం అవసరం. ఢిల్లీ ప్రభుత్వం దీన్ని తప్పనిసరి చేయాలి.

రవాణా రంగం నుండి ఉద్గారాలను తగ్గించడానికి అనేక విధాలుగా ప్రయత్నించవచ్చు. వాటిలో ముఖ్యమైనది వ్యక్తిగత మోటారు వాహనాల నుండి ప్రజా రవాణాకు మారేలా గణనీయంగా ప్రభావితం చేయడం. ఢిల్లీ నగరంలో ఇప్పటికే 400 కిలోమీటర్ల మెట్రో రైలు నెట్‌వర్క్ పనిచేస్తుండగా, చిట్టచివరి గమ్యం వరకూ అనుసంధానం లేకపోవడం వల్ల దాని వినియోగానికి ఆటంకం ఏర్పడుతోంది. మెట్రో రైలు వ్యవస్థను పూర్తి చేయడానికి, పబ్లిక్ బస్సు వ్యవస్థలను విస్తృతంగా పెంచడం, మెరుగుపరచడం ఎంతగానో అవసరం. వ్యక్తిగత మోటారు వాహన వినియోగదారులు కూడా ఆకర్షితులయ్యేలా అధిక నాణ్యతా సేవలను అందించే స్థానిక బస్సు సేవలను నిర్వహించడం అవసరం.

ఇరుగుపొరుగు వారికి సేవ చేయడానికి స్థానిక సర్క్యులేటర్ సేవలను నిర్వహించడం కూడా సరైన దిశలో ఒక అడుగు. అత్యధికంగా ట్రాఫిక్ ఉండే రహదారులను గుర్తించడం ద్వారా వాటిని వన్‌వేలుగా మార్చడం, ట్రాఫిక్ ప్రవాహాన్ని సులభతరం చేయడానికి, పనిలేకుండా ఉన్న వాహనాల నుండి ఉద్గారాలను తగ్గించడానికి దోహదపడుతుంది. ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్‌ను (ఐటీఎంఎస్) పరిచయం చేయడం కూడా ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచడానికీ, నిష్క్రియాత్మక ఉద్గారాలను తగ్గించడానికీ మరొక మార్గం. ఇటీవల ప్రతిపాదించిన ప్రీమియం బస్ అగ్రిగేటర్ పథకం సరైన దిశలో ఒక అడుగు.

పార్కింగ్ రుసుములను పెంచడంతోపాటు, రద్దీ సమయంలో అధికంగా వసూలు చేసే వ్యవస్థను ప్రవేశపెట్టడం వలన ప్రజలు వారి వ్యక్తిగత మోటారు వాహనాలను ఉపయోగించకుండా నిరోధించవచ్చు. ఎలక్ట్రిక్ చలనశీలతకు ఇటీవల ఏర్పడుతున్న ప్రాధాన్యత కూడా సరైన దిశలో మరొక అడుగు అని చెప్పాలి. ఎందుకంటే ఎలక్ట్రిక్ వాహనాలు వాస్తవంగా ఎటువంటి కాలుష్యాన్నీ విడుదల చేయవు.

చలికాలంలో పేదలకు ఆశ్రయాలు

మరొక ముఖ్యమైన కాలుష్య సహకారి ఏదంటే, ముఖ్యంగా చలికాలంలో వెచ్చగా ఉండటానికి పేద పౌరులు కట్టెలను కాల్చడం. ఈ సమస్యను తగ్గించడానికి, నిరాశ్రయులైన వారి కోసం పెద్ద సంఖ్యలో ఆశ్రయాలను ఏర్పరిచేందుకు అవకాశాలను అన్వేషించాలి. ఈ ఆశ్రయాలను స్వచ్ఛమైన శక్తి రూపాలను ఉపయోగించి వెచ్చగా ఉంచవచ్చు. ఇటువంటి ఆశ్రయాలు పేదలకు మరింత సౌకర్యవంతమైన గూడును అందించడంతోపాటు వాయు కాలుష్యాన్ని తగ్గించడం అనే ద్వంద్వ ప్రయోజనాలకు కూడా చక్కగా ఉపయోగపడతాయి. అనేక ఫ్లై ఓవర్ల కింద ఉన్న స్థలాన్ని దీని కోసం ప్రయోజనకరంగా ఉపయోగించవచ్చు.

ఇంకా, దీన్ని క్రమం తప్పకుండా పర్యవేక్షించడం కోసం రోజులో, సీజన్‌లలో, లొకేషన్లలో మూలాల విభజన డేటాను సేకరించే వ్యవస్థ అవసరం. ఢిల్లీలోని గాలి నాణ్యత సమస్యలను మరింత శాశ్వత ప్రాతిపదికన అంతం చేసేందుకు ఈ రకమైన సాధారణ డేటా ఉపయోగపడుతుంది. 'బిగ్ డేటా'కు ప్రాధాన్యత ఉంటున్న ఈ యుగంలో, ఇది ఎంతమాత్రమూ సమస్య కాకూడదు.

– అనిల్ బైజల్, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్
– ఓపీ అగర్వాల్, ఇండియన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాబోయ్!



అఫ్గానిస్తాన్–పాకిస్తాన్ సరిహద్దులో జరుగుతున్న దాని విస్తృతి అర్థం కావడానికి మాత్రమే ఇది చెబుతున్నాను. విషాదాలను పోల్చడం లేదు. సంఖ్యలు సరైన దృక్కోణం ఇవ్వగలవు. గాజా మొత్తం జనాభా 22 లక్షలు. ఒక్క రాత్రిలో పాకిస్తాన్ స్థానభ్రంశం చేసిన ఆఫ్ఘాన్ శరణార్థుల సంఖ్య 17 లక్షలు.
– ఐమన్, కరాచీ వ్యాఖ్యాత

కొత్త సంపత్తి



కొందరు బెంగాలీ బ్లూ–కాలర్ వర్కర్ల (శ్రామికులు)తో మాట్లాడిన తర్వాత నాకొకటి అర్థమైంది... ఆర్థికంగా తక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఇప్పుడు హిందీ అనేది అదనపు ఆశల భాష! హిందీ రావడం సమర్థతకూ, సంపత్తికీ చిహ్నంగా భావిస్తున్నారు... మధ్యతరగతి వాళ్లు ఇంగ్లీషు గురించి అనుకుంటున్నట్టుగానే.
– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

పెద్దల దీవెన



కొన్ని వారాలుగా ఇండియాకు చెందిన ఒక పెద్దావిడ నా క్లినిక్‌కు వస్తోంది. ఇవ్వాళ నా కుటుంబం, పిల్లల గురించి అడిగింది. నాకు ఎనిమిదేళ్ల అబ్బాయి ఉన్నాడని చెప్పాను. 100 దిర్హామ్ తీసి, 'బేటా, నా తరఫున పిల్లాడికి ఇవ్వు' అంది. ఇది నాకు ఒకింత కల్చర్ షాక్! అయినా, 'అమ్మా, మీ ఆశీర్వాదం' అన్నాను.
– ఇద్రీస్ ముబారిక్, దుబాయి ఎండోక్రైనాలజిస్ట్

బతుకుతామా?



కాలుష్యపు నెలల్లో సెలవులు ప్రకటించడం లేదా ఇంటి నుంచి పనిచేసే వీలు కల్పించడం ఢిల్లీ ప్రభుత్వానికి ఎంత సాధ్యమో తెలీదుగానీ నేనైతే చచ్చిపోయేలా ఉన్నా.
– జె. గరిమ, వ్యాఖ్యాత

అసలైన సంతోషం



పీఈటీ స్కాన్ ప్రకారం, నాకు క్యాన్సర్ పోయిందని నిర్ధారణ కావడం సంతోషంగా ఉంది. అంటే నేను అవయవ దానం చేయొచ్చు, జుట్టును కూడా ఇచ్చే అవకాశం ఉన్నందుకు మరీ సంతోషం.
– నవజోత్ సిద్ధు, మాజీ ఎమ్మెల్యే

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రష్యా సోషలిస్ట్ విప్లవం – ఎన్నికలు

అక్టోబర్ అనగానే 1917 (అక్టోబర్ 25) రష్యా సోషలిస్ట్ విప్లవం, దాని నాయకులు కామ్రేడ్ లెనిన్, కామ్రేడ్ స్టాలిన్‌లు గుర్తుకు వస్తారు. రష్యా విప్లవం ప్రపంచ శ్రామిక వర్గానికి గొప్ప ఉత్సాహం, ధైర్యం, ప్రేరణలను కలిగించింది. సోషలిస్ట్ విప్లవం విజయవంతం అయిన వెంటనే కింది నుండి శ్రామిక ప్రజాస్వామ్య వ్యవస్థ 'సోవియట్' వ్యవస్థను ప్రజల ప్రభుత్వ వ్యవస్థగా మార్చింది. కార్మిక వర్గ నాయకత్వంలో పీడిత వర్గాల కోసం ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా నూతన సోషలిస్ట్ రాజ్యాంగం ఏర్పాటు అయింది. సోషలిజం కమ్యూనిస్ట్ సమాజానికి తొలి దశ మాత్రమే. సోషలిజంలో శక్తి కొద్దీ పనీ, పనిని బట్టి ఫలితమూ ఉంటాయి. ఆ తరువాత 'శక్తి కొద్దీ పనీ, అవసరం మేరకు ఫలితం' అనే సూత్రం ప్రకారం పంపిణీ జరుగుతుంది. సామ్యవాద రష్యాలోనూ అదే జరిగింది.

వ్యక్తిగత ఆస్తిగా ఉన్న ఉత్పత్తి సాధనాలైన వ్యవసాయ భూమి, గనులు, యంత్రాలు వంటివి జాతీయం అయ్యాయి. పెట్టుబడిదారుల ఆస్తినీ, భూస్వాముల ఆస్తినీ మొదటగా జాతీయం చేశారు. చిన్న ఉత్పత్తి దారులు అయిన రైతులు, చిన్న పరిశ్రమలు నడిపే వారి ఆస్తులను రద్దు చేయడం కాకుండా క్రమంగా చైతన్య వంతం చేస్తూ వ్యక్తిగత ఆస్తి నుండి జాతీయం అయ్యే విధంగా మార్పునకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వ క్షేత్రాలు, సమష్టి క్షేత్రాలు, వ్యక్తి గత ఆస్తి ఉన్నాయి. సమష్టి వ్యవసాయ క్షేత్రాల లోకి రాకుండా ఉండే చిన్న రైతులూ, చిన్న పరిశ్రమలు నడుపుకునే వారూ తమ ఇష్టాన్ని బట్టి వ్యవహరించడానికి అనుమతి ఇచ్చారు. ఏ రూపంలోనైనా ఆధిపత్య భావజాలాన్ని వ్యతిరేకిస్తూ సమానత్వ సంస్కృతిని అభివృద్ధి పరిచినారు.

బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థకూ, సోషలిస్ట్ ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థకూ మధ్య తేడా ఉంటుంది. బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికలలో కోట్లు డబ్బును ఎరగా వేయడానికి అవకాశం ఉంది. కుల మత రాజకీయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. సోవియట్ ఎన్నికలలో వేల కోట్ల ప్రజల డబ్బును వృధా చేయడం కానీ; కుల, మత రాజకీయాలు కానీ లేకుండా ఎన్నికలు జరిగేవి. కింది నుంచీ విప్లవ కమిటీలూ, ప్రజా సంఘాలూ సోవియట్ (శ్రామిక ప్రభుత్వం)లను ఎన్నుకుంటాయి. కింది యూనిట్ తన పై యూనిట్ నూ, అది దాని పై యూనిట్‌నూ... ఇలా క్రమంగా కేంద్ర స్థాయి వరకూ ఈ ఎన్నిక విధానం కొనసాగేది. రైతాంగం, మహిళలు, కార్మికుల ప్రాతినిధ్యం తప్పనిసరిగా సోవియట్‌లలో ఉండే విధంగా ఎన్నికలు ఉండేవి. అలాగే కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుల ప్రాతినిధ్యం కూడా విధిగా ఉండేది.

ప్రజల నుండి ఎన్నికయ్యే సోవియట్ ఎన్నికల విధానం శ్రామిక ప్రజల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాల అభివృద్ధికి ఉపయోగ పడింది. అదే నిజమైన శ్రామిక ప్రజాస్వామ్యం. ప్రపంచ జనాభాలో నాలుగవ వంతు సోషలిస్ట్ రాజ్యాలు నెలకొన్న గొప్ప అనుభవం నుండి ప్రపంచ వ్యాపితంగా వుండే కమ్యూనిస్టులు గుణపాఠాలు తీసుకోవడం తిరిగి పురోగమించడం తప్పనిసరిగా జరిగి తీరుతుంది.

– జంపన్న, మార్క్సిస్ట్ లెనినిస్ట్ నాయకుడు

వీళ్లా బీసీ కులగణన చేసేది?

అభిప్రాయం



జూలూరు గౌరీశంకర్

దేశాన్నేలిన పెద్ద జాతీయ పార్టీల నేతలారా! బహుజనులను 75 ఏళ్ళుగా అణగదొక్కి అన్ని రంగాల్లో ఏ మాత్రం ఎదగకుండా చేసిన దేశ నేతలారా! బహుజనులమైన మేం మీ కండ్లకు ఎలా కనిపిస్తున్నామయ్యా? బీసీలంటే ఓట్లేసే యంత్రాలుగా మార్చిన మీ పార్టీలు మా సౌఖ్యం కోసం నిలుస్తామంటే ఎంతవరకు నమ్ముతాం? 75 ఏళ్ళు బీసీల కులగణన చేయమంటే ఈసడించుకున్నవాళ్ళు, చట్టసభల్లో మా రిజర్వేషన్లు ఏవీ అని అడిగితే తలలు తిప్పేసుకున్న వాళ్ళు, ఎన్నికలొచ్చేసరికి ఒక పార్టీ బీసీ ముఖ్యమంత్రియనీ, మరో పార్టీ బీసీ కులగణన చేస్తామనీ చెబితే మేం వినుకుంటూ ఉండాలా?

ఇదేం చోద్యం? ఇదేం లెక్క? చెప్పండి. తెలంగాణ వచ్చినాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు 1000కి పైగా పెట్టారు. ఈ పని మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేకపోయారు? బ్యాంకుల గ్యారంటీ లేకుండా లక్షరూపాయల సాయం బీసీలకు ఎందుకు అందించలేకపోయారు?

తెలంగాణలో ఎన్నికల వేడి రాజుకున్న ఈ సందర్భంలో అనేక అంశాలు చర్చకు వస్తున్నాయి. అవి కొన్ని ఆశ్చర్యాన్ని కూడా కలిగిస్తున్నాయి. దేశంలో అత్యవసర పరిస్థితి నెలకొల్పిన పార్టీ, ఎన్‌కౌంటర్లను సృష్టించిన పార్టీలో లౌకికతత్వాన్ని చూసే ప్రజాస్వామిక వాదులు కూడా ఉండడం బాధాకరమైన విషయం. కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతలు ఎన్నికల వేళలో మాట్లాడుతున్న మాటలకూ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకీ ఏమన్నా సంబంధం ఉందా? దేశంలో ఎప్పుడో చేయాల్సిన కులగణనను చేయకుండా వదిలిపెట్టిన పార్టీ తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని చెబుతోంది. ఎవరికి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ తెచ్చుకున్నామో, ఏ బుర్రమీసాల పెత్తందార్ల సంస్కృతి ఆధిపత్యం వద్దని తెగించి చెప్పామో తిరిగి వాళ్ళే తెలంగాణలో కుర్చీల కోసం మాట్లాడుతున్న మాటలు వింటే ఆశ్చర్యమేస్తోంది.

ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కుర్చీలకు అంటిపెట్టుకుని ఉన్న వాళ్ళే ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి రావాలని తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ 'ఉదయపూర్ డిక్లరేషన్'ను బొందలో పెట్టింది నిజం కాదా? ప్రతి ఎంపీ నియోజకవర్గ పరిధిలో రెండు సీట్లు బీసీలకు ఇస్తామని ప్రకటించి తెలంగాణలో ఇరవై ఒక్క సీట్లు



మాత్రమే కాంగ్రెస్ ఇచ్చింది. ఆ ఇచ్చిన సీట్లన్నీ ఎంఐఎం బలంగా ఉన్న ఐదు స్థానాల్లో ఇచ్చింది. మొత్తంగా ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 34 సీట్లు ఇవ్వాలి. మరి ఆ పనినే చేయలేని కాంగ్రెస్ తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేస్తామంటే బీసీలు ఎట్లా నమ్ముతారు? ఉదయపూర్ డిక్లరేషనే కాదు 'జైపూర్ డిక్లరేషన్'కు కూడా కాంగ్రెస్ తిలోదకాలు ఇచ్చింది. కుటుంబంలో ఒకరికే సీటు ఇస్తామని చెప్పిన జైపూర్ డిక్లరేషన్ నిబంధనను కాంగ్రెస్ ఎంతవరకు పాటించిందో ఆలోచించుకోవాలి. హిందూ కోడ్ బిల్లు, బీసీల జనగణన విషయమై, వెనుకబడ్డ బీసీల హక్కుల గురించి పార్లమెంట్‌లో కన్నీళ్ళు పెట్టుకుని అంబేడ్కర్ ఆనాడు రాజీనామా చేసి వచ్చారు. ఇదే కాంగ్రెస్ పార్టీ ఆ రెండు పనులు చేయలేదు. స్వాతంత్ర్యం వచ్చి ఇంతకాలం గడిచినా కాంగ్రెస్ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల గురించి ఏనాడైనా మాట్లాడిందా?

తెలంగాణలో తాము అధికారానికి వస్తే బీసీనే ముఖ్యమంత్రిని చేస్తామని చెబుతున్న బీజేపీ కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఎందుకు పెట్టలేదు? కాంగ్రెస్, బీజేపీలు బీసీ జనగణనకు అడుగడుగునా అడ్డుతగిలిన వారే. వీళ్ళు కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖకు కూడా వ్యతిరేకులే. ఓట్ల కోసం సీట్ల కోసం మాత్రమే వాళ్ళు బీసీ మంత్రాన్ని జపిస్తున్నారు.

అప్పటి ప్రధానమంత్రి వీపీ సింగ్ మండల్ కమిషన్ సిఫారసులను అమలు జరుపుతున్నప్పుడు కమండలాలు ధరించిన ఒక పార్టీ విధ్వంసాలు సృష్టిస్తుంటే, మరోపార్టీ మౌనంగా చోద్యం చూసింది. వీళ్లు కులగణన చేస్తారని బీసీలు నమ్ముతారా? చేతనైతే తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల విద్యా సంస్థల్ని ఈ రెండు పార్టీలూ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో స్థాపించగలరా? దళితబంధు లాంటి పథకాన్ని దేశవ్యాపితంగా పెట్టగలరా? తెలంగాణ ప్రభుత్వ పథకాల పేర్లను మార్చి ఈ పథకాలనే అటూ ఇటూ చేసి ఇతర పార్టీలు తమ ఉనికిని చాటుకునే దశకు వచ్చాయంటే కేసీఆర్ దార్శనిక ఆలోచనలు దేశానికి రేపటి కాలానికి ఎజెండాలుగా రెపరెపలాడుతున్నాయనేగా అర్థం! ఇది తెలంగాణ సాధించిన విజయానికి చిహ్నం. ప్రజల గెలుపే ప్రజాస్వామ్యం గెలుపని ఎన్నికల్లో ప్రజలే గెలవాలన్న కేసీఆర్ ఆలోచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.

వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడెమీ చైర్మన్

ఆఖరు క్షణం

రహస్యాలలో కెల్లా పెద్ద రహస్యం మృత్యువు. ఆ మృత్యువు గురించి నిజం తెలిసినవారు అరుదుగా ఉంటారు. వేదోపనిషత్తుల్లో అక్కడక్కడ దీని గురించిన ప్రస్తావన కానవస్తుంది. ముఖ్యంగా కఠోపనిషత్తులో 'నాచికేతోపాఖ్యానం' ఈ విషయం మీదే నడుస్తుంది. 'లిజన్, హ్యుమానిటీ' (మానవులారా, వినండి) అనే గ్రంథంలో మెహెర్‌బాబా మృత్యువు గురించిన చర్చ చేశారు.

చనిపోయే క్షణం ఎలా ఉంటుందో అని కొందరు వ్యక్తులు విపరీతంగా భయపడుతుంటారు. ఎందుకంటే, ఆ క్షణంలో భరించలేనంతగా బాధ కలుగుతుందని వారు అనుకొంటారు. వాస్తవం ఏమిటంటే, జబ్బుతో ఉన్నప్పుడుగానీ, మరెప్పుడైనాగానీ, అనుభవించిన దైహిక బాధలు ఏవైనా ఉంటే, అవి అన్నీ,



జ్యోతిర్మయం

చనిపోయే ఆఖరు క్షణానికి ముందు పూర్తిగా అంతరించిపోతాయి. అందువల్ల మృత్యు సమయంలో మనిషి నరకయాతన అనుభవిస్తాడని అనటం ఒక మూఢ నమ్మకం. నిజం ఏమిటంటే, మనిషి శరీరాన్ని విడిచిపెట్టడం అనే ప్రక్రియ చాలా సులువుగా, ఏ మాత్రం నొప్పి లేకుండా జరుగుతుంది.

అయినప్పటికీ, ఈ భౌతిక ప్రపంచంతో ఆ వ్యక్తికి ఉన్న మానసిక ఉద్వేగభరితమైన బంధనాలను తెంచుకోవడం అంత తేలికగా జరిగే పని కాదు. వ్యక్తి చనిపోయాక మతపరమైన వివిధ కర్మకాండలను ఎందుకు నిర్వహిస్తారు? వాటి ప్రయోజనం ఏమిటి? అంటే, ఆ కర్మకాండలు చనిపోయిన వ్యక్తిని భౌతిక ప్రపంచంతో అతనికి వున్న బంధనాల నుండి విడిపించుతాయని.

ఉదాహరణకు, భగవంతుని నామాన్ని పునశ్చరణ చేయటమో, మత గ్రంథాన్ని పఠించటమో, చనిపోయిన వ్యక్తి బంధువులు చేస్తుంటారు. ఇలా చేయటం, మరణించిన వ్యక్తి మీదనే కాకుండా, అతడి బంధువుల మీద కూడా మంచి ప్రభావాన్ని కలుగజేస్తుందంటారు. ఎలాగంటే, అది వారి మధ్య ఉన్న సంస్కారాల బంధాన్ని తొలగించుకోవటంలో సహాయ పడుతుంది. అలా కాకుండా ఏడ్చి, పెడబొబ్బలు పెడితే వారి మధ్య గల బంధనాలను వదులు చేసే బదులు మరింతగా బిగుసుకుపోయేట్టు చేస్తాయవి. చనిపోయే ముందు క్షణంలో ఆ వ్యక్తికి ఉన్న ఆలోచన భగవంతుని గురించి గానీ, గురువు గురించి గానీ అయితే, ఆ వ్యక్తి మోక్షం పొందుతాడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.సప్తమి రా.1.34 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.9.40 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.6.22 నుండి 8.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.04 నుండి 7.33 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.06 నుండి 8.48 వరకు, తిరిగి తె.4.47 నుండి 6.31 వరకు (తెల్లవారితే ఆదివారం); **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.04, **సూర్యాస్తమయం:** 5.26.

క్లుప్తంగా...

200 నామినేషన్లు వేస్తాం

● అమరవీరుల ఐక్యవేదిక స్పష్టీకరణ



నామినేషన్ పత్రాల కోసం కామారెడ్డికి వచ్చిన అమరుల కుటుంబ సభ్యులు

కామారెడ్డి క్రైం: తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది అమరవీరుల కుటుంబ సభ్యులు కామారెడ్డిలో కేసీఆర్‌పై పోటీ చేస్తారని అమరవీరుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రఘుమారెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన 20 మంది తెలంగాణ అమరవీరుల కుటుంబ సభ్యులు శుక్రవారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి వచ్చి నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో 1,386 మంది ప్రాణ త్యాగం చేయగా, మరో 175 మంది వైకల్యం బారిన పడ్డారని వివరించారు. వీరిలో 548 మందిని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అమరవీరులుగా గుర్తించిందన్నారు. వారిలోనూ 270 మంది కుటుంబ సభ్యులకే కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు, రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరుల కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ఈనెల 9వ తేదీలోగా హామీ ఇవ్వకపోతే ఎన్నికల బరిలో ఉంటామని స్పష్టం చేశారు.

'కాళేశ్వరం'పై సీబీఐ విచారణ జరిపించండి

● రాష్ట్రపతికి కాంగ్రెస్ లేఖ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వైఫల్యాలపై సీబీఐతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాసింది. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ పేరిట రాసిన ఈ లేఖలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మూడు బ్యారేజీల రక్షణ, మరమ్మతు చర్యలు పర్యవేక్షించేలా కేంద్రానికి సూచనలు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణనిధుల్లో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు ఇచ్చిన రుణాలు రూ.80 వేల కోట్లు ఉన్నందున వాటిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు అక్రమంగా ఇచ్చిన రుణాలపై ఆర్‌బీఐ, కేంద్ర విద్యుత్ శాఖ విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారులు, అనధికారులపై చర్యలు తీసుకునేలా కేంద్రాన్ని పురమాయించాలని కోరారు.

జనవరి 21న సీటెట్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష(సీటెట్)ను జనవరి 21న నిర్వహిస్తున్నట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తెలిపింది. ఈ పరీక్షకుగాను ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ గురువారం మొదలైంది. ఇది ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా 135 కేంద్రాల్లో, 20 ప్రాంతీయభాషల్లో పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు కేంద్ర, రాష్ట్ర విద్యాసంస్థల్లో బోధించేందుకు అర్హులవుతారు. ప్రభుత్వ టీచర్ పోస్టుల్లోనూ వీరికి వెయిటేజ్ ఉంటుంది. పూర్తి వివరాలకు https://ctet.nic.in వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వాలని సీబీఎస్ఈ ఓ ప్రకటనలో తెలిపింది.

నేడు ఓయూలో ఎంబీఏ ఈవెనింగ్ కౌన్సెలింగ్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూలో ఎంబీఏ (ఈవెనింగ్) కోర్సులో ప్రవేశాలకు శనివారం కౌన్సెలింగ్ జరగనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి శుక్రవారం తెలిపారు. ఐసెట్-2023లో అర్హత సాధించిన విద్యార్థులతో పాటు ఓయూ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు ఎంబీఏ (ఈవెనింగ్) కోర్సులో ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు క్యాంపస్‌లోని పీజీ అడ్మిషన్స్ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

పింఛను కోసమొచ్చి.. ప్రాణం కోల్పోయి..

● గుండెపోటుతో వృద్ధుని మృతి



రత్నం మృతదేహం

కారేపల్లి: పింఛన్ తీసుకోవడానికి బ్యాంకుకు వచ్చిన వృద్ధుడు.. తిరిగి వెళ్తూ గుండెపోటుతో కన్నుమూశాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పెద్దమడెంపల్లి గ్రామానికి చెందిన కొరివి రత్నం (70) శుక్రవారం మధ్యాహ్నం 3 కిలోమీటర్ల దూరంలోని గాంధీనగర్ ఎస్‌బీఐకి కాలినడకన వెళ్లాడు. బ్యాంకుకు వెళ్లగా, ఇంకా నగదు జమ కాలేదని అధికారులు తెలిపారు. దీంతో నిరాశగా తిరిగి పెద్దమడెంపల్లికి కాలినడకనే వెళ్తుండగా.. బస్వాపురం సమీపంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కారేపల్లికి పోలీసులు చేరుకుని, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా, రత్నంకు ముగ్గురు కుమారులు, కుమార్తెలున్నా ప్రతినెలా ఆయనొక్కడే బ్యాంకుకు వెళ్లి పింఛన్ తెచ్చుకుంటాడు. ఈసారి కూడా అలాగే వెళ్లి వస్తూ మృత్యువాత పడ్డాడు.

మేడిగడ్డ 7వ బ్లాక్ పునర్నిర్మించాల్సిందే!

- ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదిక స్పష్టీకరణ
- ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో నాణ్యత, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలతోనే బ్యారేజీ కుంగింది
- ఇతర బ్లాకులూ దెబ్బతింటే బ్యారేజీని పూర్తిగా పునర్నిర్మించక తప్పదు
- ఫ్లోటింగ్ స్ట్రక్చర్ డిజైన్ రూపొందించి రిజిడ్ స్ట్రక్చర్ పద్ధతిలో నిర్మించారు
- ఊర్ధ్వ పీడనం పునాదుల కింద ఇసుకను తన్నడంతో బ్యారేజీ కుంగింది



7వ బ్లాక్‌లోని 20వ నంబర్ పియర్ పగిలిపోయిన దృశ్యం

సాక్షి, హైదరాబాద్: ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో నాణ్యత, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలతోనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ పియర్లు కుంగాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ తేల్చింది. 7వ నంబర్ బ్లాక్‌లో తలెత్తిన తీవ్ర ప్రతికూల పరిస్థితితో బ్యారేజీ పనితీరుపై తీవ్ర దుష్ప్రభావం పడిందని, ప్రస్తుత పరిస్థితిలో అది ఉపయోగానికి పనికిరాదని స్పష్టం చేసింది. 7వ నంబర్ బ్లాక్ మొత్తం పునాదులతో సహా తొలగించి పూర్తి స్థాయిలో కొత్తగా పునర్నిర్మించిన తర్వాతే బ్యారేజీ ఉపయోగంలోకి వస్తుందని తెలిపింది. ఈ సమయంలో బ్యారేజీలో నీళ్లు నింపితే పరిస్థితి మరింతగా దిగజారుతుందని హెచ్చరించింది. బ్యారేజీ నిర్మాణ సారూప్యతలను పరిగణనలోకి తీసుకుంటే ఇతర బ్లాకులూ ఇదే రీతిలో విఫలమయ్యే పరిస్థితులు న్నాయని, అదే జరిగితే మొత్తం బ్యారేజీని పునర్నిర్మించక తప్పదని తెలిపింది. మేడిగడ్డ బ్యారేజీ పియర్లు కుంగిన ఘటనపై ఎన్డీఎస్‌ఏ సభ్యుడు, సీడబ్ల్యూసీ చీఫ్ ఇంజనీర్ అనిల్ జైన్ నేతృత్వంలో కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ తాజాగా ఎన్డీఎస్‌ఏ చైర్మన్‌కు నివేదిక సమర్పించింది. ఈ నివేదికలోని ముఖ్యాంశాలతో ఎన్డీఎస్‌ఏ చైర్మన్ సంజయ్‌కుమార్ సిబల్ రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌కు ఈ నెల 1న లేఖ రాశారు. వివరాలు ఇలా ఉన్నాయి..

పునాది కుంగడం వల్లే..

ర్యాఫ్ట్ (పునాది) కుంగడమే మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి మూలకారణం. బ్యారేజీకి 3.3 మీటర్ల లోతుతో కాంక్రీట్ పునాది నిర్మించారు. ర్యాఫ్ట్‌కి ముందు, వెనుక రెండువైపులా 15 మీటర్ల లోతులో సెకెంట్ పైల్స్ (కటాఫ్ వాల్స్) నిర్మించారు. ర్యాఫ్ట్ కుంగడంతో దానిపై నిర్మించిన పియర్లు (బ్యారేజీ గేట్ల మధ్య పిల్లర్లుగా ఉండే కాంక్రీట్ నిర్మాణం) కుంగి, వాటికి పగుళ్లు ఏర్పడ్డాయి. ర్యాఫ్ట్ కుంగడానికి పలు కారణాలుండవచ్చు. ర్యాఫ్ట్ కింది ఇసుక కొట్టుకుపోవడం/ఆ ఇసుకకు ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం (బేరింగ్ కెపాసిటీ) లేకపోవడం/ బ్యారేజీ బరువు (లోడ్), ఇతర కారణాలతో ర్యాఫ్ట్‌కి ముందు భాగంలోని సెకెంట్ పైల్స్ విఫలం కావడం వంటి కారణాలు ఉండవచ్చు.

ర్యాఫ్ట్, సెకెంట్ పైల్స్ నిర్మాణంలో నాణ్యత లోపం

నాణ్యత పర్యవేక్షణలో వైఫల్యాలతో బ్యారేజీ కింద ర్యాఫ్ట్, సెకెంట్ పైల్స్ నిర్మాణంలో లోపాలు జరిగాయి. పక్కపక్కనే ఉండే సెకెంట్ పైల్స్ ఒకదానికి ఒకటి అతుక్కుని ఉండాలి. మధ్యలో గ్యాప్ ఉండకూడదు. కానీ గ్యాప్ ఏర్పడడంతో వాటి మధ్య నుంచి నీళ్లు పారి ర్యాఫ్ట్ కింద ఇసుక కొట్టుకుపోయింది.

డిజైన్‌కు విరుద్ధంగా నిర్మాణం

ఫ్లోటింగ్ స్ట్రక్చర్ (తేలియాడే కట్టడం)గా బ్యారేజీని డిజైన్ చేసి, రిజిడ్ స్ట్రక్చర్(దృఢమైన కట్టడం)గా నిర్మించారు. అంటే ఇసుక మీద బ్యారేజీ కట్టే పద్ధతుల మేరకు డిజైన్ రూపొందించి, దానికి భిన్నంగా రాతి మీద బ్యారేజీ నిర్మించే పద్ధతుల్లో నిర్మాణం జరిపారు. భూగర్భంలో రాయి తగిలే దాకా బ్యారేజీకి ఎగువ, దిగువన కాంక్రీట్ గోడలు (సెకెంట్ పైల్స్) నిర్మించారు. నీటి ప్రవాహానికి బ్యారేజీ అడ్డంకిగా ఉండడంతో ఏర్పడే ఊర్ధ్వ పీడనం (అప్‌లిఫ్ట్ ఫోర్స్) బ్యారేజీ పునాదుల కింది నుంచి నిష్క్రమించకుండా ఈ కాంక్రీట్ గోడలు అడ్డంకిగా మారాయి. దీంతో ఊర్ధ్వ పీడనం తీవ్రమై ర్యాఫ్ట్ కింద ఇసుకను బ్యారేజీ బయటికి తన్నడంతోనే ర్యాఫ్ట్ కుంగిపోయింది.

బ్యారేజీతో ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర ముప్పు

బ్యారేజీ నిర్వహణ, పర్యవేక్షణలో తీవ్ర వైఫల్యం జరిగింది. నిర్మాణం పూర్తైన నాటి నుంచి ఏటా వర్షాకాలానికి ముందు, తర్వాత నిర్వహించాల్సిన సౌండింగ్ అండ్ ప్రోబింగ్ పరీక్షలను జరపలేదు. ఏదైనా లోపాలుంటే గుర్తించడానికి వర్షాకాలానికి ముందు, తర్వాత తనిఖీలు జరపాలని తెలంగాణకు ఎన్డీఎస్‌ఏ క్రమం తప్పకుండా సూచించినా పట్టించుకోలేదు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021లోని చాప్టర్ 10 సెక్షన్ 41(బీ) కింద దీనిని తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణిస్తారు. చాలా విషయాల్లో ఈ చట్టాన్ని ఉల్లంఘించినట్టు తెలుస్తోంది. ఇది చాలా తీవ్రమైన విషయం. బ్యారేజీతో ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర ముప్పు పొంచి ఉంది.

అడిగిన సమాచారం ఇవ్వలేదు..

నిపుణుల కమిటీ 20 రకాల సమాచారాన్ని కోరగా, నీటిపారుదల శాఖ 11 రకాల వివరాలను మాత్రమే అందజేసింది. ఇన్‌స్ట్రుమెంటేషన్ డేటా, వర్షాలకు ముందు తర్వాత బ్యారేజీ తనిఖీల సమాచారం, ప్రాజెక్టు కంప్లీషన్ రిపోర్టు, క్వాలిటీ కంట్రోల్ రిపోర్టులు, గేట్ల స్థితిగతులు తెలిపే వివరాలు.. లాంటి అనేక రకాల సమాచారాన్ని ఇవ్వలేదు. ఇవ్వడానికి వారి వద్ద ఎలాంటి సమాచారం లేదని నిపుణుల కమిటీ అభిప్రాయపడుతోంది. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021 ప్రకారం లభ్యత ఉన్న సమాచారం బ్యారేజీ అధికారులు ఇవ్వకుండా నిరాకరించడానికి ఆస్కారం లేదు.

సమగ్ర దర్యాప్తు జరపాలి..

బ్యారేజీ వైఫల్యానికి దారితీసిన కారణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలి. దర్యాప్తులో తేలిన వివరాలతో పాటు బ్యారేజీ పునరుద్ధరణ ప్రతిపాదనలను ఎన్డీఎస్‌ఏకు తెలపాలి. ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో ఇదే ప్రక్రియను అనుసరించాలి.

అన్నారం, సుందిళ్లకూ ప్రమాదమే!

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన నిర్మించిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సైతం ఇలాంటి డిజైన్లు, నిర్మాణ పద్ధతులనే అవలంబించారు. దీంతో ఈ రెండు బ్యారేజీలు కూడా భవిష్యత్తులో ఇలాంటి వైఫల్యాలకు గురయ్యే అవకాశాలున్నాయి. అన్నారం బ్యారేజీ గేట్లకు దిగువన నీళ్లు ఉబికిరావడం (బాయిలింగ్) వైఫల్యానికి ముందస్తు సూచిక లాంటిదే. బ్యారేజీల పునాదుల కింద నుంచి ఇసుక కొట్టుకుపోవడాన్ని సాంకేతిక పరిభాషలో పైపింగ్ అంటారు. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద పైపింగ్‌ను అత్యవసరంగా పరీక్షించాలి.

కేసీఆర్ ప్రభుత్వ అవినీతి బట్టబయలు: షెకావత్

మేడిగడ్డ బ్యారేజీ రిపోర్టుపై స్పందించిన కేంద్ర జలశక్తి శాఖ మంత్రి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సీఎం కేసీఆర్‌పై కేంద్ర జలశక్తిశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ వ్యవహారంతో కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ ప్రభుత్వ అవినీతి బట్టబయలైందని అన్నారు. ఇటీవల మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతాన్ని సందర్శించిన అనంతరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు ఇచ్చిన నివేదికపై 'ఎక్స్'వేదికగా శుక్రవారం కేంద్రమంత్రి షెకావత్ స్పందించారు. కేసీఆర్ ప్రభుత్వం తమ దురాశ, అవినీతి కోసం లక్షల మంది ప్రజల ప్రాణాలను పణంగా పెట్టిందని షెకావత్ ఆరోపించారు. అంతే గాక కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసిందని మండిపడ్డారు.

'కాళేశ్వరం' డబ్బంతా కేసీఆర్ నుంచి వసూలు చేయాలి

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కోసం వెచ్చించిన సొమ్మునంతా కేసీఆర్ కుటుంబం నుంచి ముక్కుపిండి వసూలు చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టు దుస్థితికి కారకులైన వారి సంగతి తేలుస్తామన్నారు. కమీషన్ల కోసం అంచనాలు పెంచి దోచుకున్న సొమ్మునంతా కక్కిస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. సీఎం కేసీఆర్ కుటుంబ అవినీతికి కాళేశ్వరం బలైపోయిందని, కమీషన్లు, ఆగమాగం పనులు చేయడంతోనే మేడిగడ్డ కుంగిపోయే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఇరిగేషన్ విభాగాన్ని, ఇంజనీరింగ్ అధికారులను పని చేసుకోనివ్వకుండా తానే ఇంజనీర్ అని కేసీఆర్ అహంకారం ప్రదర్శించినందుకు..కోట్ల రూపాయల ప్రజాధనం గోదావరి నీళ్ల పాలైందని మండిపడ్డారు. మొత్తం బ్యారేజీనే కొత్తగా నిర్మించాల్సి రావొచ్చని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో పేర్కొన్నదంటే పనులు ఏ విధంగా జరిగాయో అర్థమవుతోందని, మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పటిష్టతకు కూడా ప్రమాదమేనని ఈ కమిటీ నివేదికలో ప్రస్తావించడంపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఇంజనీరింగ్ ప్రతిభ, ముందుచూపునకు కాళేశ్వరం ప్రాజెక్టే నిదర్శనమన్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

మేడిగడ్డ, అన్నారంపై మంత్రులు నోరు విప్పరే?

● బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శలు



సాక్షి, న్యూఢిల్లీ: మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది, అన్నారంకు బుంగపడింది. సూపర్ ఇంజనీర్ అవతారమెత్తిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గానీ, నదులకే నడక నేర్పిన వ్యక్తి సీఎం కేసీఆర్ అంటూ మాట్లాడిన మంత్రులంతా నోరు విప్పరేమని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ నిలదీశారు. నిర్లక్ష్యంగా డ్యామ్‌ను నిర్మించారంటూ 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ'రిపోర్టు ఇచ్చాక కూడా సీఎం కేసీఆర్ స్పందించకపోవడం దారుణమన్నారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...డ్యామ్‌ను పునాదిస్థాయి నుంచి తిరిగి నిర్మించాలని 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ'రిపోర్టు ఇచ్చిందన్నారు. డ్యాంకు ఏదైనా నష్టం జరిగితే కట్టిన సంస్థనే భర్తిస్తుందంటూ నిర్మాణ సమయంలో చెప్పిన ప్రభుత్వ పెద్దలు..ఇప్పుడు ఈ విషయంలో నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇరిగేషన్ మంత్రి రాజీనామా చేసి, ప్రజల ముందు చెంపలు వేసుకోవాలని డిమాండ్ చేశారు.

కొలంబోకు ఇండిగో విమాన సర్వీసులు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి కొలంబో నేరుగా వెళ్లేందుకు ఇండిగో విమాన సర్వీసులను ప్రారంభించింది. ఈ మేరకు శుక్రవారం 6ఈ-1181 ఇండిగో విమాన సర్వీసు ఉదయం 11.50 గంటలకు ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకుని కొలంబోకు బయల్దేరింది. ఈ విమానం కొలంబోకు మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇండిగో ఎయిర్‌లైన్స్ హైదరాబాద్ నుంచి ఈ సర్వీసుతో కలిపి మొత్తం 14 అంతర్జాతీయ గమ్యస్థానాలకు రాకపోకలు సాగిస్తోందని తెలిపారు. అలాగే దేశీయంగా 55 గమ్యస్థానాలకు సర్వీసులను నడిపిస్తోందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సర్వీసులను పెంచుతామన్నారు.

కాళేశ్వరంపై న్యాయ విచారణ జరపాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

- అవినీతి, అధికార దుర్వినియోగానికి సాక్ష్యం ఈ ప్రాజెక్టు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- మేధావులు, రిటైర్డ్ ఇంజనీర్ల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంజనీరింగ్‌లోపాలు, అవినీతిపై న్యాయవిచారణ జరిపించాలని పలువురు మేధావులు, రిటైర్డ్ ఇంజనీర్లు డిమాండ్ చేశారు. అవినీతి, అధికార దుర్వినియోగానికి నిలువెత్తు సాక్ష్యం కాళేశ్వరం ప్రాజెక్టు అని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా బహిర్గతం చేసి, అందులో లేవనెత్తిన లోపాలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో రిటైర్డ్ ఇంజనీర్లు, మేధావులు పాల్గొని మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో సర్వేలు లేకుండా గిన్నిస్ రికార్డుల కోసమే కాళేశ్వరం నిర్మించారని టీజేఎస్ అధినేత కోదండరాం ఆరోపించారు. ఇంజనీర్లు, వైస్ చాన్స్‌లర్లు, ఇతర నిపుణుల పనులు సైతం తానే చేయాలని సీఎం కేసీఆర్ కోరుకోవడంతో రాష్ట్రంలో చట్టబద్ధమైన పాలన లేకుండా పోయిందన్నారు. ఇంజనీర్లు డిజైన్ చేసిన శ్రీశైలం, నాగార్జునసాగర్, దేవాదుల ప్రాజెక్టులు చెక్కుచెదరలేదని, సీఎం కేసీఆర్ స్వయంగా డిజైన్ చేయడంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు విఫలమైందని విమర్శించారు. క్షేత్ర స్థాయిలో సరైన సర్వే లేకుండానే ప్రాజెక్టును నిర్మించారని రిటైర్డ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రమేశ్‌రెడ్డి అన్నారు. డ్యామ్‌సేఫ్టీ యాక్ట్ 2021 కింద బాధ్యులపై కేసులు నమోదు చేయాలని జర్నలిస్టు జయసారథి డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును తక్కువ కాలంలో నిర్మించడంతోనే లోపాలు జరిగాయని రిటైర్డ్ ఇంజనీర్ రంగారెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణానికి చాలా తేడాలున్నాయన్నారు.

ప్రాణహితను ఎందుకు పక్కనపెట్టారు?

ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును ఎందుకు పక్కనపెట్టి కాళేశ్వరాన్ని కట్టారని రిటైర్డ్ ఇంజనీర్ రఘుమారెడ్డి ప్రశ్నించారు. రూ.లక్షాయాభై వేల కోట్లను నాశనం చేసిన పనికి బాధ్యులు ఎవరు? అని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రికార్డులను సీజ్ చేయాలని, బాధ్యులైన ఇంజనీర్లు, అధికారులను జైలులో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రాణహిత ప్రాజెక్టును మళ్లీ చేపట్టాలన్నారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు అయినా సరైన తనిఖీలు చేయకపోవడంతో సమస్యలొస్తున్నాయని రిటైర్డ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం అంటే కేసీఆర్ ఖజానా ఖాళీశ్వరమని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో అధ్యయన వేదిక అధ్యక్షుడు బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాధిక్, కోశాధికారి సురేశ్ పాల్గొన్నారు.

డ్రీమ్ సిటీలో డ్రీమ్‌హాక్ గేమింగ్

- అతిపెద్ద డిజిటల్ ఫెస్టివల్‌కు ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్
- హైటెక్స్ వేదికగా 3 రోజులపాటు డిజిటల్ గేమింగ్ ఫెస్టివల్



సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఫెస్టివల్ 'డ్రీమ్‌హాక్'కు నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వేదికైంది. శుక్రవారం ప్రారంభమైన యాక్షన్-ప్యాక్డ్ గేమింగ్ మహోత్సవం మూడ్రోజులపాటు కొనసాగనుంది. గేమింగ్, స్పోర్ట్స్ టోర్నమెంట్, చెస్ డెత్ మ్యాచ్, రెట్రో గేమింగ్ వంటి వినూత్న గేమ్‌లతోపాటు వర్క్‌షాప్‌లు, అభిమానుల మీట్ అండ్ గ్రీట్, డ్యాన్స్ షో, మ్యూజిక్ జోన్, స్టాండప్ కామిక్స్ వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో నోడ్వింగ్ గేమింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ డ్రీమ్‌హాక్ గేమింగ్ మహోత్సవంలో ఇంటెల్, మాన్‌స్టర్, హ్యూందయ్, బింగో వంటి ప్రముఖ సంస్థలు గేమింగ్ వేదికలను ఏర్పాటు చేశాయి. పీసీ మోడ్, మొబైల్ మోడ్ విధానంలో గేమ్స్ నిర్వహించగా హైదరాబాద్‌తోపాటు దేశంలోని వివిధ నగరాల డిజిటల్ గేమర్స్ పాల్గొంటున్నారు. డ్రీమ్‌హాక్ రాపిడ్ ఓపెన్ టోర్నమెంట్, డ్రీమ్‌హాక్ బ్లిట్జ్ ఓపెన్ టోర్నమెంట్, కేఓ ఫైట్ నైట్, పబ్‌జీ ఆధారిత గేమ్‌లు, రెట్రో జోన్ గేమ్స్ మోనోపోలీ, లూడో, క్యారమ్, స్నేక్స్ అండ్ ల్యాడర్స్, యూఎన్‌వో వంటి ప్రసిద్ధ బోర్డ్ గేమ్‌లతో డ్రీమ్‌హాక్ అలరిస్తుంది. వివిధ విభాగాల విజేతలకు లక్షల్లో నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు డ్రీమ్‌హాక్ ప్రకటించింది.

ప్రేమజంట ఆత్మహత్య

- పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని బలవన్మరణం
- ఖమ్మం జిల్లాలో ఘటన



ఐశ్వర్య



సుమంత్

బోనకల్/వైరా: తెలిసీతెలియని వయస్సు.. ప్రేమలో పడ్డారు.. విషయం తెలియడంతో వారి కుటుంబసభ్యులు మందలించారు. ఇక పెళ్లికి వారెప్పటికీ ఒప్పుకోరనే ఆవేదనతో ఆ ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన ఖమ్మం జిల్లాలో గురువారంరాత్రి చోటుచేసుకుంది. బోనకల్ మండలం రాపల్లికి చెందిన చింతల సుమంత్(18), బ్రాహ్మణపల్లికి చెందిన దారగాని ఐశ్వర్య(17) ఏడాదిన్నరగా ప్రేమించుకుంటున్నారు. సుమంత్ ట్రాక్టర్ డ్రైవర్‌గా బ్రాహ్మణపల్లిలో పనిచేసే సమయంలో ఐశ్వర్యతో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. ఈ విషయం ఇద్దరి కుటుంబసభ్యులకు తెలియటంతో మందలించారు. దీంతో సుమంత్ ట్రాక్టర్ డ్రైవర్ పని మానేసి మూడునెలల క్రితం హైదరాబాద్ వెళ్లి ఓ ప్రైవేట్ కంపెనీలో చేరాడు. ఈ క్రమంలో గత నెల 29న ఐశ్వర్య ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బోనకల్ పోలీసులకు 31వ తేదీన ఫిర్యాదు చేశారు. అయితే, ఐశ్వర్య హైదరాబాద్‌లో ఉన్న సుమంత్ వద్దకు వెళ్లింది. ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై గురువారంరాత్రి వైరా రిజర్వాయర్ వద్దకు చేరుకుని ఓ చెట్టుకు ఉరేసుకున్నారు. శుక్రవారం ఉదయం స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వైరా ఏసీపీ రెహమాన్ ఘటనాస్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు ప్రారంభించారు.

క్లుప్తంగా...

తారీఖ్ పే తారీఖ్
వాయిదాలపై చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆవేదన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో న్యాయమూర్తులు పదేపదే కేసు వాయిదాలు కోరుతుండటంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ శుక్రవారం తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. అత్యున్నత న్యాయస్థానం 'తారీఖ్ పే తారీఖ్ (వాయిదాల మీద వాయిదా)' కోర్టుగా మారకూడదన్నదే తన ఉద్దేశమన్నారు. పదేపదే కేసుల వాయిదా కోరొద్దని న్యాయవాదులకు సూచించారు. ''సెప్టెంబర్, అక్టోబర్లలో కలిపి కేవలం రెండు నెలల్లోనే లాయర్లు ఏకంగా 3,688 వాయిదా కోరారు. ఈ ఒక్క రోజే (శుక్రవారం) మా ముందు ఏకంగా 178 వాయిదా విజ్ఞప్తులున్నాయి! ఏమిటిది?'' అంటూ ప్రశ్నించారు. ''అత్యవసరమైతే తప్ప ఇలా వాయిదాలు కోరకండి. లేదంటే కోర్టులపై ప్రజలకు నమ్మకమే పోయే ప్రమాదముంది'' అని ఆవేదన వెలిబుచ్చారు. తారీఖ్ పే తారీఖ్ బాలీవుడ్ హిట్ సినిమా దామినిలోని పాపులర్ డైలాగ్. అందులో హీరో సన్నీడియోల్ లాయర్. తను వాదిస్తున్న కేసు వాయిదాలపై వాయిదాలు పడుతుంటే ఆక్రోశంతో అతను చెప్పే ఈ డైలాగ్ సీజేఐ నోట రావడం విశేషం.

మహిళా రిజర్వేషన్ బిల్లు...
ఆ భాగాన్ని కొట్టేయలేం: సుప్రీం

న్యూఢిల్లీ: ఇటీవలే పార్లమెంటు ఆమోదం పొందిన మహిళల రిజర్వేషన్ బిల్లులో 'జనగణన అనంతరం అమల్లోకి వస్తుంది' అని పేర్కొంటున్న భాగాన్ని కొట్టేయడం చాలా కష్టమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్రానికి నోటీసులిచ్చేందుకు తిరస్కరించింది. నారీ శక్తి వందన్ అధినియమ్ పేరుతో తెచ్చిన మహిళా బిల్లును రానున్న సాధారణ ఎన్నికల్లోపే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది. దీన్ని ఈ అంశంపై దాఖలైన మరో పిటిషన్‌తో పాటు నవంబర్ 22న విచారిస్తామని పేర్కొంది. లోక్‌సభలోనూ, అసెంబ్లీల్లోనూ మూడో వంతు స్థానాలను మహిళలకు రిజర్వు చేస్తూ కేంద్రంలో బీజేపీ సర్కారు సెప్టెంబర్ 21న ఈ బిల్లు తేవడం తెలిసిందే. దానికి పార్లమెంటుతో పాటు రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా లభించింది. ఇక మెజారిటీ రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదమే మిగిలింది. ఇది నిజంగా మంచి ముందడుగని ధర్మాసనం అభిప్రాయపడింది.

రాజ్యసభ చైర్మన్‌కు క్షమాపణ చెప్పండి
ఆప్ ఎంపీ ఛద్దాకు సుప్రీం నిర్దేశం

న్యూఢిల్లీ: సెలెక్ట్ కమిటీ వివాదంలో రాజ్యసభ చైర్మన్‌కు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని సస్పెండైన ఆప్ ఎంపీ రాఘవ్ ఛద్దాకు సుప్రీంకోర్టు సూచించింది. ఆయన క్షమాపణలను చైర్మన్ సానుభూతితో పరిశీలించగలరని ఆశాభావం వెలిబుచ్చింది. రాజ్యసభ నుంచి తనను నిరవధికంగా సస్పెండ్ చేయడాన్ని సవాలు చేస్తూ ఛద్దా పెట్టుకున్న పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఛద్దాకు సభ గౌరవాన్ని తగ్గించే ఉద్దేశం లేదని ఆయన తరఫు న్యాయవాది ధర్మాసనానికి నివేదించారు. ఆయన రాజ్యసభలో అత్యంత పిన్న వయస్కులన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. ఈ అంశంలో రాజ్యసభ చైర్మన్‌కు క్షమాపణలు చెప్పేందుకు ఛద్దా సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. దాంతో ఆ మేరకు ఆయనకు సూచిస్తూ విచారణను వాయిదా వేసింది. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ అపాయింట్‌మెంట్ కోరినట్లు ఎంపీ రాఘవ్ ఛద్దా తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి ధన్‌ఖడ్‌ను క్షమాపణ కోరుతానని ఆయన చెప్పారు. తనపై సస్పెన్షన్‌కు సంబంధించిన అంశంపై కలుసుకునేందుకు త్వరగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన 'ఎక్స్'లో తెలిపారు.

కల్నల్ నియామకాల్లో మహిళలకు అన్యాయం...
నిబంధనలకు విరుద్ధం: సుప్రీం

న్యూఢిల్లీ: మహిళా అధికారులకు కల్నల్‌గా పదోన్నతి కల్పించేందుకు సైన్యం నిరాకరించడం నిబంధనలకు విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమకు కల్నల్‌గా ప్రమోషన్ ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మహిళా సైనికాధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస మనోజ్ మిశ్రా ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. మహిళా సైనికాధికారులు సైనయంలో తమకు న్యాయంగా రావాల్సిన ప్రమోషన్లు, బాధ్యతలను చిరకాలం పాటు పోరాడి మరీ సాధించుకున్నారని అభిప్రాయపడింది. కల్నల్ ప్రమోషన్ల విషయంలో మహిళా అధికారుల రహస్య వార్షిక నివేదిక (సీఆర్)లకు సైన్యం కటాఫ్ తేదీని వర్తింపజేసిన తీరు వారికి అన్యాయం చేసేదిగా ఉందంటూ ఆక్షేపించింది. కనుక కల్నల్ ప్రమోషన్ల ప్రక్రియను 15 రోజుల్లోగా తాజాగా చేపట్టాలని సైన్యాన్ని ఆదేశించింది. లింగ వివక్షకు తావులేకుండా మహిళా సైనికాధికారులకు కూడా కల్నల్ తదితర పదోన్నతులు కల్పించాలంటూ 2020లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించడం తెలిసిందే. నేవీలో కూడా దీన్ని వర్తింపజేయాలంటూ కొద్ది రోజులకే మరో తీర్పు వెలువరించింది. సాయుధ దళాల్లో మహిళల పట్ల వివక్షకు చరమగీతం పాడేందుకు తమ తీర్పులు తోడ్పడతాయని ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది.

కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు...
దేవుళ్లం అనుకుంటున్నారు

అహ్మదాబాద్: కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు తమను తాము దేవుళ్లుగా భావించుకుంటున్నారంటూ అలహాబాద్ హైకోర్టు మండిపడింది. వాళ్లు సాధారణ ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారంటూ ఆవేదన వెలిబుచ్చింది. అహ్మదాబాద్‌లో రాత్రిపూట వెళ్తున్న ఓ జంట నుంచి ట్రాఫిక్ పోలీసులు బెదిరించి డబ్బుల వసూలు చేశారంటూ వచ్చిన వార్తలను కోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, న్యాయమూర్తి జసిస్ అనిరుద్ధ పి.మాయీ ధర్మాసనం దీనిపై శుక్రవారం జరిపింది. ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పోలీసులపై ఫిర్యాదు చేసేందుకు ఉద్దేశించిన హెల్ప్‌లైన్‌ను కలెక్టర్ కార్యాలయంలో మాత్రమే ఉంచడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ''పోలీసులపై ఫిర్యాదు చేయాలంటే సామాన్యులు మీ కార్యాలయాల ముందు వరుస కట్టాలా? వారిని లోపలికి అనుమతించేదెవరు? మామూలు జనానికి పోలీస్ స్టేషన్లో కాలు పెట్టడమే కష్టం. ఇక పోలీస్ కమిషనర్, కలెక్టర్ కార్యాలయాల్లోకి వెళ్లడమైతే దాదాపుగా అసాధ్యం! మీ కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు దేవుళ్లలా, రాజుల మాదిరిగా ప్రవర్తిస్తారు. ఇవన్నీ క్షేత్రస్థాయి వాస్తవాలు. ఇంతకుమించి మాట్లాడేలా మమ్మల్ని రెచ్చగొట్టొద్దు'' అని జస్టిస్ అగర్వాల్ అన్నారు. పోలీసులపై ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్‌తో పాటు హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని, అందరికీ తెలిసేలా దాన్ని ప్రచారం చేయాలని గత విచారణ సందర్భంగా జారీ చేసిన ఆదేశాలు అమలు కాకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వెలిబుచ్చింది.

ఉత్తర భారతదేశంలో భూప్రకంపనలు
నేపాల్‌లో తీవ్ర భూకంపం .. రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతోపాటు ఉత్తర భారతదేశంలో శుక్రవారం రాత్రి భూప్రకంపలను సంభవించాయి. నేపాల్‌లో సంభవించిన తీవ్ర భూకంపం ఉత్తర భారతదేశంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. భయాందోళనకు గురైన జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు తెలియరాలేదు. ఉత్తర ప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు తెలిసింది. నేపాల్‌లో భూకంపం రిక్టర్ స్కేల్‌పై 6.4గా నమోదయ్యింది. శుక్రవారం రాత్రి 11.32 గంటలకు నేపాల్‌లో భూకంపం సంభవించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ(ఎన్‌సీఎస్) వెల్లడించింది. భూకంప కేంద్రం భూఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు తెలియజేసింది. నేపాల్‌లో భూకంపం చోటుచేసుకోవడం గత నెల రోజుల వ్యవధిలో ఇది మూడోసారి. నేపాల్‌లో తాజా భూకంపంలో ఎంతమంది చనిపోయారన్నది తెలియరాలేదు.

చక్రబంధంలో గాజా సిటీ!



హమాస్ అడ్డాను చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైన్యం

మిలిటెంట్లపై కొనసాగుతున్న భూతల, వైమానిక దాడులు • గాజాలో ఇప్పటివరకు 9,200 మందికిపైగా మృతి

ఖాన్ యూనిస్/జెరూసలేం/న్యూఢిల్లీ: గాజాలో హమాస్ మిలిటెంట్లతో హోరాహోరీ పోరు కొనసాగుతోందని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. తమ పదాతి సేనలు, వైమానిక దళాలు శత్రువులపై ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, ప్రశంసనీయమైన విజయాలు సాధిస్తున్నాయని హర్షం వ్యక్తం చేసింది. మిలిటెంట్ల దాడులను తమ జవాన్లు గట్టిగా తిప్పికొడుతున్నారని పేర్కొంది. శుక్రవారం జరిగిన దాడుల్లో చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని, వారి సొరంగాలు నామరూపాల్లేకుండా పోయాయని తెలియజేసింది. గాజా సిటీలో దాడులు ఉధృతం చేయబోతున్నామని ప్రకటించింది. ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణలో మృతుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. శుక్రవారం నాటికి గాజాలో 9,200 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో మిలిటెంట్ల అధీనంలో ఉన్న 240 మంది బందీల ఆచూకీ కోసం ఇజ్రాయెల్ సైన్యం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం అమెరికా డ్రోన్లను ఉపయోగిస్తోంది. ఈ డ్రోన్లు గత వారం రోజులుగా గాజా ఉపరితలంపై చక్కర్లు కొడుతున్న దృశ్యాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.

గాజాని చుట్టుముట్టాం: ఇజ్రాయెల్

గాజాలో ప్రధాన నగరం, హమాస్ మిలిటెంట్ల ముఖ్యమైన అడ్డా అయిన గాజా సిటీని తమ సేనలు చుట్టుముట్టాయని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్ హగారీ ప్రకటించారు. భూతల దాడులు ప్రారంభమైన వారం రోజుల తర్వాత గాజా సిటీ చుట్టూ తమ దళాలు పూర్తిస్థాయిలో మోహరించినట్లు తెలిపారు. గాజాలో కాల్పుల విరమణ పాటించాలంటూ ప్రపంచ దేశాల నుంచి తమపై ఒత్తిడి వస్తున్నట్లు వెలువడుతున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు.

నల్ల బ్యాగుల్లో తిరిగి వెళ్తారు: హమాస్

గాజాలో ఇజ్రాయెల్ సైన్యానికి దారుణ పరాజయం ఎదురు కాబోతోందని హమాస్ మిలిటరీ విభాగమైన ఖాసమ్ బ్రిగేడ్స్ స్పష్టం చేసింది. తమ భూభాగంలో అడుగుపెట్టిన ఇజ్రాయెల్ సైనికులు నల్ల బ్యాగుల్లో తిరిగి వెళ్తారని హెచ్చరించింది. తద్వారా వారికి తమ చేతుల్లో చావు తప్పదని పేర్కొంది.

కాల్పుల విరమణ లేదు: నెతన్యాహూ

హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న బందీలందరినీ విడుదల చేసే దాకా గాజాలో కాల్పుల విరమణ ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తేల్చిచెప్పారు. మానవతా సాయం గాజాకు చేరవేయడానికి, విదేశీయులను బయటకు పంపించడానికి వీలుగా తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించాలన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభ్యర్థనపై ఆయన స్పందించారు. నెతన్యాహూ శుక్రవారం అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్‌తో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడారు.

పాలస్తీనియన్లను కాపాడండి

గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో సామాన్య పాలస్తీనియన్లు మరణిస్తుండడం పట్ల అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో ప్రజలను కాపాడడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేశారు. లేకపోతే 'శాంతికి భాగస్వాములు' ఎవరూ ఉండరని చెప్పారు. గాజాను శ్మశానంగా మార్చొద్దని పరోక్షంగా తేల్చిచెప్పారు. గాజాకు భారీస్థాయిలో మానవతా సాయం అవసరమని, ఆ దిశగా ఇజ్రాయెల్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించాలని అన్నారు. ప్రపంచ దేశాలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న మానవతా సాయాన్ని గాజాలోకి విస్తృతంగా అనుమతించాలని, ఈ విషయంలో ఆంక్షలు తొలగించాలని చెప్పారు. ఆంటోనీ బ్లింకెన్ శుక్రవారం ఇజ్రాయెల్‌లో పర్యటించారు.

పవిత్ర యుద్ధం చేస్తున్నాం: హసన్ నస్రల్లా



ఇజ్రాయెల్‌పై దాడుల విషయంలో అమెరికా హెచ్చరికలు తమను భయపెట్టలేవని లెబనాన్‌కు చెందిన షియా మిలిటెంట్ సంస్థ 'హెజ్బొల్లా' అధినేత హసన్ నస్రల్లా పేర్కొన్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధానికి హెజ్బొల్లా దూరంగా ఉండాలంటూ అమెరికా చేసిన హెచ్చరికలపై ఆయన శుక్రవారం స్పందించారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మొదలైన తర్వాత ఆయన మాట్లాడడం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్‌పై తొలుత దాడిచేసిన హమాస్‌పై ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఇజ్రాయెల్‌పై పవిత్ర యుద్ధంలో త్యాగాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. మధ్యధరా సముద్రంలో అమెరికా సైనిక బలగాలను చూసి తాము బెదిరిపోవడం లేదని అన్నారు. తమ దగ్గర బలమైన సైన్యం ఉందని, అన్నింటికీ సిద్ధపడే ఇజ్రాయెల్‌పై దాడులు చేస్తున్నట్లు నస్రల్లా పేర్కొన్నారు. నస్రల్లా ప్రస్తుతం ఎక్కడున్నారో తెలియదు. ఆయన ప్రసంగాన్ని టీవీల్లో ప్రసారం చేశారు.



ఇజ్రాయెల్ నుంచి పాలస్తీనా కార్మికులు వెనక్కి

తమ దేశంలో పని చేస్తున్న పాలస్తీనియన్ కార్మికులను వారి సొంత ప్రాంతమైన గాజాకు పంపించాలని ఇజ్రాయెల్ నిర్ణయించింది. శుక్రవారం పదుల సంఖ్యలో కార్మికులను గాజాకు పంపించింది. భారమైన హృదయంతో వారు వెనక్కి వెళ్లిపోయారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య అక్టోబర్ 7 నుంచి ఘర్షణ మొదలైంది. అంతకంటే ముందు 18,000 మంది పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ ప్రభుత్వం వర్క్ పర్మిట్లు జారీ చేసింది. వారిలో చాలామంది ఇజ్రాయెల్‌కు చేరుకొని, వేర్వేరు పనుల్లో కుదురుకున్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో పాలస్తీనియన్లు వెనక్కి వెళ్లిపోవాలని ఇజ్రాయెల్ ఆదేశించింది.

ఛత్తీస్ సీఎంకు రూ. 508 కోట్ల ముడుపులు

- ఓ బెట్టింగ్ యాప్ నుంచి అందాయి: ఈడీ
- క్యాష్ కొరియర్ వాంగ్మూలమిచ్చినట్టు వెల్లడి
- ఫోరెన్సిక్ విశ్లేషణలో విస్తుగొలిపే నిజాలు బయట పడ్డాయన్న దర్యాప్తు సంస్థ
- అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు చిక్కులు
- మోదీ సర్కారు నాటకమంటూ ఎదురుదాడి

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఓ బెట్టింగ్ సంస్థ నుంచి ఏకంగా రూ.508 కోట్ల ముడుపులు అందినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం సంచలన ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిమిత్తం సదరు బెట్టింగ్ సంస్థ యూఏఈ నుంచి కాంగ్రెస్ పార్టీకి భారీగా డబ్బులు పంపుతోందని వెల్లడించింది. ''గురువారం అదుపులోకి తీసుకున్న ఓ క్యాష్ కొరియర్ ఈ మేరకు వాంగ్మూలమిచ్చాడు. అతని మొబైల్‌తో పాటు బెట్టింగ్ సంస్థ ఉన్నతోద్యోగి ఈ మెయిల్స్‌ను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపగా ఈ విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి'' అని పేర్కొంది. ఛత్తీస్‌లో నవంబర్ 7న తొలి దశ పోలింగ్ జరగనున్న వేళ ఈ ఉదంతం కాంగ్రెస్‌కు తీవ్రంగా నష్టం చేసేలా కనిపిస్తుండటంతో ఆ పార్టీ హుటాహుటిన రంగంలోకి దిగింది. ఇవన్నీ నిరాధార ఆరోపణలని ఖండించింది. ఎన్నికల వేళ తమను ఇబ్బంది పెట్టేందుకే కేంద్రంలోని బీజేపీ ఇలా దర్యాప్తు సంస్థలను తమపైకి ప్రయోగించిందని ఆరోపించింది. తద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని దుయ్యబట్టింది.

ఈడీ ఏం చెప్పిందంటే...

ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో అసీమ్ దాస్ అనే క్యాష్ కొరియర్‌ను గురువారం అదుపులోకి తీసుకునట్టు ఈడీ తన ప్రకటనలో వెల్లడించింది. ''అతని కారులో, నివాసం నుంచి రూ.5.39 కోట్ల నగదు దొరికింది. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం యూఏఈకి చెందిన మహదేవ్ బెట్టింగ్ యాప్ అనే సంస్థ ప్రమోటర్లు అతని ద్వారా ఈ సొమ్ము పంపిస్తున్నట్టు తేలింది. బఘేల్‌కు అందజేసేందుకే ఈ మొత్తాన్ని తీసుకెళ్తున్నట్టు అతను విచారణలో అంగీకరించాడు. అతని నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్‌ను, శుభం సోని అనే యాప్‌కు చెందిన ఉన్నతోద్యోగి పంపిన ఈ మెయిల్‌ను ఫోరెన్సిక్ పరీక్షకు పంపగా విస్తుగొలిపే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. సీఎం బఘేల్‌కు ఇప్పటికే విడతలవారీగా రూ.508 కోట్ల దాకా సదరు బెట్టింగ్ యాప్ నుంచి అందినట్టు తేలింది'' అని ఈడీ వివరించింది. ఈ ఉదంతంపై, క్యాష్ కొరియర్ స్టేట్‌మెంట్ తదితరాలపై మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉందని తెలిపింది. అలాగే మహదేవ్ యాప్ కంపెనీకి చెందిన బినామీ బ్యాంకు ఖాతాలోని రూ.15.59 కోట్లను జప్తు చేసినట్టు ఈడీ వివరించింది. దీనికి సంబంధించి భీమ్ యాదవ్ అనే పోలీస్ కానిస్టేబుల్‌ను కూడా అరెస్టు చేశారు. ''సదరు కానిస్టేబుల్ గత మూడేళ్లలో పలుమార్లు యూఏఈ వెళ్లి బెట్టింగ్ యాప్ ప్రమోటర్లు రవి ఉప్పల్, సౌరభ్ చంద్రశేఖర్‌లను కలిశాడు. అతని ప్రయాణ ఖర్చులు తదితరాలను యాప్‌కు చెందిన మనీ లాండరింగ్, ట్రావెలింగ్ కంపెనీయే భరించింది'' అని ఈడీ ఆరోపించింది. యాదవ్, దాస్‌లను పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచి తదుపరి విచారణ నిమిత్తం ఏడు రోజుల కస్టడీకి తీసుకుంది.

రూ.450 కోట్లకు పైగా జప్తు

మహదేవ్ బెట్టింగ్ యాప్ ప్రమోటర్లు ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. విదేశాల్లో తిష్టవేసి భారత్‌లోని తమ బంధుమిత్రుల ద్వారా బెట్టింగ్ వ్యవహారం నడుపుతున్నట్టు సమాచారం. ఈ ఉదంతంలో ఈడీ ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసి ఇప్పటిదాకా రూ.450 కోట్లకు పైగా జప్తు చేసుకుంది. 14 మందిని నిందితులుగా చేరుస్తూ ఇటీవలే చార్జిషీట్ కూడా దాఖలు చేసింది.

ప్రతిష్టను దెబ్బతీసేందుకే: బఘేల్



ఈడీ ఆరోపణలపై సీఎం బఘేల్ తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు చేస్తున్న ప్రయత్నమే ఇదని ఆరోపించారు. అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న వేళ ఈడీ దురుద్దేశ పూరిత ఆరోపణలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోలేని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. ఈడీ, ఐటీ, సీబీఐల సాయంతో ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చేందుకు వీరు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.



శుక్రవారం ఢిల్లీ-గురుగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌వేపై కమ్మేసిన పొగమంచు

కాలుష్యం కోరల్లో ఢిల్లీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. శుక్రవారం ఉదయం 'తీవ్రమైన ప్లస్' కేటగిరీకి చేరిందని అధికారులు వర్గాలు వెల్లడించాయి. మితిమీరిన కాలుష్యంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగరాన్ని పొగమంచు కమ్మేసింది. కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గురువారం ఉదయం ఢిల్లీలో 346గా ఉన్న వాయు నాణ్యత సూచి(ఏక్యూఐ) సాయంత్రం కల్లా 418కు చేరిందని కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. శుక్రవారం ఉదయం ఏకంగా 450గా నమోదైందని తెలియజేసింది. లోధీ రోడ్, జహంగీర్‌పురి, ఆర్కే పురం, ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టులో వాయు నాణ్యత సూచి 438, 491, 486, 473గా ఉన్నట్లు పేర్కొంది. నగరాన్ని పొగ మంచు కమ్మేసిన డ్రోన్ దృశ్యాలను వార్తా సంస్థ ఏఎన్‌ఐ ట్విట్టర్‌లో పోస్టు చేసింది. కాలుష్య తీవ్రత పెరిగిన నేపథ్యంలో ఢిల్లీలో పలు ఆంక్షలు అమలు చేస్తున్నారు. నిర్మాణ పనులపై ఆంక్షలు విధించారు. లైట్ కమర్షియల్ వాహనాలు, డీజిల్ ట్రక్కుల రాకపోకలను నిషేధించారు. భవన నిర్మాణ పనులను, కూల్చివేతలను నిషేధిస్తున్నట్లు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ ప్రకటించారు.

పొరుగు రాష్ట్రాల్లోనూ కాలుష్య భూతం

కాలుష్యం కేవలం ఢిల్లీకే పరిమితం కావడం లేదు. రాజస్తాన్‌లోని హనుమాన్‌గఢ్, భివాడీ, శ్రీగంగానగర్, హరియాణాలోని హిసార్, ఫతేబాద్, జింద్, రోహ్‌తక్, బహదూర్‌గఢ్, సోనేపట్, కురుక్షేత్ర, కర్నాల్, ఖైతాల్, ఫరీదాబాద్, గురుగ్రామ్, ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, బాఘ్‌పట్, మీరట్, నోయిడా, గ్రేటర్ నోయిడా తదితర ప్రాంతాల్లోనూ వాయు నాణ్యత దిగజారింది.

కర్ణాటకలో కుర్చీలాట!

- సీఎం, డిప్యూటీ సీఎం వర్గాల మధ్య మాటల యుద్ధం
- ఐదేళ్ల పాటు తానే సీఎం అన్న సిద్ధరామయ్య
- హైకమాండ్‌దే తుది నిర్ణయమన్న డీకే శివకుమార్



సిద్ధరామయ్య



శివకుమార్

సాక్షి, బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు పెరుగుతోంది. ఎవరికి వారు వర్గాలుగా మారి సీఎం కుర్చీపై టార్గెట్ పెట్టారు. ఇందులో ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గం, డీకే శివకుమార్ వర్గం పేర్లు కీలకంగా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో గురువారం హోసపేట నగరంలో సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ రానున్న ఐదేళ్ల పాటు తానే సీఎంగా కొనసాగుతానని వ్యాఖ్యలు చేయడంతో డీకే శివకుమార్ వర్గం నోటిలో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. రెండున్నరేళ్ల తర్వాత అధికార మార్పిడితో తాను సీఎం అవుతానని ఆశలు పెట్టుకున్న డీకే శివకుమార్‌కు ఈ వ్యాఖ్యలు మింగుడు పడడం లేదు. ముఖ్యమంత్రిగా ఆరు నెలలు పూర్తి చేసుకున్న సిద్ధరామయ్య రానున్న ఐదేళ్లపాటు తానే సీఎంగా కొనసాగుతానని సర్వగర్వంగా వ్యాఖ్యలు చేయడంపై రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. సీఎం వ్యాఖ్యలపై అనుకూల, ప్రతికూల వ్యాఖ్యానాలను రాజకీయ విశ్లేషకులు చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఈ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండున్నరేళ్ల తర్వాత తానే సీఎం అనే ఆశలతో ఉన్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాత్రం తాను కేవలం హైకమాండ్ మాట మాత్రమే వింటానని, ఎవరేమి చెప్పినా పట్టించుకోనని తెలిపారు. ఇదే సమయంలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా అధిష్టాన నిర్ణయమే శిరోధార్యమని బాహాటంగా వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ లోలోపల ఎవరి వర్గానికి వారు మద్దతు ప్రకటిస్తూ వస్తున్నారు. ఈ విషయంపై మంత్రి ప్రియాంక్ ఖర్గే శుక్రవారం మైసూరులో విలేకరులతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, ఎవరిని కొనసాగించాలి, ఎవరికి అడ్డుకట్ట వేయాలనే విషయం తమ అధిష్టానం చూసుకుంటుందని తెలిపారు. మరో మంత్రి కేఎన్ రాజణ్ణ శుక్రవారం తుమకూరులో మాట్లాడుతూ మాజీ డిప్యూటీ సీఎం, హోం మంత్రి పరమేశ్వరకు కూడా సీఎం అయ్యే అర్హత ఉందని పేర్కొన్నారు. తుమకూరులో హోం మంత్రి పరమేశ్వర మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలపై తాను స్పందించబోనని చెప్పారు. అధికార పంపిణీ కేవలం సీఎం, డీసీఎం మధ్యజరిగిన చర్చ అని, అసలు ఢిల్లీలో ఎలాంటి ఒప్పందం జరిగిందనే విషయంపై వారిద్దరికే స్పష్టమైన అవగాహన ఉందని, అలాంటప్పుడు ఇది సత్యం, ఇది అబద్ధమని తానే వ్యాఖ్యలు చేయడం సరి కాదని అన్నారు. అయితే రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మాత్రం డీసీఎం డీకే శివకుమార్‌కు మద్దతు పలికారు.

పోస్టు ఖాళీగా లేదు కదా!

ఖాళీగా లేని ముఖ్యమంత్రి పదవిపై అవసరంగా చర్చ సాగుతోందని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు, ఎంపీ డీకే సురేశ్ అన్నారు. ఇలాంటి చర్చకు అర్థం లేదని వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం సిద్ధరామయ్య సీఎంగా ఉన్నారు. సీఎం పోస్టు ఖాళీగా లేదు. ఆ పదవి ఖాళీగా ఉన్నప్పుడు మాత్రమే దీనిపై చర్చించాలి. ఇప్పుడు మాట్లాడుకోవడం వల్ల లాభం ఏమిటి?' అని వ్యాఖ్యానించారు.

అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ 97 వేల మంది భారతీయులు పట్టివేత

వాషింగ్టన్: 2022 అక్టోబర్–2023 సెప్టెంబర్ కాలంలో అమెరికాలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన 96,917 మంది భారతీయులు పట్టుబడినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్(యూసీబీపీ) తెలిపింది. ఇటీవల అక్రమంగా ప్రవేశించిన భారతీయుల సంఖ్య అయిదు రెట్లు పెరిగిందని పేర్కొంది. 2019–20లో 19,883 మంది పట్టుబడగా ఈ సంఖ్య 2020–21లో 30,662కు చేరిందని, 2021–22లో 63, 927కు పెరిగిందని వివరించింది. 2022 అక్టోబర్–2023 సెప్టెంబర్ మధ్యన దొరికిపోయిన వారిలో కెనడా సరిహద్దుల్లో 30,010 మంది, మెక్సికో సరిహద్దుల్లో మరో 41,770 మంది ఉన్నారని తెలిపింది. యువత అత్యధికంగా 84 వేల మంది వరకు ఉన్నట్లు పేర్కొంది. ఒంటరిగా వచ్చి మరో 730 మంది మైనర్లు కూడా ఉన్నట్లు వివరించింది.

ఢిల్లీ మంత్రి నివాసాల్లో 23 గంటలపాటు ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు ఢిల్లీ సామాజిక, ఎస్సీ/ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు రాజ్‌కుమార్ ఆనంద్ నివాసాలు, కార్యాలయాల్లో 23 గంటలపాటు సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు శుక్రవారం ఉదయం ముగిశాయి. మంత్రిపై మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద ఈడీ దర్యాప్తు సాగిస్తోంది. ఆయన అంతర్జాతీయ హవాలా లావాదేవీలకు పాల్పడినట్లు, తప్పుడు పత్రాలతో రూ.7 కోట్లకుపైగా పన్ను ఎగ్గొట్టినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) చార్జిషీట్ దాఖలు చేసింది. ఆ తర్వాత కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తు ఈడీ పరిధిలోకి వచ్చింది. తనను వేధించడమే పనిగా పెట్టుకుందని ఈడీపై మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్ మండిపడ్డారు.

ఇరాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం.. 32 మంది మృత్యువాత

టెహ్రాన్: మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వారి కోసం ఏర్పాటైన పునరావాస కేంద్రంలో సంభవించిన అగ్నిప్రమాదంలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న లంగ్రూడ్ నగరంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన చోటుచేసుకున్న పునరావాస కేంద్రంలో 40 మందికి వసతి కల్పిస్తున్నారు. అయితే, ప్రమాద సమయంలో సిబ్బంది సహా అందులో ఎందరున్నదీ వెల్లడి కాలేదు. ఘటనలో 32 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వార్తా సంస్థ తెలిపింది. మంటలను అదుపులోకి తెచ్చినట్లు పేర్కొంది. ఘటనపై ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. భద్రతా ప్రమాణాలను పాటించకపోవడం, కాలం చెల్లిన మౌలిక వసతుల కారణంగా దేశంలో తరచూ అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

తమిళనాడు మంత్రి ఇళ్లపై ఐటీ దాడులు


చెన్నై: తమిళనాడు రాష్ట్ర మంత్రి ఈవీ వేలుకు చెందిన ఇళ్లపై ఆదాయ పన్ను(ఐటీ)శాఖ అధికారులు శుక్రవారం దాడులు జరిపారు. చెన్నై, కోయంబత్తూరు, తిరువణ్ణామలై, కరూర్ తదితర ప్రాంతాల్లో సోదాలు జరిగినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. సీఎం ఎంకే స్టాలిన్ ప్రభుత్వంలో వేలు పబ్లిక్ వర్క్స్ మంత్రిగా ఉన్నారు. దాడులను అధికార డీఎంకే ఖండించింది.

పాక్‌లో ఉగ్ర దాడి.. 14 మంది సైనికులు మృతి

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు శుక్రవారం జరిపిన దాడిలో 14 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. గద్వార్ జిల్లాలోని పస్ని నుంచి ఒర్మారా వైపు వస్తున్న రెండు మిలటరీ ట్రక్కులపైకి ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారని అధికారులు తెలిపారు.

దళిత మహిళపై అత్యాచారం, హత్య

బందా(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో దారుణం జరిగింది. 40 ఏళ్ల దళిత మహిళపై అత్యాచారానికి పాల్పడి, అనంతరం హత్య చేశారు. ఆమెను ముక్కలు ముక్కలుగా నరికేశారు. బాధిత మహిళ మంగళవారం రాజ్‌కుమార్ శుక్లాకు చెందిన పిండి మిల్లును శుభ్రం చేయడానికి వెళ్లింది. శుక్లాతోపాటు అతడి సోదరుడు, మరో వ్యక్తి కలిసి ఆమెను ఓ గదిలో బంధించి, అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు ప్రతిఘటించడంతో హత్య చేశారు. శరీరాన్ని మూడు ముక్కలుగా నరికారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. బాధితురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు.



కారుకు... నో ఎంట్రీ


కల్వల మల్లికార్జున్‌రెడ్డి

రాష్ట్ర సాధన లక్ష్యంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసింది. ప్రస్తుతం ఐదో పర్యాయం భారత్ రాష్ట్ర సమితి పేరిట శాసనసభ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, 2009 ఎన్నికల్లో ఇతర పార్టీలతో ఎన్నికల అవగాహన కుదుర్చుకుని పోటీ చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర అవతరణ నేపథ్యంలో 2014లోనూ ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. ఇలా వరుసగా రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా నేటికీ కొన్ని సెగ్మెంట్లలో మాత్రం పట్టు సాధించలేకపోతోంది. కొరకరాని కొయ్యలుగా మిగిలిన ఆ సెగ్మెంట్లపై ఇప్పుడు సీరియస్‌గా దృష్టి సారించిన బీఆర్ఎస్ ఇతర పార్టీలకు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా ఈసారైనా పాగా వేయాలని భావిస్తోంది.

ఆ 17 సీట్లలో నేటికీ బోణీ కొట్టని బీఆర్ఎస్

హైదరాబాద్, ఉమ్మడి ఖమ్మంలో అరకొర ఫలితం

మరో 39 చోట్ల ఒక్కోసారి, 37 చోట్ల రెండుమార్లు



ఆయా చోట్ల ఇలా...

119 అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను 17 చోట్ల ఇప్పటివరకు బీఆర్ఎస్ పట్టు సాధించలేకపోయింది. మరో 39 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కేవలం ఒక్కసారే గెలుపొందగా, 37 నియోజకవర్గాల్లో రెండేసి పర్యాయాలు విజయం సాధించారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు 26 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపుతీరాలకు చేరారు. 2001 నుంచి జరిగిన సాధారణ, ఉప ఎన్నికల గణాంకాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే బీఆర్ఎస్ అభ్యర్థులు సిద్దిపేటలో అత్యధికంగా ఎనిమిది పర్యాయాలు, హుజూరాబాద్‌లో ఆరు పర్యాయాలు, వరంగల్ పశ్చిమలో ఐదుసార్లు గెలుపొందారు.

పాతబస్తీలో ఎంఐఎంతో దోస్తీ

హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో 29 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని పాతబస్తీలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉద్యమ కాలంలో పాతబస్తీలో పరిమిత సీట్లలో పోటీ చేసినా 2014, 2018 ఎన్నికల్లో మాత్రం అన్ని సీట్లలో అభ్యర్థులను బరిలోకి దింపింది. అయితే మజ్లిస్ పార్టీతో మిత్రబంధం ఉన్న నేపథ్యంలో హైదరాబాద్ పాతబస్తీలో బీఆర్ఎస్ స్నేహపూర్వక పోటీ పేరిట నామమాత్ర పోటీకి పరిమితమవుతోంది.

అక్కడ ఈసారీ నామమాత్రపు పోటీనే?

ప్రస్తుతం ఎంఐఎం ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడు స్థానాలతో పాటు ఆ పార్టీ బలంగా ఉన్న మరో రెండు సీట్లు నాంపల్లి, గోషామహల్‌లో ఈసారి కూడా బీఆర్ఎస్ నామమాత్ర పోటీకి పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సుమారు రెండున్నర నెలల క్రితమే హైదరాబాద్ పాత బస్తీలోని ఏడు స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించినా, వారికి ఇప్పటికీ బీ ఫారాలు ఇవ్వలేదు. మరోవైపు నాంపల్లి, గోషామహల్ అభ్యర్థుల పేర్లను బీఆర్ఎస్ నేటికీ ఖరారు చేయలేదు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాపై చిక్కని పట్టు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా బీఆర్ఎస్‌కు పట్టు చిక్కడం లేదు. 2014లో కొత్తగూడెంలో మాత్రమే పార్టీ అభ్యర్థి జలగం వెంకట్రావు ఒక్కరే గెలుపొందారు. పాలేరుకు జరిగిన ఉపఎన్నికలో టీఆర్ఎస్ తరఫున తుమ్మల నాగేశ్వరరావు గెలవడంతో పార్టీ బలం రెండుకు చేరింది. ఆ తర్వాత చేరికల ద్వారా బలపడే ప్రయత్నంలో భాగంగా కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గూటికి చేరుకున్నా 2018లో జరిగిన ఎన్నికల్లోనూ ఒక్క ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్లో మాత్రమే విజయం సాధ్యమైంది. చేరికల వ్యూహంతో మరోమారు కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని లోటును పూడ్చుకునేందుకు కేసీఆర్ ప్రయత్నించారు. అయితే చేరికల వ్యూహం వికటించి ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తాటి వెంకటేశ్వర్లు, పాయం వెంకటేశ్వర్లు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరోవైపు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు చెందిన కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్‌బీ నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లితో పాటు ఖైరతాబాద్, జూబ్లీ హిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో చేరికల ద్వారా బలపడేందుకు అనుసరించిన వ్యూహం 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సానుకూల ఫలితాన్ని ఇచ్చిందనే చెప్పాలి.

నేటికీ గెలుపు తీరాలకు చేరని నియోజకవర్గాలివే..

ఉమ్మడిఖమ్మం జిల్లాలోని భద్రాచలం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, మధిర, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందలేదు. వీటితో పాటు హైదరాబాద్ పాతబస్తీలోని బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, చార్మినార్, గోషామహల్, కార్వాన్, నాంపల్లి, మలక్‌పేట, ఎల్‌బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ పాగా వేయలేకపోయింది. అయితే 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత విపక్ష పార్టీలకు చెందిన అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, ఇల్లందు, పినపాక, ఎల్‌బీనగర్, మహేశ్వరం ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంది. వీరిలో వైరా ఎమ్మెల్యే రాములునాయక్ మినహా మిగతా ఎమ్మెల్యేలు ప్రస్తుత ఎన్నికలో బీఆర్ఎస్ నుంచే బరిలోకి దిగుతున్నారు.

2004లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంల కూటమితో బీఆర్ఎస్ ఎన్నికల అవగాహన కుదుర్చుకుంది.

2009లో టీడీపీ, సీపీఐలతో కూడిన మహాకూటమితో బీఆర్ఎస్ ఎన్నికల అవగాహన కుదుర్చుకుంది

2014, 2018లో రాష్ట్ర ఆవిర్భావం నేపథ్యంలో 119 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసింది.

2001 నుంచి గెలుపు ఇలా...

పర్యాయాలు	నియోజకవర్గాలు
ఒకసారి	39
రెండు	37
మూడు	14
నాలుగు	09
ఐదు	01
ఆరు	01
ఎనిమిది	01

Interview



అవినీతి బాబు చుట్టూ..

రాజకీయమేంటి?

కులం పేరుతో కట్టడి మంత్రమేంటి?
పవన్, చంద్రబాబు రాజకీయ ఎత్తులేంటి?
ఏపీలో ఒక రకంగా.. తెలంగాణలో ఇంకో తీరా?
సెటిలర్స్ పేరుతో గాయాన్ని రేపడం సరికాదు
టీడీపీ కేవలం ఒక సామాజిక వర్గానిదేనా?
ఎన్టీఆర్ బీసీలకు 50% అంటే... వీళ్లేంటి ఇలా?
రోత పుట్టిస్తున్న నేటి రాజకీయాలు

సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ

వనం దుర్గాప్రసాద్

కులం పునాదులతో రాజకీయాలేంటి? ఎవరో కొందరు..ఎవరి కోసమో ఈ నాటకాలాడితే ఎలా? మాసిపోయిన 'సెటిలర్స్' గాయాన్ని గెలికి గెలికి... పుండుగా చేయడం న్యాయమా?.. ప్రముఖ సినీ దర్శకుడు, తెలుగు సినీ కార్మికుల నేతగా ప్రసిద్ధి చెందిన తమ్మారెడ్డి భరద్వాజ సంధించిన ప్రశ్నలివి. అవినీతి ఆరోపణల కేసులో అరెస్టయిన చంద్రబాబుకు కులం ప్రాతిపదికన సానుభూతి తెలిపే విధానం వల్ల జరిగే నష్టాన్ని ఆయన ప్రస్తావించారు. ఇదే అదనుగా అందరికీ 'కమ్మ' రంగు పులమడం సరికాదని తమ్మారెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. దివంగత ఎన్టీఆర్ కూడా టీడీపీని కేవలం ఒక సామాజికవర్గానికే పరిమితం చేయలేదని చెప్పారు. తికమక పెట్టే రాజకీయాలు..ఇబ్బందులు సృష్టించే నాయకులను ఈసారి ఎన్నికల్లో చూస్తున్నామనేది ఆయన భావన. తెలంగాణ వ్యాప్తంగా కనిపిస్తున్న పబ్లిక్ మూడ్ మొదలుకొని, మారుతున్న రాజకీయాలపై తమ్మారెడ్డి విస్పష్టమైన వైఖరిని వెల్లడించారు. ఆయనేమన్నారంటే....?

అసలేంటీ వైఖరి?

చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి ఆరోపణల కేసులో అరెస్టు అయ్యారు. దీన్ని కొంతమంది తమ సామాజికవర్గం చుట్టూ తిప్పే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు సత్య హరిశ్చంద్రుడని వాళ్ల నమ్మకం కావొచ్చు. అది కోర్టులో తేలాలి. కానీ ఆ కసి తెలంగాణ రాజకీయాలపైనా చూపించే ప్రయత్నమేంటి? ఒక సామాజికవర్గం మొత్తం గంపగుత్తగా ఓ పార్టీని సమర్థిస్తుందని ప్రచారం చేయడంలో అర్థమేంటి? టీడీపీ ఒక సామాజిక వర్గానిదేనా? అదే నిజమైతే ఎన్టీఆర్ 50 శాతం బీసీలకే టికెట్లు ఎందుకిచ్చారు? అసలు కులం ప్రస్తావనేంటి? వాళ్లు చెప్పే కులమే అంత బలమైనది అయితే, 2014లో ఎందుకు తెలంగాణలో ఓడిపోయింది? ఇలా ప్రచారం చేయడంలో ఓ కుట్ర కనిపిస్తోంది. తెర వెనుక కీలకమైన వ్యక్తుల ప్రమేయం ఉండొచ్చు.

పవన్ రాజకీయమేంటి?

పవన్‌కల్యాణ్ రాజకీయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతోనే ఉంటానంటాడు. బీజేపీని వదిలేస్తానంటాడు. తెలంగాణకు వచ్చి బీజేపీకి మద్దతిస్తాడు. కలిసి పోటీ అంటాడు. చంద్రబాబు జైలుకెళ్లిన తర్వాతే కదా... జనసేన, టీడీపీ పొత్తు బంధం బయటకొచ్చింది. చంద్రబాబు జైలు నుంచి రాగానే పవన్‌కే కృతజ్ఞతలు తెలిపారు. మరి ఇదేంటి? చంద్రబాబు పార్టీ వాళ్లేమో తెలంగాణలో కాంగ్రెస్ జెండా మోస్తామంటున్నారు. పవన్ మాత్రం బీజేపీ గొడుక్కిందకు వెళ్తానంటున్నాడు. విచిత్రం ఏమిటంటే తెలంగాణలో తన కేడర్ ఏ పార్టీ వైపు ఉండాలనేది చంద్రబాబు చెప్పడు. టీడీపీ అయినా జనసేన అయినా అంతా తానే అని చెప్పే పవన్ ఇంకా వ్యూహం ఖరారు చేయలేదు. పవన్, చంద్రబాబు ఎవరి మాట ఎవరు వింటారో గానీ... తెలంగాణ ఎన్నికల్లో ఒకే వ్యూహంతో వెళ్లగలరా? ఈ తరహా రాజకీయాలు కొంత గందరగోళపరుస్తున్నాయి.

ఇక్కడ సెటిలర్స్ హ్యాపీ.. కానీ ఇప్పుడు ఆ నిరసనలేంటి?

తెలంగాణ ఏర్పడిన రోజుల్లో స్థానికేతరుల్లో కొంత టెన్షన్ ఉన్నమాట నిజం. ఇప్పుడది లేదు. అంతా కలిసిపోయి ఉంటున్నారు. చంద్రబాబు అరెస్టు తర్వాత కొంతమంది మళ్లీ ఈ విభజన రేఖ తెస్తున్నారు. సెటిలర్స్ పేరుతో ముందుకొస్తున్నారు. దీన్ని ఓ సామాజికవర్గం నెత్తికెత్తుకోవడం విశేషం. సెటిలర్స్ అనేది మాసిపోయిన గాయం. కొంతమంది కోసం ఈ గాయాన్ని రేపుతున్నారు. పుండులా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. సెటిలర్స్ పేరుతో చంద్రబాబు వ్యవహారంపై నిరసనలేంటి? సెటిలర్స్‌లో కమ్మవాళ్లే ఉన్నారా? అన్ని కులాల వాళ్లూ ఉన్నారని గుర్తించాలి. ఇది అందరి ప్రయోజనాలు దెబ్బతీస్తుందని తెలుసుకోవాలి.

'చిత్రం'లోనూ మార్పులు

రాజకీయాలపై సినిమా ప్రభావం కీలకం. రాజకీయాల నుంచే సినిమా వస్తుందా? సినిమా రాజకీయాలకు ప్రేరణ ఇస్తుందా? అనేది చెప్పలేం. కానీ ప్రజాజీవితాలకు దగ్గరగా ఉండే రాజకీయ సినిమాలను జనం ఆదరిస్తున్నారు. అంతే కాదు... కరుడుగట్టిన కాషాయం రంగుతో తీసిన సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి. అంటే మార్పును ప్రజలు స్వాగతిస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లోనూ అది కనిపిస్తోంది. రాష్ట్రం ఏర్పడ్డాక ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఇది గ్లోబలైజేషన్ ఎఫెక్ట్ మాత్రమే. అలా అని నిరుద్యోగమూ పూర్తిగా పోలేదు. యువత ఆలోచనకు ఇదే కారణమైంది. రైతుబంధు ఇస్తున్నామని చెప్పే నేతలు... రూ.కోట్లు ఉన్నవాడికి కూడా ఇవ్వడం న్యాయమేనా? అనేక కష్టనష్టాలకోర్చే కౌలు రైతులకు ఇవ్వకపోవడం ధర్మమేనా? సామాజిక పరిస్థితుల నుంచే ప్రజాతీర్పు వస్తుంది. ఒకటి మాత్రం నిజం. గెలిచే వాళ్ల వైపే ప్రజలు ఉంటారు. అందుకే వామపక్షాలు ఉద్యమించే చరిత్ర ఉన్నా, ఓట్లు పొందలేకపోతున్నాయి. నేను ఒకటి చెప్పాలనుకుంటున్నాను. ప్రజలిచ్చిన అధికారం రాచరికంగా భావించే నాయకులను ఓటు ఆయుధంతోనే ప్రజలు బుద్ధి చెప్పాలి. వాళ్ల కోరలు పీకి వేయాల్సిందే.

ఎన్నికల హామీలు, మేనిఫెస్టోల్లో కానరాని భూసమస్యలు

నేల మీదకు రండి!



మేకల కళ్యాణ్ చక్రవర్తి

ఎన్నికల్లో గెలిచేందుకు రాజకీయ పార్టీలు ప్రజలకు ఎన్నెన్నో హామీలతో కూడిన మేనిఫెస్టోలను విడుదల చేస్తున్నా, వాటిలో ఎక్కడా కూడా భూమి ఎజెండా కావడం లేదు. ఇందుకు కారణాలేవైనా తెలంగాణలో భూమి చుట్టూ తిరగాల్సిన రాజకీయం డబ్బు చుట్టూ తిరుగుతోందని వర్తమాన పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలు, రాజకీయ పార్టీలు దృష్టి సారించాల్సిన అంశాలపై తెలంగాణ ప్రజల భూమి మేనిఫెస్టో-2023 పేరుతో తెలంగాణ సమాఖ్య 15 కీలక అంశాలను తెరపైకి తెచ్చింది. లీఫ్స్ సంస్థ, గ్రామీణ న్యాయపీఠం, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం నిర్వహించిన తెలంగాణ భూమి కారవాన్, భూన్యాయ శిబిరాలు, న్యాయగంట, చర్చా వేదికల ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతుల అభిప్రాయాల ఆధారంగా ఈ డిమాండ్లను పార్టీల ముందుంచింది.

15 రైతు డిమాండ్లను తెరపైకి తెచ్చిన 'తెలంగాణ సమాఖ్య'

ఒకటే పట్టా.. ఒకటే రికార్డు... ఒకటే చట్టం నినాదమే భూసమస్యలకు ప్రధాన పరిష్కారం

లా కమిషన్ తరహాలో భూకమిషన్ ఏర్పాటు అనివార్యం... సమగ్ర సర్వేతోనే శాశ్వత హక్కులు

ఇవి జరిగితే భూములకు సంబంధించిన 90 శాతం సమస్యలు పూర్తయినట్టే



ఆ ఒకటే రికార్డు-ఒకటే పట్టా-ఒకటే చట్టం నినాదాన్ని ఎన్నికల ఎజెండా చేయాలని భూచట్టాల నిపుణులు చెబుతున్నారు. ఇది సాధ్యమైతే 90 శాతం సమస్యలు పరిష్కారమైనట్లేనని అంటున్నారు. ఒకటే రికార్డు కావాలంటే భూముల సమగ్ర సర్వే జరగాలి. ఒకటే పట్టా కావాలంటే ప్రభుత్వమే టైటిల్ గ్యారంటీ ఇవ్వాలి. ఒకటే చట్టం కావాలంటే రెవెన్యూ కోడ్ అమల్లోకి రావాలి. ఇవి మూడూ జరగాలంటే రాజకీయ నిబద్ధత కావాల్సిందే. వీటితో పాటు లా కమిషన్, సర్వీస్ కమిషన్, స్టేట్‌ఫైనాన్స్ కమిషన్ తరహాలో భూ కమిషన్ ఏర్పాటు డిమాండ్ కూడా ఉంది. కౌలు-వ్యవసాయ భూముల చట్టం (1950) ప్రకారం అధికారులు, నిపుణులు, ప్రజాప్రతినిధులతో ఈ కమిషన్ ఏర్పాటు తప్పనిసరి. అయితే 1950 నుంచి ఓ దశాబ్దంపాటు అమల్లో ఉన్న ఈ కమిషన్ ఆ తర్వాత క్రమంగా కనుమరుగైంది.

భూమికి సంబంధించిన ఇతర డిమాండ్లు ఇవి

ఆర్ఓఆర్ చట్టాన్ని సవరించి పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను పరిష్కరించి పట్టాలివ్వాలి.

పోడు సాగు చేస్తున్న అర్హులైన గిరిజనులందరికీ అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి హక్కు పత్రాలను అందించాలి.

భూపంపిణీకి ప్రత్యేక పథకం రూపొందించాలి. సీలింగ్ చట్టంతో మిగులు భూమిని భూమిలేని వ్యవసాయ పేద కుటుంబాలకు పునఃపంపిణీ చేయాలి.

భూవివాదాల పరిష్కారానికి జిల్లాకో భూమి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. రాష్ట్ర స్థాయిలో అప్పీలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుతోపాటు పేదలకు ఉచిత న్యాయ సాయం, పారాలీగల్ పథకాలను అమలు చేయాలి.

ధరణి సమస్యల పరిష్కారం కోసం గ్రామ స్థాయిలో రెవెన్యూ కోర్టులు నిర్వహించాలి. కంప్యూటర్‌లో ఉన్న భూరికార్డులు వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేలా ఉండాలి. రికార్డుల్లో తప్పులను సత్వరమే సవరించేలా సాఫ్ట్‌వేర్ రూపొందించాలి. కంప్యూటర్‌లో ఉన్న రికార్డులకు భద్రత కల్పించాలి.

నిషేధిత జాబితా (22ఏ)లో పొరపాటున నమోదైన పట్టా భూములను వెంటనే జాబితా నుంచి తొలగించాలి.

గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భూపరిపాలన యంత్రాంగాన్ని పటిష్టపర్చాలి. అవసరాలకు తగినట్టు వారికి తగిన శిక్షణ ఇవ్వడం కోసం భూ అకాడమీని ఏర్పాటు చేయాలి.

భూవిధానం, భూమి వినియోగ విధానం, 2014లో చేసిన భూసేకరణ చట్టం యథాతథంగా అమలు చేయాలి.

-కౌలుదారులను సాగుదారులుగా గుర్తించి వారికి పట్టా రైతులుగా అందాల్సిన అన్ని రకాల సాయం అందించాలి. కొత్త కౌలు చట్టం రూపొందించాలి.

'సర్వే'జనా..!

భూముల సమగ్ర సర్వే కూడా రాజకీయ ఎజెండా కావాల్సిందేననేది రైతుహితుల అభిప్రాయం. గుజరాత్‌తోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్తాన్‌లలో భూసర్వే జరిగింది. ఏపీలో జరుగుతున్న సర్వే దక్షిణాదిలో ఉత్తమమైన సర్వేగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోనే భూముల సమగ్ర సర్వే చేసిన మొదటి రాష్ట్రంగా గుర్తింపు పొందుతుంది. తెలంగాణలో ఈ సర్వే చేసేందుకు 2016లో రూ.580 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇప్పుడు అది రూ.800 కోట్లకు చేరింది. శాటిలైట్, డ్రోన్, డీజీపీఎస్ (డిజిటల్ జియో పొజిషనింగ్ సిస్టమ్స్)ల ద్వారా గ్రామ సరిహద్దులు, హైస్కేల్ మెజర్‌మెంట్స్ తీసుకొని యునీక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఎల్‌పిన్) లేదా ల్యాండ్ పార్సిల్ నంబర్ ఇవ్వడం ద్వారానే భూమి హక్కులకు భద్రత కలగనుంది. ఇక మరో కీలకాంశం అసైన్డ్ భూములకు పట్టా హక్కుల కల్పన. ప్రస్తుతం బీఆర్ఎస్ మేనిఫెస్టోలో, కాంగ్రెస్ రైతు డిక్లరేషన్‌లో ఈ అంశం పొందుపర్చారు. భూ బదలాయింపు (పీఓటీ) చట్టాన్ని సవరించడం ద్వారా ఆ భూములు కేటాయించిన 20 ఏళ్ల తర్వాత ఏపీ, కర్ణాటకల్లో, 15 ఏళ్ల తర్వాత తమిళనాడులో పూర్తిస్థాయి యాజమాన్య హక్కులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయి. తెలంగాణలో కూడా 1950 నుంచి పేదలకు అసైన్ చేసిన 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. ఈ భూములపై హక్కులకల్పన రాజకీయ ఎజెండా అయితే పేదల ఆర్థిక ముఖచిత్రంలో ఊహించని మార్పులు రానున్నాయి.

గాసిప్ టైమ్

ఎన్నికలకు అప్పులిస్తాం..

ఎన్నికల ఫైనాన్షియర్స్ రూటే సపరేట్. లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు మొదలు, ఏ ఉపఎన్నిక వచ్చినా వీరు హఠాత్తుగా తెరపైకి వచ్చేస్తారు. కొందరు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలుగా ఉన్న రాజకీయనేతల వద్ద పెద్దమొత్తంలో లిక్విడ్ క్యాష్ ఉండడంతో వీరు కూడా ఎన్నికల టైమ్‌లో ఫైనాన్షియర్స్ అవతారం ఎత్తుతున్నారట. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీకి పెద్దమొత్తంలో ఖర్చు అవుతుండడంతో, పార్టీలకతీతంగా పలువురు నేతలు పొలిటికల్ ఫైనాన్షియర్స్‌పైనే ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందనేది బహిరంగ రహస్యం. అప్పు కింద ఇచ్చిన డబ్బుకు పెద్దమొత్తంలో వడ్డీ వసూలు చేయడమే కాకుండా, అప్పు తీసుకున్న నగదుకు బదులు భూములు, ఇతర స్థిరాస్తుల కైవసానికే ఈ ఫైనాన్షియర్స్ మొగ్గు ఉంటుందట.

ఓ జాతీయ పార్టీ నేత అప్పుడే పని మొదలుపెట్టేశారట

ఓ జాతీయపార్టీలో ఉన్న నేత పనంతా కూడా ఎన్నికలప్పుడు డబ్బులు సర్దుబాటు చేయడం, భూమిపత్రాలు, ఇతర స్థిరాస్తులను రాయించుకోవడం వంటివేననేది ఆ పార్టీ నేతలతో సహా అందరికీ తెలిసిన మాట. ఇప్పుడు కూడా ఆయన రెడీ అయిపోయారట. కాగా రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఉపఎన్నికల సందర్భంగా కూడా ఇదేవిధంగా డబ్బు సర్దుబాటు చేయగా, తీసుకున్న వారు సమయానికి తిరిగి డబ్బు ఇవ్వకపోవడంతో భూమిని తన పేరిట రిజిస్టర్ చేయాలని సదరు ఫైనాన్షియర్ పట్టుబట్టారట. దీంతో స్వయంగా పారిశ్రామికవేత్తగా ఉన్న ఓ నేత తీసుకున్న అప్పునకు వ్యవసాయ భూమిని వదులుకోవాల్సి వచ్చిందట. ఇప్పుడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ పెద్దమొత్తంలో లిక్విడ్ క్యాష్ అవసరం కావడంతో ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడా లేకుండా అన్ని పార్టీల అభ్యర్థులు ఈ ఎన్నికల ఫైనాన్షియర్స్‌నే నమ్ముకున్నారట!

సామాన్యులే సమరానికి

నామినేషన్ల తొలిరోజైన శుక్రవారం చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. ఒకరు డిపాజిట్ మొత్తాన్ని రూ. పదినాణేల రూపంలో అందజేయగా, ఓ యువకుడు సైకిల్‌పై, మరొకరు ఆటోలో వచ్చి నామినేషన్ దాఖలు చేశారు.



రూ.10 నాణేలతో డిపాజిట్

కొత్తగూడెం స్వతంత్ర అభ్యర్థి నామినేషన్



చుంచుపల్లి/సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఆజాద్ అధికార సేన పార్టీ బలపరుస్తున్న ఐమంది ఉదయ్‌కుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ డిపాజిట్‌గా రూ.10 వేలు చెల్లించాల్సి ఉండగా, వెయ్యి రూ.10 నాణేలను రిటర్నింగ్ అధికారికి అందజేయడం విశేషం.



అసెంబ్లీకి వెళతా అంటున్న ఆటోడ్రైవర్

కరీంనగర్ అర్బన్: ఓ ఆటోడ్రైవర్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఓటర్లకు హామీ ఇచ్చారు నగరంలోని ముకరంపురకు చెందిన నగునూరి ఎల్లయ్య ఆటోడ్రైవర్.



సైకిల్‌పై వచ్చి ..

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ స్వతంత్ర అభ్యర్థిగా బెల్లం కరుణాకర్ సైకిల్‌పై వచ్చి నామినేషన్ వేశారు. నిరుద్యోగంతోపాటు రైతుల సమస్యలను మైక్ ద్వారా వివరిస్తూ సైకిల్‌యాత్ర చేశారు.



అవినీతి అంతం.. శ్యామ్ పంతం

కరీంనగర్ అర్బన్: అవినీతి అంతమే తన పంతమని చెబుతున్నాడు కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కోట శ్యామ్ కుమార్. గతంలోనూ రెండుసార్లు నామినేషన్ వేశారు. తాజాగా కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్యామ్ నామినేషన్ వేశారు. అవినీతిపై అవగాహన కల్పిస్తూ స్థానికంగా భార తీయుడిగా గుర్తింపు పొందాడు.

చట్టసభల్లో నల్ల సూరీళ్లు

ముగ్గురు రాష్ట్ర మంత్రులుగా.. ఒకరు ఎమ్మెల్సీగా

సింగరేణి సంస్థలో పనిచేసి ఆ తర్వాత చట్టసభలకు ఎన్నికై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాష్ట్ర మంత్రులుగా ఎదిగిన వారెందరో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన కార్మికులు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించారు. నేరుగా బొగ్గు గనుల్లోకి దిగి పనిచేసిన కార్మికులు కొందరైతే, క్లరికల్ ఉద్యోగం చేస్తూ చట్టసభలకు ఎంపికైనవారు మరికొందరున్నారు. – గోదావరిఖని

కొప్పుల ఈశ్వర్..

కొప్పుల ఈశ్వర్ 1976లో కార్మిక జీవితాన్ని ప్రారంభించారు.తొలిసారిగా 1994లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. తిరిగి మేడిపల్లి ఓసీపీలో 8 ఏళ్ల పాటు పనిచేశారు. ఈశ్వర్ ఆ తర్వాత వరుసగా జరిగిన 2004 నుంచి టీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. ప్రస్తుత కేసీఆర్ కేబినెట్‌లో మంత్రి.

మాలెం మల్లేశం

1974లో కోల్‌ఫిల్లర్‌గా జీడీకే–2ఏ గనిలో కార్మికుడిగా చేరిన మల్లేశం..1985లో క్లర్క్‌గా పదోన్నతి పొందారు. 1985లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1994లో ఇండిపెండెంట్‌గా అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

కోదాటి రాయమల్లు..

పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన కోదాటి రాయమల్లు బెల్లంపల్లి ఏరియాలో గనుల్లో క్లర్క్‌గా పనిచేశారు. చెన్నూరి నుంచి 1952లో మొదటిసారిగా ప్రజాసోషలిస్ట్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1957 నుంచి 1972 వరకు వరసగా కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1980లో పెద్దపల్లి ఎంపీగా విజయం సాధించారు. 1972 నుంచి 1978 వరకు ఆరోగ్యశాఖమంత్రిగా పనిచేసి

దాసరి నర్సయ్య..

బెల్లంపల్లి పట్టణానికి చెందిన నర్సయ్య బెల్లంపల్లి ఏరియాలో వివిధ గనుల్లో సర్వే మజ్దూర్‌గా, మైనింగ్ సర్దార్‌గా 1974 నుంచి 1978 వరకు పనిచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆసిఫాబాద్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 1989లో కూడా గెలిచారు.

ఎస్.సంజీవరావు..

కరీంనగర్ జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామానికి చెందిన సాత్కు సంజీవరావు మందమర్రి ఏరియాలోని గనిలో 1978 నుంచి 1981 వరకు పనిచేశారు. 1983లో చెన్నూరు నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు.

సంభాని చంద్రశేఖర్..

చంద్రశేఖర్ కొత్తగూడెం ఏరియాలో క్లర్క్‌గా పనిచేశారు. 1985లో పాలేరు నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై 2004లో వైఎస్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు.



బోడ జనార్దన్..

1977–1982 వరకు శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్కే–5లో గనిలో సర్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేశారు. టీడీపీ నుంచి 1985, 1989, 1994, 1999లో వరుసగా చెన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొంది ఎన్టీఆర్ హయాంలో ఓ దఫా కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం బీఎల్ఎఫ్ కూటమి నుంచి చెన్నూరు అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

పాటి సుభద్ర..

పాటి సుభద్ర సొంతగ్రామం ఖమ్మం జిల్లా కొత్తగూడెం. 1978లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన సుభద్ర 1981 నుంచి సింగరేణి ప్రాంతంలోని బెల్లంపల్లి, సీసీసీ, శ్రీరాంపూర్, గోదావరిఖని, ఆస్పత్రుల్లో పనిచేశారు. 1999లో ఆసిఫాబాద్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

బి.వెంకట్రావ్

ఖమ్మం జిల్లా బూర్గంపాడ్‌కు చెందిన వెంకట్రావ్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. 2009 నుంచి 2015 వరకు ఎమ్మెల్సీగా పనిచేశారు. ప్రస్తుతం టీబీజీకేఎస్ యూనియన్ అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

కోరుకంటి చందర్

రామగుండం ఏరియాకు చెందిన కోరుకంటి చందర్ సింగరేణి కార్మికుని బిడ్డ. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ నుండి పోటీ చేసి 26 వేల మెజార్టీతో గెలుపొందారు.

సక్రమ్‌రాథోడ్ అను ఓ సక్రమార్కుడి కథ!!

షుగర్ & పెప్పర్

..:: యాసీన్



పట్టువదలని విక్రమార్కుడిలా ఓ అభ్యర్థి... బెట్టు చేస్తున్న బేతాళుల్లాంటి ఓటర్ని...భుజాల మీద చేతులేసి పోలింగ్ బూత్ కేసి నడిపించసాగాడు. అప్పుడా ఓటరు..ఇలా అన్నాడు. ''ఓ అభ్యర్థీ... నన్ను వెంటబెట్టుకుని తీసు వెళ్తూ..నువ్వింత శ్రమ ఎందుకు పడుతున్నావో నాకు తెలియదు. ఇప్పటికి నీతోపాటు నడుస్తున్నట్టు కనిపిస్తున్నా.. కొందరు ఓటర్లు తాము ఎవరికి వేయాలనుకుంటున్నారో వాడికే ఓటేస్తారు. అయినా..నీకు ఎన్నికల శ్రమ తెలియకుండా ఉండేందుకు, సక్రమ పద్ధతుల్లో మాత్రమే ఓటు వేసే..సక్రమ్ రాథోడ్ అనే ఓ స్ట్రిక్ట్ ఓటరు కథ చెబుతా విను'' అంటూ మొదలుపెట్టాడు.

''ఈ ఐదేళ్లలో కొన్ని బై ఎలక్షన్లూ, కీలకమైన బల్దియా ఎన్నికలు ఎన్నో వచ్చాయ్! అన్ని చోట్లా వేర్వేరు ఫలితాలు!! అంటే..వేర్వేరు సందర్భాల్లో వేర్వేరుగా ఓటు చేశావన్నమాట. అంటే..ఎక్కడా కాంప్రమైజ్ కాలేదన్నమాట. గుడ్. వెరీ ఇంప్రెసివ్ ట్రాక్ రికార్డ్.

కానీ..ఒక్కోసారి కొన్ని ఇబ్బందులొస్తాయ్. కొందరు డబ్బు ఆఫర్ చెయ్యొచ్చు. కొంతమంది సారా పోయొచ్చు. మరికొందరు బిర్యానీ ఇవ్వొచ్చు. ఒక్కోసారి నీ బంధువులే బరిలో ఉండొచ్చు. ఇంకొందరు కులం, మతం పేర నిన్ను ఆబ్లిగేట్ చేయొచ్చు. అవన్నీ నీకిష్టం ఉండకపోవచ్చు. నువ్వు తమకు ఓటేస్తావో లేదోనని కొందరు పోల్ చిట్టీలు మీ ఇంట్లో ఇవ్వకపోవచ్చు. తీరా పోలింగ్ బూత్‌కెళ్లాక ఎంత వెతికినా ఓటర్‌లిస్టులో నీపేరే కనిపించకపోవచ్చు. నీ ఓటు ఇక్కడ కాదు అనొచ్చు. లేదా అప్పటికే ఎవరో నీ ఓటు వేసేసి ఉండవచ్చు. బట్..అభ్యర్థులనూ, వాళ్ల మాటల్నీ కన్సిడర్ చేయాలి. వన్ షుడ్ హ్యావ్ ఏ హెల్దీ రెస్పెక్ట్ టువార్డ్స్ క్యాండిడేట్స్'' అంటూ హితవు చెప్పడం మొదలుపెట్టాడు ఓ శ్రేయోభిలాషి.

''సర్..తప్పకుండా కన్సిడర్ చేస్తాను సర్. క్యాండిడేట్స్ అంటే కూడా ఎంతో రెస్పెక్ట్ సర్. ఎందుకంటే డెమోక్రసీలో ఆ అభ్యర్థుల్లో ఎవరికో ఒకరికి ఓటేసితీరాలి కదా సార్. అయితే..మీరన్న ఇబ్బందులు రావచ్చూ, రాకపోవచ్చు. కానీ..'' అంటూ సక్రమ్ రాథోడ్ ఇంకా ఏదో చెప్పాడు. చెప్పాక..హీరోలా ఛాతీ ఉప్పొంగించి, హుందాగా బయటకు కదిలాడు.

అతడి మాటలు విని..ఆ శ్రేయోభిలాషి గుండె గర్వంతో ఉప్పొంగింది. కళ్లు చెమర్చాయి. (ముఖం తుడుచుకున్నట్టు నటిస్తూ కన్నీళ్ల తడి తుడుచుకున్నాడు).

అవే మాటల్ని విన్న మరో సాటిఓటరు సైతం బోలెడంత రెస్పెక్టుతో రాథోడ్‌కి తక్కుమంటూ ఓ టైట్ శాల్యూట్ కొట్టాడు. గణగణమంటూ ఎన్నికల నగారా మోగింది. అంతే..అటెన్షన్‌లోకి బిగుసుకుపోయాడు. కవాత్తు చేస్తున్నట్టుగా కదిలాడు. లెఫ్ట్, రైట్, లెఫ్ట్, రైట్ అనుకుంటూ సక్రమ్ రాథోడ్ వెంట తాను కూడా పోలింగుబూత్‌కేసి బయల్దేరాడు.

ఇంతవరకు కథ చెప్పి.. ''అభ్యర్థీ... ఇంతకూ స్ట్రిక్ట్ ఓటరైన సదరు సక్రమ్ రాథోడ్..తన శ్రేయోభిలాషికి ఏం జవాబు చెప్పి ఉంటాడు? తెలిసీ చెప్పకపోతే... కష్టపడి గెలిచాక కూడా నీ అభ్యర్థిత్వం రద్దయినంత ఒట్టు'' అడిగాడా ఓటరు.

''స్ట్రిక్ట్ ఓటర్ల మనస్తత్వం తెలిసిన అభ్యర్థిగా చెబుతున్నా విను''... అంటూ సక్రమ్ రాథోడ్ ఏమి అని ఉంటాడో వివరించాడు. అవేమిటంటే...

''సార్... మీరన్న ఇబ్బందులు రావొచ్చూ, రాకపోవచ్చు. కానీ సర్... పోలింగ్ డే రోజున ఓ బాధ్యత కలిగిన ఓటరుగా టైముకు నేను పోలింగ్‌బూత్‌లో ఉండాలి. నా ఎడమ చూపుడువేలి మీద ఇంకు ముద్ర ఉండాలి. నా కుడివేలు ఈవీఎం మిషన్ బటను మీద ఉండాలి. ఇగ పోతే... పోలింగ్ డే రోజున ఓటేసి తీరతానని నా తల్లి డెమోక్రసీ మాతకు ప్రామిస్ చేశాన్సార్. నా.. మీరిప్పుడు పర్మిషన్ ఇస్తే...'' అంటూ పోలింగ్ బూత్‌కేసి సాగిపోయుంటాడా స్ట్రిక్ట్ రాథోడ్.

జంగ్ తెలంగాణ పంచతంత్రం

కాంగ్రెస్‌కు 'ఆ నలుగురు'

రాజస్తాన్‌లో పార్టీకి వీరే కీలకం

అధికార పార్టీని మళ్లీ గెలిపిస్తారా?

30 ఏళ్ల ఆనవాయితీని మారుస్తారా?

ఏ మేరకు కలిసి నడుస్తారంటూ చర్చ


రాజస్తాన్‌లో అధికార పార్టీ నెగ్గి ఏకంగా 30 ఏళ్లయింది. కాంగ్రెస్, బీజేపీలను ఐదేళ్లకోసారి మార్చి మార్చి ఎన్నుకోవడం అక్కడి ప్రజలకు ఆనవాయితీగా వస్తోంది. ఈసారి ఎలాగైనా ఈ ట్రెండును మార్చాలని అధికార కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా సీఎం అశోక్ గెహ్లోత్ అయితే ఓటర్ల మనసు గెలిచేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఎన్ని వీలైతే అన్ని పథకాలు ప్రకటిస్తూ పోతున్నారు. అంతేగాక పార్టీలో తనతో ఇంతకాలం ఉప్పూ నిప్పుగా ఉన్న పార్టీ ముఖ్య నేతలను కలుపుకుని పోయేందుకు కూడా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రాజస్తాన్ కాంగ్రెస్‌లోని ముఖ్య నేతలపై ఫోకస్...

అశోక్ గెహ్లోత్

72 ఏళ్ల గెహ్లోత్ సీఎం పదవి చేపట్టడం ఇది మూడోసారి. గత రెండుసార్లూ సీఎంగా పార్టీని మళ్లీ అధికారంలోకి తేలేకపోయిన అపప్రథను మూటగట్టుకున్నారు. ఈసారి ఆ ట్రెండును ఎలాగైనా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. లా పట్టభద్రుడైన గెహ్లోత్ 1974లో కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ అధ్యక్షునిగా వెలుగులోకి వచ్చారు. అనంతరం జోధ్‌పూర్ నుంచి ఏకంగా ఐదుసార్లు ఎంపీగా నెగ్గారు. కేంద్రంలో ఇందిర, రాజీవ్, పీవీ ప్రభుత్వాల్లో మంత్రిగా కూడా చేశారు. 1999లో సర్దార్‌పురా అసెంబ్లీ ఉప ఎన్నికలో నెగ్గడం ద్వారా రాజస్థాన్ రాజకీయాల్లో చురుగ్గా మారారు. నాటినుంచీ అదే స్థానంలో గెలుస్తూ వస్తున్నారు. 1998లో తొలిసారి, 2008లో రెండోసారి సీఎం అయ్యారు. 2020లో అందరు అధికార పెద్దల్లాగే కరోనా కల్లోలంతో పాటు యువ నేత సచిన్ పైలట్ తిరుగుబాటును కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. కాకపోతే పలు సంక్షేమ కార్యక్రమాలతో ఓటర్లలో గట్టి పునాది ఏర్పాటు చేసుకున్నారు. ఆ పాపులారిటీయే ఈసారి తనను గట్టెక్కిస్తుందని భావిస్తున్నారు. ఆయన తెచ్చిన రూ.25 లక్షల ఆరోగ్య బీమా తదితర పథకాలు ప్రజలను బాగానే ప్రభావితం చేస్తున్నాయి.

గోవింద్‌సింగ్ దోటాసరా

రాజస్తాన్ పీసీసీ అధ్యక్షుడు. జాట్ సామాజిక వర్గానికి చెందిన గోవింద్ వృత్తిరీత్యా లాయర్. ఎన్ఎస్‌యూఐ నుంచే రాజకీయాల్లోకి వచ్చారు. 2008లో 41 ఏళ్ల వయసులో తొలిసారి ఎమ్మెల్యేగా నెగ్గారు. 2013లో బీజేపీ హవాను తట్టుకుని తిరిగి నెగ్గిన కొద్దిమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఒకరిగా నిలిచారు. చూస్తుండగానే రాష్ట్ర కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగారు. 2020లో పైలట్ తిరుగుబాటు నేపథ్యంలో పీసీసీ చీఫ్ పదవి చేపట్టారు. జాట్ల ఓట్లను కాంగ్రెస్‌కు అనుకూలంగా సంఘటితం చేసే పనిలో పడ్డారు.


అశోక్ గెహ్లోత్

సచిన్ పైలట్

అన్ని విషయాల్లోనూ గెహ్లోత్‌కు పూర్తి భిన్నంగా కనిపించే యువ నేత. సీనియర్ కాంగ్రెస్ నేత అయిన ఆయన తండ్రి రాజేశ్ పైలట్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో 2000లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. పైలట్ ట్రెనింగ్ పొందారు. విదేశాల్లో చదుకుని వచ్చారు. 2004లో 26 ఏళ్ల వయసులో దౌసా నుంచి లోక్‌సభకు ఎన్నికై అత్యంత పిన్న వయస్కుడైన ఎంపీగా రికార్డుకెక్కారు. తొలుత అంతా ఆయన్ను రాజస్థాన్ గ్రామీణ ప్రాంతాలకు దూరంగా కేవలం ఢిల్లీ రాజకీయాలకే పరిమితమయ్యే నేతగా భావించారు. కానీ ఆ అభిప్రాయం తప్పని త్వరలోనే నిరూపించారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఘోర పరాభవం నేపథ్యంలో పీసీసీ పగ్గాలు చేపట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పీసీసీ చీఫ్‌గా అంతా తానై కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపారు. అదే ఊపులో పైలట్ సీఎం కావడం ఖాయమనే అంతా భావించారు. కానీ అధిష్టానం అనూహ్యంగా గహ్లోత్‌నే సీఎం చేసి తనను డిప్యూటీ సీఎంతో సరిపెట్టుకొమ్మనడంతో అసంతృప్తితో రగిలిపోయారు. చివరికి 2020లో తిరుగుబాటుకు దిగారు. పెద్దగా బావుకున్నదేమీ లేకపోగా పార్టీ పదవులన్నీ పోగొట్టుకున్నారు. ప్రస్తుతానికి రాజీ పథాన సాగుతున్నారు. కీలక సామాజిక వర్గమైన గుజ్జర్ల ఓట్లన్నీ మరోసారి కాంగ్రెస్‌కే పడేలా 46 ఏళ్ల సచిన్ చక్రం తిప్పుతారని అధిష్టానం ఆశిస్తోంది.


సచిన్ పైలట్

సీపీ జోషి

రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ప్రొఫెసర్‌గా పరిచితుడైన నేత. చిరకాలం పాటు లెక్చరర్‌గా చేసిన అనంతరం 1973లో రాజకీయాల్లోకి వచ్చారు. 1980 నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా నెగ్గారు. 1998లోనే మంత్రి అయ్యారు. 2008లో కేవలం ఒక్క ఓటుతో ఓటమి చవిచూశారు! అయినా 2009లో లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గి కేంద్ర మంత్రిగా చేశారు. 2019 నుంచి కొన్నేళ్లు స్పీకర్‌గా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మంత్రులను కూడా మందలించేవారు. తన అనుభవాన్నంతా రంగరించి పార్టీ విజయానికి కృషి చేస్తున్నారు.


సీపీ జోషి


గోవింద్‌సింగ్ దోటాసరా

-సాక్షి, నేషనల్ డెస్క్

వాళ్లు నేతలు కారు.. నిధుల సేకరణదారులు

కాంగ్రెస్ సీఎంలపై జేపీ నడ్డా ధ్వజం

రెవా: మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్, రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్‌లు నేతలు కారు, కాంగ్రెస్ పార్టీకి నిధులు సేకరించేవారని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. వీరు తమ రాష్ట్రాల నుంచి వసూళ్లు చేసి, ఆ డబ్బును 'ఢిల్లీ దర్బార్'కు అందజేస్తుంటారని కాంగ్రెస్ హై కమాండ్‌నుద్దేశించి ఆయన పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని రెవా జిల్లా టియోంథర్ నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో జేపీ నడ్డా మాట్లాడారు. కమల్‌నాథ్ మధ్యప్రదేశ్ సీఎంగా ఉన్న సమయంలో ఎన్నో కుంభకోణాలకు తెరలేపారని అన్నారు. ఈయన సంబంధీకుల ఇళ్లపై జరిగిన దాడుల్లో భారీగా డబ్బు దొరికిందని చెప్పారు. జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి కేటాయించిన రూ.240 కోట్లను ఖర్చు చేయకుండా తిరిగి కేంద్రానికే పంపించారని ఆరోపించారు. గతంలో కేంద్రంలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీ అగస్టా వెస్ట్‌ల్యాండ్, 2జీ, కామన్‌వెల్త్ గేమ్స్ వంటి పలు స్కాములకు పాల్పడిందని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీకే ఓటేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ ప్రచారకర్తలుగా ఈడీ, సీబీఐ, ఐటీ


కాంగ్రెస్ నేత పవన్ ఖేరా మండిపాటు



న్యూఢిల్లీ: ఈడీ, సీబీఐ, ఐటీ డిపార్ట్‌మెంట్ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు అధికార బీజేపీ ప్రచారకర్తలుగా, ఫ్రంట్‌లైన్ కార్యకర్తలుగా మారిపోయాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. ప్రతిపక్ష నేతలను భయపెట్టి, బీజేపీలో చేర్పించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆ పార్టీ నాయకులు విచ్చలవిడిగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. పవన్ ఖేరా శుక్రవారం మీడియాతో మాట్లాడారు. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకొని దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారని విమర్శించారు. మరోవైపు అవినీతిని అరికట్టాల్సిన ఈడీ అధికారులు లంచాలు తీసుకుంటున్నారని చెప్పారు. రాజస్తాన్‌లో చిట్ ఫండ్ కేసులో ఇద్దరు ఈడీ అధికారులు రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయారని, వారిని సీబీఐ అరెస్టు చేసిందని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈడీ సిబ్బంది రేటు లిస్టును తయారు చేయాలని పవన్ ఖేరా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రధానమంత్రి మోదీకి టూల్‌కిట్‌గా ఉపయోగపడుతున్నాయని దుయ్యబట్టారు. శక్తివంతమైన దర్యాప్తు సంస్థలను బీజేపీ పాలనలో బలహీనంగా మార్చేశారని విమర్శించారు.

మహిళలకు ఏడాదికి రూ.12 వేలు

- వ్యవసాయ కూలీలకు రూ.10 వేలు
- రూ.500కే వంట గ్యాస్ సిలిండర్
- ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో
- విడుదల చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా



రాయ్‌పూర్: మహిళలు, భూమి లేని వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, వరి ధాన్యం క్వింటాలు రూ.3,100 చొప్పున కొనుగోలు వంటి కీలక హామీలను ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రకటించింది. మరో నాలుగు రోజుల్లో రాష్ట్రంలో మొదటి దశ ఎన్నికలు జరగనుండగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం రాయ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో 'మోదీ గ్యారెంటీ ఫర్ ఛత్తీస్‌గఢ్ 2023' పేరిట పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. వచ్చే రెండేళ్లలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం, అయోధ్యలో నిర్మాణం పూర్తికావొస్తున్న రామాలయ సందర్శనకు తీసుకెళ్లడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. మేనిఫెస్టో అంటే కేవలం మేనిఫెస్టోనే కాదు, బీజేపీ దృష్టిలో అది ఒక తీర్మాన పత్రం అని అన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను వివరిస్తూ ఆయన..వచ్చే అయిదేళ్లలో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తయారు చేస్తామని బీజేపీ తరఫున హామీ ఇస్తున్నానన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో క్రిషి ఉన్నత పథకాన్ని అమలు చేస్తామని, ఎకరానికి 21 క్వింటాళ్ల చొప్పున ధాన్యాన్ని రూ.3,100 చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పారు. మహతరి వందన్ పథకం కింద రాష్ట్రంలోని వివాహిత మహిళలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ క్రిషి మజ్దూర్ యోజన అమలు చేసి భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.10 వేల చొప్పున పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

రాజస్తాన్‌లో ఈడీ సోదాలు

జైపూర్: రాజస్తాన్‌లో జల్ జీవన్ మిషన్ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి సుబోధ్ అగర్వాల్ నివాసం సహా 25 ప్రాంతాల్లో శుక్రవారం సోదాలు నిర్వహించింది. పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. రాజధాని జైపూర్‌తోపాటు దౌసాలో ఈ సోదాలు జరిగాయి. మనీ లాండరింగ్‌నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దర్యాప్తు సాగిస్తున్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు. ఇదే కేసులో ఈడీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో రాజస్తాన్‌లో సోదాలు నిర్వహించింది. త్వరలో అసెంబ్లీఎన్నికలు జరుగనున్న రాజస్తాన్‌లో ఈడీ దూకుడు పెంచడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే.

ఏమిటీ కేసు? : పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ నుంచి 'జల్ జీవన్ మిషన్' టెండర్లు దక్కించుకోవడానికి, బిల్లులు పొందడానికి, పనుల్లో అవకతవకలు జరిగినా విచారణ లేకుండా చేసుకోవడానికి శ్రీశ్యామ్ ట్యూబ్‌వెల్ కంపెనీ యజమాని పదమ్‌చంద్ జైన్, శ్రీ గణపతి ట్యూబ్ వెల్ కంపెనీ యజమాని మహేశ్ మిట్టల్‌తోపాటు మరికొందరు రాజస్తాన్ ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు, అధికారులకు పెద్ద ఎత్తున లంచాలు ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై తొలుత సీబీఐ కేసు నమోదు చేసింది. అనంతరం కేసు తీవ్రత దృష్ట్యా ఈడీ రంగ ప్రవేశం చేసింది. మనీ లాండరింగ్ చోటుచేసుకున్నట్లు గుర్తించింది. ఈడీ సోదాలపై సీఎం గెహ్లోత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మలుగా మారాయన్నారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 4 । నవంబర్ । 2023



'విజయ' ఢంకా మోగిస్తా

జూబ్లీహిల్స్ డివిజన్ పద్మాలయ అంబేడ్కర్ నగర్ బస్తీలో ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఢంకా మోగిస్తూ ఆమె చేసిన ప్రచారం బస్తీ వాసులను ఆకట్టుకుంది. 'పేదల బస్తీలను నిలబెట్టిన పీజేఆర్ బిడ్డను నేను.. నాకు ఒకసారి అవకాశమిస్తే మీకు తోడుగా ఉంటా' అంటూ ఆమె ప్రచారం చేశారు. – బంజారాహిల్స్

వాట్సాప్ వార్!

- ఇబ్బడిముబ్బడిగా వాట్సాప్ గ్రూపులు
- ప్రధాన పార్టీల గెలుపోటములపై పోస్టుల వెల్లువ
- ఆరోపణలు, ప్రత్యారోపణలు, వ్యంగ్యాస్త్రాలు
- సగటు ఓటర్లను చికాకు పరుస్తున్న వైనం

నగరంలో ఆన్‌లైన్ ఎన్నికల యుద్ధం

సాక్షి, సిటీబ్యూరో: అదిగదిగో వినిపిస్తోందా యుద్ధ భేరి.. బస్తీల్లో, కాలనీల్లో, రహదారులపై, అపార్ట్‌మెంట్‌లలో హోరెత్తించే ఎన్నికల పోరు సంగతి సరే. జిందాబాద్‌లు, జై కొట్టడాలు, పలకరింపులు, కరచాలనాలు అంతటా కనిపిస్తున్నాయి. ప్రచార రథాలు పరుగులు తీస్తున్నాయి. మైకులు రోడ్డెక్కి కేకలు వేస్తున్నాయి. ఇదంతా కళ్ల ముందు కనిపించే హోరు.. కానీ బరిలోకి దిగిన అభ్యర్థుల గెలుపోటములను డిసైడ్ చేసే అసలు సిసలైన వార్ మాత్రం సోషల్ మీడియాలో నడుస్తోంది. ప్రధాన పార్టీలకు చెందిన అభిమానులు, కార్యకర్తలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, వెటకారాలు, వ్యంగ్యాస్త్రాలతో వాట్సాప్ గ్రూపుల్లో కేక పుట్టిస్తున్నారు. ఎన్నికల కాక రగిలిస్తున్నారు. చినికి చినికి గాలివాన మారినట్లు ఆన్‌లైన్ ఎన్నికల యుద్ధం వ్యక్తిగత వైరుధ్యాలకు, ఈర్ష్యాద్వేషాలకు దారితీస్తోంది. నిజానికి కళ్ల ముందు కనిపించే కఠోరమైన వాస్తవాల కంటే మొబైల్ ఫోన్‌లో దర్శనమిచ్చే అసత్యాలు, అర్ధసత్యాలే జనజీవితాన్ని అమితంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆకట్టుకుంటున్నాయి. తాజా ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు సైతం సగటు ఓటరు బలహీనతను కనిపెట్టి అదే పనిగా సోషల్ మీడియాలో విజృంభిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీలపై కత్తులు దూస్తున్నాయి. వాదనలు, ప్రతివాదనలు, ఘర్షణలు, సంఘర్షణలు సగటు ఓటరు వారిని కట్టిపడేస్తున్నాయి. దీంతో ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు మొబైల్ ఫోన్ మాయా జాలంలో కొట్టుకుపోయే గ్రూపులకు ఎన్నికల వాట్సప్ వార్ ఒక వినోద క్రీడగా మారింది. కొండొకచో అత్యంత చికాకు పుట్టించే ఆటగా కూడా మారింది.

ఏ గ్రూపు చూసినా ఎన్ని'కలహాలే'..

ఎన్నికల నేపథ్యంలో ఇబ్బడిముబ్బడిగా వాట్సాప్ గ్రూపులు పుట్టుకొస్తున్నాయి. కాలనీ సంక్షేమ, అపార్ట్‌మెంట్ సంఘాలు, స్నేహితులు, గృహిణులు, ఉద్యోగులు, వాకర్స్ తదితర వర్గాలకు చెందిన వేలాది గ్రూపుల్లో ఇప్పుడు పొలిటికల్ వార్ నడుస్తోంది. కొద్ది రోజుల క్రితం గుడ్ మార్నింగ్, గుడ్ ఈవినింగ్ వంటి పలకరింపులతో, పండుగల శుభాకాంక్షలతో దర్శనమిచ్చిన వాట్సప్ గ్రూపుల్లో ఇప్పుడు ప్రధాన పార్టీల నాయకుల ప్రసంగాలు, వార్తాకథనాల క్లిప్పింగులు వైరల్‌గా మారుతున్నాయి. వాటికి ప్రత్యర్థులు విమర్శలు, వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. దీంతో ఆయా పార్టీలకు చెందిన వీరాభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. అనేక చోట్ల ఈ పరిణామాలు వ్యక్తిగతమైన దూషణలకు, తిట్ల పురాణాలకు దారితీస్తున్నాయి. నిన్నా మొన్నటి వరకు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్న వాళ్లే ఇప్పుడు వాట్సాప్ వార్‌లో శత్రువుల్లా మారారని కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన ఒక గ్రూప్ అడ్మిన్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన గ్రూపులు ఇప్పుడు శత్రుశిబిరాలుగా మారాయని చెప్పారు.

మొబైల్ 'షాక్'...

'తెల్లవారిందంటే చాలు మొబైల్ ఫోన్ తెరవాలంటే షాక్ కొట్టినట్లవుతుంది. ఎవరు ఎలాంటి పోస్టు పెడతారో తెలియదు. ఊదరగొట్టే ఉపన్యాసాలు, అబద్ధాలు, అసత్యాలను చూడాలంటేనే చిర్రెత్తుకొస్తోంది'అని కుషాయిగూడకు చెందిన ఓ టీచర్ అసహనం వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల నుంచి నిజాయతీని, నిబద్ధతను ఆశించడం అత్యాశే అవుతుంది. కానీ వివిధ వర్గాలుగా ఉండే సాధారణ ప్రజలు ఆయా పార్టీల అబద్ధపు ప్రచారాల్లో కొట్టుకుపోవడం బాధ కలిగిస్తోందని చెప్పారు.



కుల సంఘాల కొట్లాటలు..

కుల సంఘాలు మరో అడుగు ముందుకేసి తమ కులాలకు చెందిన అభ్యర్థుల పక్షాన గట్టిగా కొట్లాటకు దిగుతున్నాయి. ఒకే కులానికి చెందిన వాట్సప్ గ్రూపులలో పార్టీలుగా విడిపోయి పరస్పరం తిట్టుకోవడం గమనార్హం. మరోవైపు అనేక చోట్ల అపార్ట్‌మెంట్ గ్రూపుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని, ఇది ఏ మాత్రం ఆరోగ్యకరమైన పరిణామం కాదని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్నికలు వస్తాయి. పోతాయి. పార్టీలతో సంబంధం లేకుండా కలిసి ఉండాల్సిన కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లు, ప్రత్యర్థి శిబిరాలుగా మారి ఆన్‌లైన్ వార్‌కు దిగడం ఏ మాత్రం సరైంది కాదు' అని ఎలక్షన్స్ వాచ్ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. ఉద్యోగ వర్గాల్లోనూ గుట్టుచప్పుడు కాకుండా ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. 'చిన్ననాటి ఫ్రెండ్స్', 'టెన్త్ క్లాస్ ఫ్రెండ్స్' అంటూ ఒకప్పటి స్నేహాన్ని గుర్తు చేసుకొనేందుకు ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికలు, సొంత ఊరు విశేషాలను తెలుసుకొనేందుకు ఏర్పాటు చేసుకున్న 'మై విలేజ్', 'మా ఊరు' వంటి వాట్సాప్ గ్రూపులు సైతం ఎన్నికల కొట్లాటకు దిగడం గమనార్హం.

9 ఎంఐఎం సై

ఆరు స్థానాల్లో అభ్యర్థిత్వాలు ఖరారు.. మరో మూడు త్వరలో

- ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండిచేయి
- ఒక సిట్టింగ్‌కు స్థాన చలనం
- ఈసారి ఇద్దరు మాజీ మేయర్లకు అవకాశం



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో తొమ్మిది నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు మజ్లిస్ (ఎంఐఎం) పార్టీ ప్రకటించింది. నగరంలోని పాత బస్తీలోని ఏడు సిట్టింగ్ స్థానాలతో పాటు జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ స్థానాల్లో సైతం బరిలో దిగనున్నట్లు వెల్లడించింది. శుక్రవారం దారుస్సలాంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలి జాబితాలో ఆరు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. చాంద్రాయణగుట్ట స్థానానికి అక్బరుద్దీన్ ఒవైసీ, మలక్‌పేట స్థానానికి అహ్మద్ బలాల, కార్వాన్‌కు కౌసర్ మోహియుద్దీన్, నాంపల్లికి మాజీద్ హుస్సేన్, చార్మినార్‌కు జుల్ఫీకర్, యాకుత్‌పురాకు జాఫర్ హుస్సేన్ మేరాజ్ అభ్యర్థిత్వాలను ఖరారు చేశారు. త్వరలో బహదూర్‌పురా, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ అభ్యర్థులను ప్రకటిస్తామని అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు. మజ్లిస్ పోటీ చేయని స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇస్తామన్నారు.

ఉద్దండులకు మొండిచేయి..

రాజకీయ ఉద్దండులు, ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలకు మజ్లిస్ పార్టీ మొండిచేయి చూపించింది. చార్మినార్ సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్, యాకుత్‌పురా సిట్టింగ్ ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీలకు సీటు కేటాయించ లేదు. నాంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అభ్యర్థిత్వం యాకుత్‌పురా స్థానానికి మారింది. ఈసారి కొత్తగా ఇద్దరు మాజీ మేయర్లకు అవకాశం లభించింది. నాంపల్లి సిట్టింగ్ స్థానానికి మాజీ మేయర్ మాజీద్ హుస్సేన్‌కు, చార్మినార్ సిట్టింగ్ స్థానాన్ని జుల్ఫీకర్‌లకు కేటాయించారు. 2018 ఎన్నికల తర్వాత తీసుకున్న నిర్ణయం ప్రకారమే ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలకు ఎన్నికల బరి నుంచి తప్పించి పార్టీలో వారి సేవలు తీసుకోవాలని నిర్ణయించినట్లు పార్టీ అధినేత అసదుద్దీన్ ప్రకటించారు.

కొత్తగా జూబ్లీహిల్‌లో..

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పక్షాన భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ బరిలో దిగుతుండగా.. ఏఐఎంఐఎం కూడా పోటీ చేస్తామని ప్రకటించటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండి.. ఈసారి పోటీ నిర్ణయం వెనుక మతలబు అర్థం కాని పరిస్థితి నెలకొంది. అత్యంత సంపన్న ఉన్న ప్రాంతంగా పేరొందిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మజ్లిస్ గతంలో పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైంది. 2014 ఎన్నికల్లో మజ్లిస్ తరఫున రంగంలో దిగిన నవీన్ యాదవ్ టీడీపీ అభ్యర్థి మాగంటికి ఢీ అంటే ఢీ అనేంతలా పోటీ ఇచ్చారు. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీకి దూరం పాటించి అప్పటి టీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటికి మద్దతు ఇచ్చింది. అయినప్పటికీ నవీన్ యాదవ్ ఇండిపెండెంట్‌గా బరిలో దిగి గట్టి పోటీ ఇచ్చి మూడో స్థానంలో నిలిచారు. ఈసారి తిరిగి మిత్ర పక్షమైన బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానంలో పోటీకి దిగడం ఆసక్తి రేపుతోంది.

ముంతాజ్ ఖాన్ దారెటు?



ఓటమి ఎరగని నేతగా యాకుత్‌పురా నుంచి ఐదుసార్లు, చార్మినార్ నుంచి ఒకసారి వరుసగా విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్ కొట్టిన అనంతరం ముంతాజ్ ఖాన్‌కు టికెట్ దక్కకపోవడంతో ఆయన రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థంగా మారింది. పార్టీ అధిష్టానం ప్రతిపాదన మేరకు రిటైర్మెంట్‌కు సిద్ధమంటూనే తన కొడుకుకు టికెట్ ఇవ్వాలని మెలిక పెట్టినా ఫలితం లేకుండా పోయింది. ఏకంగా టికెట్ ఇవ్వకున్నా బరిలో దిగుతానని అల్టిమేటం ఇవ్వడంతో పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ రంగంలో దిగినట్లు తెలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్, ఎంబీటీలు సంప్రదింపులు చేస్తూ పార్టీ పక్షాన రెండు సీట్ల బంపర్ ఆఫర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. తాజాగా చార్మినార్ అసెంబ్లీ స్థానానికి మాజీ మేయర్ జుల్ఫీకర్ అభ్యర్థిత్వం ఖరారు కావడంతో పార్టీ నిర్ణయం మేరకు మౌనంగా ఉండటమా? లేక బరిలో దిగడమా? ముంతాజ్ ఖాన్ ఎటూ తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయినట్లు తెలుస్తోంది. ఒకవేళ తిరుగుబాటు బావుటా ఎగరవేస్తే మాత్రం పాతబస్తీ రాజకీయాల్లో సంచలన మార్పులు సంభవించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ చార్మినార్ అసెంబ్లీ స్థానంపై దృష్టి సారించింది. ఇంకా అభ్యర్థి ప్రకటించలేదు.

జంపింగ్ జపాంగ్



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి, ఆమె భర్త, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్ గౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం నారాయణగూడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కన్నతల్లి లాంటి పార్టీకి ఓ వ్యక్తి వల్ల రాజీనామా చేయాల్సి వచ్చిందని దంపతులిద్దరూ కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం కార్పొరేటర్ దంపతులు మహాలక్ష్మి, రామన్‌గౌడ్ డివిజన్ నాయకులు, అనుచరులతో కలిసి తెలంగాణ భవన్‌కి వెళ్లి మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఆధ్వర్యంలో కేటీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. – హిమాయత్‌నగర్

మేఘారాణికి మెగా ఆఫర్!



పాతబస్తీలోని చార్మినార్ నియోజకవర్గం నుంచి ఉత్తర భారతానికి చెందిన మహిళా అభ్యర్థి మేఘారాణికి బీజేపీ టికెట్ కేటాయించింది. చార్మినార్‌లోని ఘన్సీబజార్‌లో నివాసం ఉండే ఆమె అడ్వొకేట్‌గా కొనసాగుతూ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. 1967లో మొదటిసారి బీజేఎస్ అభ్యర్థి మేఘ్‌రాజ్ చార్మినార్ నుంచి 10,402 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా.. 1978, 1983లలో సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ విజయం సాధించారు. 1994, 1999లలో అసదుద్దీన్ ఒవైసీ ఇక్కడ గెలిచారు. 2004, 2009, 2014లలో సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, 2018లో ముంతాజ్ అహ్మద్ ఖాన్‌లు విజయం సాధించారు. 56 ఏళ్లుగా చార్మినార్ నుంచి లభించని టికెట్ ఈసారి బీజేపీ ద్వారా ఓ మహిళా అభ్యర్థికి లభించడం విశేషం. –చార్మినార్

మల్లారెడ్డి 'ఫ్యామిలీ ప్యాక్'



మేడ్చల్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి పెద్ద కోడలు శాలిని రెడ్డి

ఎన్నికల ప్రచారంలో మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి సకుటుంబ సమేతంగా నిమగ్నమైంది. మంత్రి సోదరుడు సీఎంఆర్ కళాశాల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కుమారులు మహేందర్‌రెడ్డి, భద్రారెడ్డి, కోడళ్లు ప్రీతిరెడ్డి, శాలినిరెడ్డి, వారి బంధువులు మొత్తం ఎన్నికల రంగంలోకి దిగారు. తెర వెనుక మంత్రి బంధువులు, ఆయన కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీలు రాజకీయ మంత్రాంగం నడుపుతున్నారు. మంత్రి బలగం అనుమతి లేకుండా వారి ఇంటి నుంచి జెండా కర్ర సైతం కదలడం లేదు. కరపత్రం నుంచి కరెన్సీ నోటు దాకా మంత్రి బంధువులు, కుటుంబ సభ్యులే నిర్వహిస్తున్నారు. – మేడ్చల్

అధ్యక్షా.. అనాలనే ఆరాటంతో..



ఎప్పటికైనా అసెంబ్లీలో అడుగు పెట్టి అధ్యక్షా.. అనాలనే కోరికతో పట్టువదలని విక్రమార్కుడిలా ఖైరతాబాద్ బడా గణేష్ ప్రాంతంలో నివసించే వ్యాపారి షాబాద్ రమేష్ ఈ ఎన్నికల్లో కూడా పోటీకి సై అన్నారు. తెలంగాణలోనే మొట్ట మొదటి నామినేషన్ తానే వేయాలని ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు జ్యోతిష్యులను సంప్రదించి శుక్రవారం ఉదయం 11.06 గంటల సమయంలో ఖైరతాబాద్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కేవలం అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రమే పోటీ చేస్తారీయన. 1994 నుంచి ఇప్పటి వరకు 7సార్లు నామినేషన్లు వేశారు. అయిదేళ్ల పాటు ఇంట్లో ఏర్పాటు చేసే గల్లా పెట్టెలో చిల్లర డబ్బులు వేస్తూ నామినేషన్ వేసే రోజున ఆ మొత్తాన్ని లెక్కపెట్టి అందులో నామినేషన్ పత్రాల డాక్యుమెంటేషన్ ఖర్చులు, డిపాజిట్ రూ.10 వేలు చెల్లిస్తారు. భార్య కస్తూరి హారతి ఇచ్చి నామినేషన్‌కు పంపించగా ఆయన ఖైరతాబాద్‌లోని ఆర్‌వోకు నామినేషన్ పత్రాలు అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని నామినేషన్ల అనంతరం తెలిపారు. ఆయన మొదటిసారి నామినేషన్ దాఖలు చేసినప్పుడు ఇద్దరు కొడుకులకు ఓటు హక్కు లేదు. ఇప్పుడు ఆయన ఇద్దరు కొడుకులు అఖిల్, అక్షయ్ ఇద్దరికీ ఓటు హక్కు రావడంతో తన ఓటు బ్యాంకు మరింత పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. 2014లో జరిగిన ఎన్నికల్లో షాబాద్ రమేష్‌కు 387 ఓట్లు రాగా, 2018లో జరిగిన ఎన్నికల్లో 384 ఓట్లు వచ్చాయి. ఎప్పటికైనా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి తీరుతానని పెద్ద గణేష్ సాక్షిగా ఆయన శపథం చేశారు. – బంజారాహిల్స్

19 తొలిరోజు నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో శుక్రవారం తొలిరోజు మొత్తం 19 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో హైదరాబాద్ జిల్లా నుంచి ఏడుగురు, రంగారెడ్డి జిల్లా నుంచి ఆరుగురు, మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లా నుంచి ఆరుగురు తమ నామినేషన్లను సంబంధిత నియోజకవర్గాల్లో దాఖలు చేశారు.

హైదరాబాద్ జిల్లాలో..

హైదరాబాద్ జిల్లా పరిధిలో గోషామహల్ నియోజకవర్గం నుంచి మొగిలి సునీతారావు (కాంగ్రెస్), బీవీ రమేశ్‌బాబు (సోషలిస్ట్ పార్టీ-ఇండియా), మలక్‌పేట నుంచి మహమ్మద్ అక్రమ్ అలీఖాన్ (స్వతంత్ర), అంబర్‌పేట నుంచి ఎ. సుదర్శన్ (శివసేన-యూబీటీ), ఖైరతాబాద్ నుంచి షాబాద్ రమేశ్ (స్వతంత్ర), కూరాకుల జ్యోతి (ఎస్‌యూసీఐ-కమ్యూనిస్ట్), సికింద్రాబాద్ నుంచి కె.రాహుల్ గుప్తా (స్వతంత్ర)లు ఉన్నారు.



శేరిలింగంపల్లి రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్

రంగారెడ్డి జిల్లా పరిధిలో..

శేరిలింగంపల్లి జగదీశ్వర్ గౌడ్ (కాంగ్రెస్), చేవెళ్ల కేఎస్ రత్నం (బీజేపీ), ఇబ్రహీంపట్నం సదానందరెడ్డి (పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ), కల్వకుర్తి బి.రాజు గౌడ్ (స్వతంత్ర), ఎల్బీనగర్ చామకూర రాజయ్య (సోషల్ జస్టిస్ పార్టీ), మంచాల శ్రీకాంత్ ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఒక సెట్టు, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్టు నామినేషన్లు దాఖలు చేశారు.

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ స్థానం నుంచి జిన్న శ్రీధర్‌రెడ్డి (స్వతంత్ర), గౌని ప్రవీణ్ కుమార్ రెడ్డి (స్వతంత్ర), మల్కాజిగిరి జాజుల భాస్కర్ (శ్రమజీవి పార్టీ), కూకట్‌పల్లి చంద్రశేఖర్ చలిక (స్వతంత్ర), ఉప్పల్ చిన్న ధనరాజు (స్వతంత్ర), ఎం.మల్లేశం (తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ)లు నామినేషన్లు దాఖలు చేశారు.



నిఘా నీడలో..

ఒకవైపు నామినేషన్ల హడావుడి. మరోవైపు హోరీహోరీగా ఎన్నికల ప్రచారం. వెరసీ.. నగరంలో రాజకీయాలు హాట్‌హాట్‌గా మారాయి. ఈ క్రమంలో శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. దీంతో ఎల్బీనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు.



చెరగని ముద్ర.. జస్టిస్ గోపాల్‌రావు



సాక్షి, సిటీబ్యూరో: జస్టిస్ గోపాలరావు ఎక్బోటే. స్వాతంత్ర్యసమరయోధుడు. విలక్షణ రాజకీయ నేత. అంతేకాదు. శాసనసభ్యుడిగా, వివిధ శాఖలకు మంత్రిగా అనేక బాధ్యతలు చేపట్టిన ఆయన అప్పటి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా విశేషమైన సేవలు అందజేశారు. 1912 జూన్ 1వ తేదీన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పుట్టి పెరిగిన ఎక్బోటే.. సరస్వతి భవన్ మాధ్యమిక పాఠశాలలో, ఔరంగాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తిచేసుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడయ్యారు. 1952లో జరిగిన హైదరాబాద్ రాష్ట్ర తొలి శాసనసభ ఎన్నికల్లో జస్టిస్ గోపాల్‌రావు ఎక్బోటే కాంగ్రెస్ పార్టీ తరఫున చాదర్‌ఘాట్ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు.

1954 జనవరి 26 నుంచి 1956 అక్టోబరు 31 వరకు అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో ఉన్నారు. 1957లో హైకోర్టు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు.1962 జూన్ 7 నుంచి రెండు సంవత్సరాల పాటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 1964 ఫిబ్రవరి 24న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయన 1972 ఏప్రిల్ 1 నుంచి 1974, జూన్ 1 వరకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందజేసి పదవీ విరమణ చేశారు. గోపాలరావుకు ఉర్దూలో అపారమైన ప్రావీణ్యం ఉండేది. సంవత్సరానికి రెండుసార్లు హైదరాబాద్ జ్ఞాపకాలను సియాసత్ పత్రికలో వ్యాసాలుగా ప్రచురించేవారు. చివరి నిజాం ఉస్మాన్ అలీఖాన్ కవిత్వం ఆయనకు బాగా నచ్చింది. గోపాలరావు హిందీ భాషా ప్రచారంలోనూ, గ్రంథాలయోద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. స్థానిక తెలుగు, మరాఠీ, కన్నడ భాషా గ్రంథాలయాల స్థాపన కోసం ఎంతో కృషి చేశారు.

అవ్వా.. చెయ్యి గుర్తుకే ఓటెయ్యి!



ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓ కాలనీలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి.

ప్రమాణ పత్రం ఇలా చదవాలి



నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభ్యర్థి చేత ప్రమాణం చేయిస్తారు. నామపత్రాన్ని సమర్పించిన వెంటనే ప్రతిజ్ఞా స్వీకార పత్రాన్ని అభ్యర్థికి ఇస్తారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 173 (ఏ) ప్రకారం అభ్యర్థి ప్రమాణ పత్రాన్ని చదవాల్సి ఉంటుంది. ఇలా ప్రతి అభ్యర్థి ప్రమాణ పత్రం చదివి వినిపించాలి. రిటర్నింగ్ అధికారి ఎదుట అభ్యర్థి ప్రమాణం చేసే పత్రం ఇలా ఉంటుంది. '--- అను నేను శాసన సభ సీటు భర్తీ నిమిత్తం అభ్యర్థిగా నామినేట్ అయినందున, దేవుని పేరిట/ సత్యనిష్ఠాపూర్వకంగా, భారత రాజ్యాంగం పట్ల, ఏర్పాటైన చట్ట ప్రకారంగా యథార్థమైన శ్రద్ధానిష్ఠలు కలిగి ఉంటానని, భారత దేశపు సార్వభౌమాధికారాన్ని, అఖండతను నిలబెట్టగలనని ప్రమాణం చేస్తున్నాను'. – నాంపల్లి

జర్నలిజం కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: రచన జర్నలిజం కళాశాల (నారాయణగూడ)లో రెగ్యులర్, కరెస్పాండెన్స్ విధానం ద్వారా జర్నలిజంలో పీజీ, డిప్లొమా సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి ఏదైనా డిగ్రీ, సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9959640797, 040 23261335 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

నామినేషన్..ట్రాఫిక్ డైవర్షన్



నామినేషన్ల హడావుడి నగర వాహనదారులకు శాపమవుతోంది. ట్రాఫిక్ ఇబ్బందులతో జనం అవస్థలు పడుతున్నారు. శుక్రవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద నామినేషన్ల సందర్భంగా పోలీసులో ట్రాఫిక్ డైవర్ట్ చేయడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. – కూకట్‌పల్లి

అన్నా.. నాది చెయ్యి గుర్తు



కూకట్‌పల్లి సెగ్మెంట్ బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్ తన అనుచరులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రోడ్డుగుండా వెళ్తున్న ఓ వాహనదారుడిని ఆపి అతనితో ముచ్చటించి.. తనకే ఓటు వేయాలని అభ్యర్థించారు. – కూకట్‌పల్లి

హారతులిచ్చి స్వాగతం..



కుత్బుల్లాపూర్ సెగ్మెంట్‌లోని నెహ్రూనగర్‌లో ఎమ్మెల్యే వివేకానంద్ శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు ఆయనకు హారతులిచ్చి స్వాగతం పలికారు. – కుత్బుల్లాపూర్

ఓటివ్వు.. బతుకమ్మ



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లోని భవానీనగర్‌లో ప్రచారం చేపట్టిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కృష్ణారావుకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. బతుకమ్మలు అందించి.. ఆటపాటలతో అలరించారు. – కూకట్‌పల్లి

'అట్లూ'ంటది నారాయణరావు తోన!

- దేవాదాయ స్థలం 'చూపించి' రూ.కోటికి పైగా స్వాహా
- నిర్మాత అట్లూరి నారాయణరావుపై 2018లోనూ ఓ కేసు
- బంజారాహిల్స్ వ్యాపారిని మోసం చేసినట్లు ఆరోపణలు
- 2019లోనే నాంపల్లి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) దందా పేరుతో వందల మంది నుంచి రూ.540 కోట్లు వసూలు చేసిన రాధారామ్ ఏజెన్సీస్ కేసులో మూడో నిందితుడిగా ఉన్న తెలుగు సినీ నిర్మాత అట్లూరి నారాయణ రావు వ్యవహారాన్ని హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇతడిపై సీసీఎస్‌లో 2018లోనూ ఓ కేసు నమోదైనట్లు వెలుగులోకి వచ్చింది. బంజారాహిల్స్‌లోని ఆదిత్య హిల్‌టాప్ అపార్ట్‌మెంట్స్‌లో నివసించే అట్లూరి నారాయణ రావు దేవాదాయ శాఖకు చెందిన స్థలాన్ని 'చూపించి' బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి నుంచి రూ.1.65 కోట్లు కాజేశారన్నది ప్రధాన ఆరోపణ. శేరిలింగంపల్లిలోని తారానగర్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖకు 3 ఎకరాల భూమి ఉంది. ఖాళీగా ఉన్న దీనిపై కన్నేసిన నారాయణ రావు ఎవరికైనా అంటగట్టి సొమ్ము చేసుకోవాలని పథకం వేశాడు. ఎస్.రామాచార్యులు అనే వ్యక్తి దీనికి యజమానిగా మార్చాడు. నకిలీ పత్రాలు సృష్టించిన నారాయణ రావు వాటి ఆధారంగా ఖైరతాబాద్‌లో ఎస్‌ఎంహెచ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను నిర్వహించే బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి సయ్యద్ మహమూద్ హుస్సేన్‌ను సంప్రదించాడు. సదరు స్థలానికి సంబంధించి తనకు రామాచార్యులుతో అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ జీపీఏ ఉందని నమ్మించాడు. దీనిపై హుస్సేన్ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో నగదు చెల్లింపునకు సంబంధించిన డిమాండ్ డ్రాఫ్టులు సైతం ఆయన పేరు మీదే ఇవ్వచ్చని ఉచ్చులోకి దింపాడు. ఓ బ్యాంకులో రామాచార్యులు పేరుతో ఖాతా తెరిచిన నారాయణ రావు అందులోనే నారాయణ రావు నుంచి తీసుకున్న డీడీలు డిపాజిట్ చేసుకున్నాడు. మొత్తమ్మీద హుస్సేన్ నుంచి రూ.1,65,12,500 కాజేశాడు. ఓ దశలో హుస్సేన్ తారానగర్‌కు చెందిన సదరు స్థలం అభివృద్ధి చేయడానికి అనువైన అంశాలను పరిశీలించడం మొదలెట్టారు. అప్పుడే అక్కడకు చేరుకున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సదరు స్థలం తమదని చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై నారాయణ రావును సంప్రదించాలని బాధితుడు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫలితం లేదు. దీంతో హుస్సేన్ 2018 ఆగస్టు 13న సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు నారాయణ రావుతో పాటు రామాచార్యుల్ని నిందితులుగా చేర్చారు. దర్యాప్తు నేపథ్యంలోనే ఈ మోసంలో రామాచార్యులు పాత్ర లేదని తేలింది. దీంతో 2019లో నారాయణ రావుపై నాంపల్లి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. ఎఫ్‌ఎంసీజీ కేసులో ఇతడి కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు ఇంకా ఏవైనా కేసులు ఉన్నాయా? అనేది ఆరా తీస్తున్నారు.

6 నుంచి ఓటరు చైతన్య యాత్ర

– నడుం బిగించిన యూఎఫ్‌ఆర్‌ఈడబ్ల్యూఏఎస్



యూ–ఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: ఓటింగ్ శాతం పెంచేందుకు..ఓటర్ల వ్యవహార శైలిలో మార్పు తీసుకొచ్చేందుకు యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (యూ–ఎఫ్ఈఆర్ డబ్ల్యూఏఎస్) నడుం బిగించింది. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు చైతన్య యాత్రలు నిర్వహిస్తుంది. ఈ నెల 6 నుంచి ప్రచార కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు యూ–ఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ జనరల్ సెక్రటరీ బీటీ శ్రీనివాస్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 6 వేలకు పైగా కాలనీ సంక్షేమ సంఘాలున్నాయి. వీటిలో 4 వేలకు పైగా సంఘాలు యూ–ఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్‌లో నమోదయ్యాయి. ఈ సంఘాలలో మొత్తం 40 లక్షల వరకు ఓటర్లున్నారు. గ్రేటర్ పరిధిలోని నియోజకవర్గాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఎజెండాను సైతం రూపొందించారు. ప్రధాన రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను వివరించి, సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తారే వారినే ఎన్నికునేలా చర్చలు జరపనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం యూ–ఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ ప్రతినిధులు మజ్ శివకిరణ్, కేహెచ్‌ఎస్ శర్మ, వీవీరావు, కే రాఘవేంద్రరావు, రమణ బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ నెల 11న కేటీఆర్‌తో సమావేశం కానున్నారు. త్వరలోనే బీజేపీ, కాంగ్రెస్ ప్రతినిధులతోనూ సమావేశం అవుతామని తెలిపారు.

వెనుదిరిగిన బీఎస్పీ అభ్యర్థి



పోలీసులు అనుమతి ఇవ్వకపోవటంతో వెనుదిరిగిన బీఎస్పీ అభ్యర్థి రమేష్

చాదర్‌ఘాట్: ర్యాలీలతో ఆర్భాటంగా నామినేషన్ వేయడానికి వచ్చి మలక్‌పేట నియోజకవర్గం బీఎస్పీ అభ్యర్థి ఎ.రమేష్ సమయం దాటి పోవటంతో పోలీసులు లోపలికి అనుమతించలేదు. మూడు గంటలలోపు నామినేషన్ హాల్‌లోకి రావాలని నిబంధనలు ఉన్నప్పటికీ సాయంత్రం 3:05 నిముషాలకు రావడంతో పోలీసులు అనుమతించలేదు. దాంతో చేసేది ఏమిలేక తన కార్యకర్తలతో వెనుదిరిగి వెళ్లారు.

జీహెచ్ఎంసీ ఆఫీసులో వ్యయ పరిశీలకులు



సాక్షి, సిటీబ్యూరో: మలక్‌పేట, అంబర్‌పేట నియోజకవర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన లక్ష్మి కాంత దాసప్ప జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ, సువిధ, ఎంసీసీ కంట్రోల్ రూమ్స్‌తో పాటు జీహెచ్ఎంసీలోని కమాండ్‌కంట్రోల్ సెంటర్ తదితరమైన వాటిని పరిశీలించారు. ఎంసీఎంసీ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదులేవైనా వచ్చాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడి రిజిస్టర్‌ను కూడా పరిశీలించారు. ఆయన వెంట ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు. వివిధ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వచ్చిన వారు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ సీనియర్ నేత



బాలప్రకాష్‌ను ఆహ్వానిస్తున్న కేటీఆర్

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ సీనియర్ నేత, గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన బాలప్రకాష్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఆయనకు కుండువా కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ జట్టుకు రెండో విజయం



సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) వరుసగా రెండో విజయం నమోదు చేసింది. శుక్రవారం అజీజ్‌నగర్‌లోని దక్కన్ ఏరీనాలో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 4–1 గోల్స్ తేడాతో ఇంటర్ కాశీ ఎఫ్‌సీ జట్టుపై గెలిచింది. శ్రీనిధి డెక్కన్ జట్టు తరఫున రోసెన్‌బర్గ్ గాబ్రియేల్ (38వ ని.లో), పవన్ కుమార్ (56వ ని.లో), లాల్‌నుంతేలువాంగా (77వ ని.లో), లాల్‌బియాక్లినా (85వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఇంటర్ కాశీ జట్టుకు మరియో బార్కో (90+3వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. తొలి లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 4–0తో నెరోకా ఎఫ్‌సీ జట్టుపై గెలిచింది. ఈనెల 7వ తేదీన ఐజ్వాల్ ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి డెక్కన్ జట్టు మూడో లీగ్ మ్యాచ్ ఆడుతుంది. 13 జట్లు పాల్గొంటున్న ఐ–లీగ్‌లో ప్రస్తుతం శ్రీనిధి జట్టు ఆరు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉంది.

పార్టీ గెలుపునకు కృషి చేయండి

ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి మన్నెగూడలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, గెలుపును ఆపడం ఎవరితరం కాదని అన్నారు. టికెట్ రాని వారు అసంతృప్తికి లోనుకావద్దని, పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.

చదువుతోపాటు నైపుణ్యం పెంచుకోవాలి



కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ అశోక్ తదితరులు

రాయదుర్గం: యువత, కొత్తగా ఉద్యోగాల్లో చేరేవారు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోవాలని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌తో కలిసి 'లెవల్–04–సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్' పేరిట శుక్రవారం నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మార్గదర్శకత్వంలో భారత నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ(ఎంఎస్‌డీఈ)పీఎంకేవివై 4.0 కింద స్పాన్సర్ చేసిన ఫ్లాగ్‌షిప్‌తో ఈ శిక్షణ సాధ్యమైందన్నారు. విద్య, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఎస్కీ, మల్లారెడ్డి కళాశాల సంయుక్తంగా కృషి చేస్తున్నాయన్నారు. పీఎంకేవివై 4.0 ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్ రంగంలో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు, విజ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. మల్లారెడ్డి కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, ఎంఆర్‌ఈసీ హెడ్ డాక్టర్ వి.నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మదీనాగూడలో పాయల్ రాజ్‌పుత్ సందడి



జోస్ అలుక్కాస్ నూతన షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి పాయల్ రాజ్‌పుత్ తదితరులు

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడలో సినీనటి పాయల్ రాజ్‌పుత్ శుక్రవారం సందడి చేసింది. హైదరాబాద్‌లో జోస్ అలుక్కాస్ 4వ నూతన షోరూంను ఆమె సంస్థ ఎండీలు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కాలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోస్ అలుక్కాస్‌లో ఆభరణాలన్నీ నాణ్యతో కూడి అందంగా ఉన్నాయన్నారు. శుభమాంగళ్యం బ్రైడల్ కలెక్షన్స్, ఫెస్టివల్ ఎడిషన్, పరంపర కలెక్షన్స్, ఐవీ కలెక్షన్స్ లాంటివి జోస్ ఆలుక్కాస్ ప్రత్యేక బ్రాండ్స్ అని నిర్వాహకులు పేర్కొన్నారు.

5న బీసీ మేధోమథన సదస్సు



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

కవాడిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు రెండు, మూడు శాతం ఉన్న సామాజిక వర్గాలకు టికెట్లు ఇచ్చి 60శాతం ఉన్న బీసీలను విస్మరిస్తున్నారని జెండా మోసిన వారికి టికెట్లు ఇవ్వకుండా జెండాను తాకట్టు పెట్టిన వారినే అందలం ఎక్కిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల రాజకీయ విధి విధానాలపై అధ్యయనం చేసి, భవిష్యత్తు రాజకీయ కార్యాచరణ పై చర్చించేందుకు ఈ నెల 5న అశోక హోటల్‌లో బీసీల రాజకీయ మేధోమథన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో బీసీల రాజకీయ జెండా, ఎజెండా ప్రకటిస్తామన్నారు. ప్రజా సేవకులను కాకుండా, భూకబ్జాదారులకు, మద్యం వ్యాపారులకు టికెట్లు ఇస్తూ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రధాన రాజకీయ పార్టీలకు కనీస సిద్ధాంతాలే లేవని, అందుకే పార్టీ ఫిరాయించిన వారికి, కండువాలు మార్చిన వారికి, రాత్రికి రాత్రే టికెట్లు ఇచ్చి బడుగు బలహీన వర్గాల వారికి అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 5 జరిగే సదస్సుకు 33 జిల్లాల నుంచి బీసీ శ్రేణులు, మేధావులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకల శ్యామ్ కురుమ, గొడుగు మహేష్ యాదవ్, గూడూరు భాస్కర్ మెరు, జాజుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కల్తీ కల్లు విక్రయం?

- నార్కోటిక్ బ్యూరో ప్రత్యేక దృష్టి
- సీపీ ఆదేశాల మేరకు 68 కాంపౌండ్లపై దాడి
- శాంపిల్స్‌ను పరీక్షలకు పంపిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను లోబర్చుకోవడానికి, వారికి ప్రలోభాలుగా వినియోగించే ప్రతి అంశం పైనా సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి పెట్టారు. నగదు, మద్యంతో పాటు కల్లు వినియోగమూ ఈ కోణంలో ఎక్కువ ఉంటుందని పోలీసులు తేల్చారు. సందట్లో సడేమియా అన్నట్లు కెమికల్స్ కలిపిన కల్తీ కల్లు సైతం పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నగరంలోని కల్లు కాంపౌండ్లలో కల్లు పేరుతో జరిగే కెమికల్స్ విక్రయానికి చెక్ చెప్పాలని కొత్వాల్ సందీప్ శాండిల్య నిర్ణయించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక శాంతిభద్రతల విభాగం అధికారులు, తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీఎస్ నాబ్) బృందాలు రంగంలోకి దిగాయి. గురువారం రాత్రి ఏకకాలంలో నగరంలోని 68 కల్లు కాంపౌండ్లపై ఈ అధికారులు దాడులు చేశారు. ఆల్ప్రాజోలంతో పాటు నిమ్మ ఉప్పు, మిన పిండితో కల్లు తయారీ జరుగుతోందని గుర్తించారు. ఇలా తయారైన కృత్రిమ కల్లు విక్రయిస్తున్నారని అనుమానిస్తున్నారు. దీంతో కొన్ని కల్లు కాంపౌండ్లపై కేసులు నమోదు చేసిన అధికారులు అన్నింటి నుంచి నమూనాలు సేకరించి, పంచనామా నిర్వహించారు. ఈ శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ లాబ్‌కు పంపిన టీఎస్ నాబ్ అధికారులు ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. అవి అందుకున్న తర్వాత వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు.

ఖైరతాబాద్‌లో కమలం కకావికలం!

బంజారాహిల్స్: క్రమశిక్షణ, సిద్ధాంతాలకు మారుపేరుగా నిలిచే బీజేపీలో ఒక్కొక్కరుగా ఆ పార్టీని విడిచి వెళ్తుండటంతో ఖైరతాబాద్‌లో కమలం కకావికలం అవుతున్నది. ఇప్పటికే బీజేపీ నుంచి గెలిచిన జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ బీఆర్ఎస్‌లో చేరగా తాజాగా హిమాయత్‌నగర్ డివిజన్ నుంచి బీజేపీ కార్పొరేటర్‌గా గెలిచిన మహాలక్ష్మి తన భర్త, సీనియర్ బీజేపీ నేత రామన్‌గౌడ్‌తో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీజేపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రణాళికలు రూపొందించుకున్న పార్టీకి వలసలు తలనొప్పిగా మారాయి. రోజుకొకరు చొప్పున పార్టీని వీడుతుండటంతో ఆ పార్టీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి తలపట్టుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో కేడర్ చేజారుతుండటంతో బీజేపీకి ఎటూ పాలుపోవడం లేదు. రోజురోజుకూ పార్టీ బలహీనం అవుతుండటంతో ఏం చేయాలో తోచని పరిస్థితి నెలకొంది. ఒక వైపు పటిష్టమైన కేడర్‌తో బీఆర్ఎస్ రోజురోజుకు బలం పెంచుకుంటుండగా ఆ పార్టీలోకి బీజేపీ నుంచి బడా నేతలు చేరుతుండటంతో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. మన్నె గోవర్ధన్‌రెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు దానంకు అనుకూలంగా ప్రచారంలో పాల్గొనేందుకు సిద్ధమవుతుండగా మరోవైపు బీజేపీ నేతల చేరికలతో బీఆర్ఎస్ మరింత బలం పుంజుకుంది.

తెలంగాణలో అధికార మార్పిడి తథ్యం



జవహర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న అజహరుద్దీన్

- ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారు
- జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్

వెంగళరావునగర్: రాష్ట్ర ప్రజలంతా మార్పును కోరుకుంటున్నారని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ అజారుద్దీన్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ బస్తీలో శుక్రవారం పాదయాత్ర ద్వారా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాదయాత్రలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... టీఆర్ఎస్ పట్ల ప్రజలు విసుగెత్తి పోయారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కుంభకోణాలే ఉన్నాయని, ప్రజలను మభ్యపెడుతూ కేసీఆర్ పాలన సాగించారని ధ్వజమెత్తారు. అందువల్లనే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని... రాష్ట్రంలో అధికారమార్పిడి తథ్యమని అజహరుద్దీన్ స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు భవానీశంకర్, ఉపేందర్‌రెడ్డి, సులేమాన్, సుల్తాన్ పాల్గొన్నారు.

మద్యం అక్రమ పంపిణీపై నిఘా

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు



రహమత్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ పంపిణీ జరుగకుండా తెలంగాణ ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుందని జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... బ్రాందీ షాపుల నుంచి అక్రమంగా మద్యం తరలించకుండా ఆయా వైన్స్ షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశామని ఆయన పేర్కొన్నారు. పౌరులు వెరిట్ యాప్ ద్వారా మద్యం ఒరిజినలా? కల్తీయా? అన్నది తెలుకోవచ్చన్నారు. ఎన్నికల సందర్భంగా ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఇప్పటికే ఏర్పాటు చేశామని వివరించారు. ఎవరైన మద్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే టోల్ ఫ్రీ నెంబరు: 18004252523కు సమాచారం అందిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొనసాగుతున్న మహా కుంభాభిషేకం పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకంలో భాగంగా మూడో రోజైన శుక్రవారం ఉదయం గోపూజ, అష్టోత్తర కలశస్థాపన, హోమాలు నిర్వహించారు. అనంతరం చండీ హోమం జరిగింది. మధ్యాహ్నం శాంతి కుంభస్థాపనలు, కుంభాభిషేక కలశస్థాపనలు, దేవతా హోమాలు నిర్వహించారు. శబరిమల మాజీ మేల్ శాంతి కృష్ణన్ నంబూద్రిచే భగవతీ సేవ పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం జరిగిన భజన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని ఆలయ చైర్మన్ సి.హెచ్.రామయ్య, ఈవో ఎన్. లావణ్య దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



అజహరుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

రహమత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్మికనగర్ బస్తీ బీఆర్ఎస్ అధ్యక్షుడు షేక్ సాబేర్ నివాసంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ టి.అంజయ్యనగర్ బస్తీ అధ్యక్షుడు ముబిన్, టీడీపీ నేత నాగరాజు, హెచ్ఎఫ్ నగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు ముఖీమ్‌తో పాటు యువకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ దేశంలో, రాష్ట్రంలో తప్పక విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు భవానీశంకర్, నేతలు గ్యార నాగరాజు, జాఫర్ హుస్సేన్, సుల్తాన్, ఇబ్రహీం, ఎక్బాల్, సుందర్, మాలాకీ, మేఘన పద్మ, దస్తగిర్, సయ్యద్, మన్సూర్, తాజొద్దీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి

హిమాయత్‌నగర్: భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 'రాజకీయ, విద్యా, శాస్త్రీయ' అంశాలపై హిమాయత్‌నగర్ మగ్దూం భవన్‌లో శిక్షణ తరగతులు రెండవ రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యురాలు ప్రభావతి మహిళలు, ఆరోగ్యం అనే అంశంపై మాట్లాడుతూ... దేశంలో 2014 నుంచి ప్రసూతి మరణాలు ఏఎంఆర్ లక్షకి 130 ఉంటే 2018 నాటికి 97 శాతం మరణాల రేటు తగ్గిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రసూతి ప్రభుత్వ ఆస్పత్రిలో కేసీఆర్ కిట్‌లు అందరికీ అందుబాటులో లేవన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థని పరిపుష్టత చేయడానికి పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ వర్కర్లను ఏర్పాటు చేయాలని, వారు బీపీ, షుగర్, థైరాయిడ్, రొమ్ము పరీక్షలు 40 సంవత్సరాలు పై బడిన వారికి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేసి హెల్త్ కార్డులు, ఆధార్ కార్డులతో జత చేయాలన్నారు. కల్తీ ఆహార పదార్థాలపై ప్రభుత్వ నియంత్రణ జరగాలని, గర్భిణులు కల్లు, మత్తు పానీయాలు తీసుకోరాదని, మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం నియంత్రించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శిక్షణ తరగతులలో రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మందా సదాలక్ష్మి, ఛాయాదేవి, కరుణశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రభావతి

మొదటి రోజు.. 2 నామినేషన్లు

- నామినేషన్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- అభ్యర్థితో పాటు నలుగురికి అనుమతి
- అడుగడుగునా పోలీసుల నిఘా



ఖైరతాబాద్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న సూసి కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థి కూరాకుల జ్యోతి, స్వతంత్ర అభ్యర్థి షాబాద్ రమేష్

బంజారాహిల్స్: శాసనసభ ఎన్నికల కోసం నామినేషన్ల పర్వం శుక్రవారం ప్రారంభమైంది. మొదటి రోజున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఖైరతాబాద్‌కు చెందిన షాబాద్ రమేష్ స్వతంత్ర అభ్యర్థిగా తొలి నామినేషన్ దాఖలు చేశారు.

- రెడ్‌హిల్స్‌కు చెందిన కూరాకుల జ్యోతి సూసి కమ్యూనిస్ట్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. వీరి నుంచి ఖైరతాబాద్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల ప్రక్రియను పూర్తిగా వీడియోలో నమోదు చేశారు.
- నిఘా నేత్రాల నీడలో నామినేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఖైరతాబాద్‌లోని నామినేషన్ కేంద్రం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సాయుధ బలగాలను మోహరించారు.
- నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఎవరినీ అనుమతించలేదు.

జూబ్లీహిల్స్‌లో నిల్...

- మొదటి రోజున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నామినేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు.
- నియోజకవర్గం నోడల్ అధికారి కట్టా హరిప్రసాద్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద మెరుగైన వసతులను కల్పించారు.

జంగ్ తెలంగాణ 2023

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఖైరతాబాద్ ఆర్వో వెంకటేష్ దోత్రే

బంజారాహిల్స్: ఈ నెల 30న జరిగే ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే, సహాయ రిటర్నింగ్ అధికారులతో కలిసి ఖైరతాబాద్‌లోని ఎన్నికల కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్లు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు, వేళలు, ఎక్కడ వేయాలి తదితర వివరాలతో పాటు కౌంటింగ్ కేంద్రం వివరాలు ఈ నోటీసులో పేర్కొన్నారు. ఖైరతాబాద్, షేక్‌పేట మండల కార్యాలయాలతో పాటు ఏఆర్వో కార్యాలయాలు, నియోజకవర్గంలోని ఆరు వార్డు కార్యాలయాల్లో ఈ నోటీసులు ప్రకటించారు.

బంజారాహిల్స్ రూ. 9.50 లక్షలు పట్టివేత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని గ్రీన్‌బంజారా కాలనీలో నివసించే ఇంటీరియర్ డిజైనర్ కార్తీక్‌రెడ్డి తన తండ్రి కేఎస్ రెడ్డితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం తన వ్యాపారంలో భాగంగా రూ. 9.50 లక్షలు తీసుకొని వెళ్తుండగా రోడ్ నెం. 14లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి చిక్కాడు. ఈ డబ్బుకు సంబంధించి లెక్కా పత్రాలు చూపించినా ఉపయోగం లేకుండా పోయింది. డబ్బులు సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

లిబర్టీ: ఇంజినీరింగ్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మజూర్ హుస్సేన్‌ను దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయనను కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు సమస్యలను రిజిస్ట్రార్‌కు వివరించారు.

విలువలను సంరక్షించుకోవాలి

లిబర్టీ: ఆధునిక సమాజంలో మానవ విలువలు తగ్గిపోతున్నాయని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో నైతిక, మానవ విలువలు పెంపొందించేందుకు విద్యార్థులకు పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టి బోధించాలని ప్రభుత్వానికి సూచించారు. లిబర్టీ వద్ద ఉన్న లిబర్టీ ప్లాజాలో మాతృదేవోభవ సంస్థలు ఏర్పాటు చేసిన 62వ సత్‌సంగ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంచిని పెంచి మానవ విలువలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. సామాజిక సేవలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వాసుదేవరావు, అరుణరెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ హాస్టల్స్ భోజనశాల మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ హాస్టల్స్ భోజనశాలను మూసివేశారు. దసరా సందర్భంగా సెలవులు ప్రకటించిన అధికారులు తిరిగి ప్రారంభించేందుకు నిరాకరిస్తున్నారు. భోజన బకాయిలు చెల్లిస్తేనే పునః ప్రారంభిస్తామని చెప్పడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లో మెస్ బకాయిలు కట్ చేసుకోవాలని విద్యార్థులు చూచించినా అధికారులు ఒప్పుకోలేదు భోజన వసతి లేనందున పరిశోధన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

ముషీరాబాద్: సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులో వంద రోజుల శిక్షణ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎస్ఆర్‌డి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బెసిక్స్ ఆఫ్ అకౌంటింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, డిజిటల్ లిట్రసీ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కంప్యూటర్ టైపింగ్ తదితర శిక్షణను ప్రతి రోజు ఉ.10 గం నుంచి మ. 2 గం వరకు, మ. 2.30 గంనుంచి 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు రాంనగర్‌లోని వేపూర్ బాలయ్య భవన్‌లోని ఎస్ఆర్‌డీ స్కిల్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికకు స్పందన



సమస్యలు విన్నవిస్తున్న వినియోగదారులు

బంజారాహిల్స్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ఏడీఈ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈ వేదికలకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు వినతి పత్రాలు సమర్పించారు. బంజారాహిల్స్, ఫిలింనగర్ సబ్ స్టేషన్ల పరిధిలో వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదులు, సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని బంజారాహిల్స్ ఏడీఈ రామిశెట్టి హైమానంద వెల్లడించారు.

వెరిట్ యాప్‌తో అక్రమ మద్యానికి చెక్

హిమాయత్‌నగర్: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అక్రమ మద్యంను అరికట్టేందుకు రూపొందించిన వెరిట్ యాప్‌ను ప్రజలు వినియోగించాలని నారాయణగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.గీత తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... నిబంధనలు పాటించకుండా అక్రమంగా మద్యం విక్రయించిన వారిని గుర్తించడంతో పాటు మద్యం సీసాలు రాష్ట్రానికి చెందినవా కాదా అనే విషయం ఈ యాప్ ద్వారా స్పష్టం అవుతుందన్నారు. యాప్ ఆధారంగా మద్యం సీసాపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఏ ప్రాంతానికి చెందినదో తెలుస్తుందన్నారు. తయారీ కోడ్, తేదీ, డిపో లొకేషన్, అమ్మకం జరిగిన ప్రాంతం, ధర తదితర వివరాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. అక్రమ గోదాములు, అక్రమ మద్యం నిల్వలపై మరింత నిఘా పెంచామని, ఎవరికైనా అనుమానం వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 2523కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కానిస్టేబుల్ సెల్‌ఫోన్ స్నాచింగ్

వెంగళరావునగర్: బస్సు దిగి డ్రైవర్ కోసం ఎదురు చూస్తున్న ఏపీ పోలీస్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను దుండగులు లాక్కెళ్లిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆర్.చక్రధౌర ఆంధ్రప్రదేశ్ మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను ఏపీ డీజీపీ సునీల్‌కుమార్ దగ్గర ఎంసీడీ ఆర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత నెల 3న డీజీపీ సునీల్‌కుమార్‌కు చెందిన లగేజ్‌ను తీసుకుని అదేరోజు అర్ధరాత్రి విజయవాడ నుంచి హైదరాబాద్ రావడానికి బస్సు ఎక్కాడు. ఒకటో తేదీనాడు తెల్లవారు జామున దాదాపు 4.30 గంటల సమయంలో అమీర్‌పేట మైత్రీవనం వద్ద బస్సు దిగాడు. డీజీపీ డ్రైవర్ కోసం ఫోన్ చేసి అతను వచ్చే వరకు మైత్రీవనం వద్దనే ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో దాదాపు 5 గంటల సమయంలో గుర్తు తెలియని ఇరువురు యువకులు హోండా యాక్టివా బైక్‌పై వచ్చి అతని చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని ఎస్ఆర్‌నగర్ వైపు వెళ్లిపోయారు. వారి కోసం గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దాంతో కానిస్టేబుల్ చక్రధౌర మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీకల్లు తయారు చేస్తున్న 'కంపౌండ్'పై దాడి

పోలీసుల అదుపులో ఓనర్, మేనేజర్

వెంగళరావునగర్: కల్తీ కల్లు విక్రయిస్తున్న కల్లు కంపౌండ్‌పై మధురానగర్ పోలీసులు దాడి చేసి నిర్వాహకుడితోపాటు మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ బస్తీ సమీపంలో ఉన్న కల్లు కంపౌండ్‌లో కల్లును కల్తీ చేస్తున్నారని మధురానగర్ పోలీసులకు గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం అందించారు. దాంతో పోలీసులు కల్లు కంపౌండ్‌పై దాడులు నిర్వహించి సోదాలు చేశారు. కల్లు కంపౌండ్ నిర్వాహకుడు అశోక్ గౌడ్, మేనేజర్ యాదయ్యగౌడ్‌ను అదుపులోనికి తీసుకుని ప్రశ్నించగా కల్లును తాము తయారు చేస్తున్నట్టుగా అంగీకరించారు. కల్లును తయారు చేయడానికి ఉపయోగించే సోడియం కార్బొనేట్ 50 కిలోల బ్యాగ్, గుర్తు తెలియని తెల్లని పౌడర్ 25 కిలోల బ్యాగ్, సక్రీన్ 5 కిలోల బ్యాగ్, ఖట్టా 5 కిలోల బ్యాగ్, పంచదార 50 కిలోల బ్యాగులు 13, ఈతకల్లు 200 లీటర్లు, తాటికల్లు 200 లీటర్లు, తయారు చేసిన కల్లు 50 లీటర్లు, ప్లాస్టిక్ బ్యాగ్‌లు 200 లను స్వాధీనం చేసుకున్నారు. కల్లు తయారు చేయడానికి వినియోగించే పదార్థాలను ల్యాబ్‌కు పంపుతున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు



మంజూర్

ఫిలింనగర్: మద్యం మత్తులో న్యూసెన్స్‌కు పాల్పడుతున్న నిందితుడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ పద్మ తీర్పునిచ్చారు. షేక్‌పేట సూర్యానగర్ కాలనీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న మంజూర్(24) కొంత కాలంగా మద్యం సేవించి న్యూసెన్స్‌కు పాల్పడుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదు అందుకున్న ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై పెట్టి కేసు నమోదు చేసి శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

కాంగ్రెస్ వైపు ప్రజల అడుగులు: విజయారెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న విజయారెడ్డి

బంజారాహిల్స్: ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడేందుకు ఒక్కొక్కరుగా ప్రతి ఒక్కరూ ముందుకు వస్తున్నారని కాంగ్రెస్ ఖైరతాబాద్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం .12లోని ఎస్టీటీ నగర్ కాంగ్రెస్ నేత సత్యనారాయణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఆమె కండువాలు వేసి ఆహ్వానించారు. తాము నిర్వహిస్తున్న ప్రచారంలో చాలా మంది బస్తీ, కాలనీవాసులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు ఇస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా 150 మంది వరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దానంకు మద్దతుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న ఉద్యమకారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉద్యమకారులు, సీనియర్ బీఆర్ఎస్ నేతలు రాంచందర్, నర్సింహా, విజయ్ కుమార్, సారంగపాణి, జగన్, ఉమ తదితరుల ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో ప్రచారం నిర్వహించారు.

అభివృద్ధి కార్యక్రమాలే గెలిపిస్తాయి: మాగంటి

వెంగళరావునగర్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి తమను మరోసారి అధికారంలోకి తీసుకువస్తాయని జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ తెలియజేశారు. వెంగళరావునగర్, సిద్ధార్థనగర్‌కాలనీల్లో శుక్రవారం ఆయన పాదయాత్ర చేశారు. అనంతరం మహమూద్ ఫంక్షన్ హాల్‌లో సీనియర్ బీఆర్ఎస్ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాగంటి మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్పొరేటర్లు రాజ్‌కుమార్, సి.ఎన్.రెడ్డి, దేదీప్య విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



బంజారాహిల్స్: బీఆర్ఎస్‌లో వరుస చేరికలు ఆ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నాయి. ఖైరతాబాద్ డివిజన్ ఎంఎస్ మక్తాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు మహ్మద్ ఇంతియాజ్, ఇర్షాద్ పాషా, సాబేర్, ఫయాజ్, అజహర్, మహ్మద్ అలీ, రిజ్వాన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు బీఆర్ఎస్‌లో చేరగా వీరందరికీ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ గులాబీ కండువాలు కప్పారు. ఇప్పటికే ఎంఎస్ మక్తాలో ముస్లింలంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారని వీరి చేరికతో పార్టీ మరింత బలోపేతం అయిందని నాగేందర్ అన్నారు.

దీపక్‌రెడ్డికి పలువురి అభినందన



దీపక్‌రెడ్డిని అభినందిస్తున్న బోరబండ బీజేపీ నాయకులు

రహమత్‌నగర్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జూబ్లీహిల్స్ నియోజకవర్గ టికెట్ దక్కించుకున్న లంకల దీపక్‌రెడ్డిని ఆ పార్టీ బోరబండ డివిజన్ నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ... జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం కోసం ప్రతి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, గణేష్‌గౌడ్, నేతలు చరణ్‌రెడ్డి, కుమార్ నాయక్, కృష్ణ, లక్ష్మణ్, సతీష్‌చారి, షర్మిల, మన్మథ, భాస్కర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌తో విష్ణు భేటీ



కేటీఆర్‌ను కలిసిన విష్ణు, సురేందర్‌యాదవ్

వెంగళరావునగర్: రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, యూసుఫ్‌గూడ సీనియర్ నాయకులు సురేందర్ యాదవ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఎంతో అభివద్ధి జరిగిందని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి శక్తివంచనా లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

సెయింట్ మేరీస్‌లో యుఫోరియా ఫెస్ట్



నృత్యం చేస్తున్న యువతి

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్ కళాశాలలో శుక్రవారం యుఫోరియా పేరుతో ప్రత్యేక ఫెస్ట్‌ను నిర్వహించారు. కళాశాలకు చెందిన యువతీయువకులు ఉల్లాసంగా ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఫెస్ట్‌లో మార్కెటింగ్, బిజ్‌క్విజ్, వైర్‌లాంగ్స్, లేమ్ టూ ఫేమ్, వెర్బస్ క్రూసిస్, ఆజా నాచ్లే, పైరేట్స్ బౌంటీ హంట్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు.

రేపు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

కాచిగూడ: నారాయణగూడలోని బాలానందం వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం బాలబాలికలకు ఫ్యాన్సీడ్రెస్, నీతి పద్యాలు, భక్తి గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బాలానందం కార్యాలయ కార్యదర్శి లావణ్య తెలిపారు. ఉదయం 11 చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్, నీతి పద్యాలు పోటీలు, మధ్యాహ్నం 1:30 గంటలకు సబ్‌జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో భక్తి గీతాలు, నీతి పద్యాల పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు ఫోన్: 040-27561443.

క్లుప్తంగా...

6+6 సెక్యూరిటీ ఇవ్వండి: రేవంత్‌రెడ్డి

- డీజీపీ, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు లేఖ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న అంచనాల నేపథ్యంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీకి చెందిన అనుచరులు తనకు భౌతికంగా హాని కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని, తన మీటింగ్‌లకు ఆటంకం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా తనకు వెంటనే 6+6 సెక్యూరిటీ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర డీజీపీతో పాటు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు రేవంత్ లేఖలు రాశారు. తనకు తగిన భద్రత కల్పించాలని హైకోర్టు చెప్పిన తర్వాత కూడా 2+2 సెక్యూరిటీని తొలగించారని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రానున్న ఎన్నికల్లో తనవంతు ప్రచారాన్ని ప్రశాంతంగా నిర్వహించేందు కు భద్రతను పునరుద్ధరించాలని విన్నవించారు. లేదంటే కోర్టు ధిక్కార పిటిషన్ వేస్తానని కూడా రేవంత్ ఆ లేఖల్లో వెల్లడించారు.

కాంగ్రెస్‌లో ఎవరైనా ముఖ్యమంత్రి కావచ్చు

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ: కాంగ్రెస్ పార్టీలో ఎవరైనా ముఖ్యమంత్రి కావచ్చని, అది ప్రజాస్వామ్యపార్టీ అని, బీఆర్ఎస్‌లో మాత్రం వారి కుటుంబసభ్యులు మాత్రమే ముఖ్యమంత్రులవుతారని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కనీసం ఒక్క ఎమ్మెల్యే మద్దతు కూడా లేని కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం అయ్యారని గుర్తు చేశారు. తెలంగాణలో ముఖ్యమైన మంత్రి పదవులన్నీ కేసీఆర్ కుటుంబసభ్యులకే ఉన్నాయన్నారు. ధరణిని అమలు చేసే రెవెన్యూ, నీటి ప్రాజెక్టులకు సంబంధించిన శాఖతోపాటు లక్షల కోట్లు దోపిడీ చేసేందుకు ముఖ్యమైన మంత్రి పదవులను వారి వద్ద ఉంచుకున్నారని ఆరోపించారు. మేడిగడ్డ ప్రాజెక్టును నాణ్యంగా కట్టలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దానిపై విచారణ చేయిస్తామన్నారు. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ కూడా ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన తప్పిదాలను ఒప్పుకుంటుంటే, బీఆర్ఎస్ మాత్రం అబద్ధాలు చెబుతోందని విమర్శించారు.

అవకాశం ఇవ్వని పార్టీలను బొంద పెట్టాలి: ఇందిరాశోభన్



సాక్షి, హైదరాబాద్: బహుజనుల ఆశయ సాధన కోసం 'బహుజన కాంగ్రెస్ పార్టీ'తో మీ ముందుకు వస్తున్నానని ఆ పార్టీ అధ్యక్షురాలు ఇందిరాశోభన్ తెలిపారు. బహుజనులు తమ ఆశయ సాధన కోసం ప్రణాళికను రచించుకోవాల్సిన అవసరం వచ్చిందని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మన తలరాతలు మారాలంటే మనమే ఒక రాజకీయ వేదికగా మారాలని, మనకు అవకాశం కల్పించని పార్టీలను బొంద పెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. బహుజన కాంగ్రెస్ పార్టీ వేదికగా మార్పుకోసం తనతో కలిసి అడుగు వేస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రెస్‌మీట్ చూసిన తర్వాత రాజకీయాలు ఎంతగా దిగజారాయో అర్థమైందన్నారు. 'కాంగ్రెస్ పార్టీలో ఉన్న నేను తెలంగాణ బహుజనుల ఆశయ సాధన కోసం మహిళా నాయకత్వాన్ని బలపరిచేందుకు నా రాజకీయ భవిష్యత్‌ను తాకట్టు పెట్టాను'అని ఇందిరాశోభన్ ఆవేదన వ్యక్తంచేశారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమించాలి: జాజుల



నాగోలు: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలకు అన్ని రాజకీయ పార్టీలు పార్టీ పదవుల్లో, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలను కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి నాగోలు శుభం కన్వెన్షన్‌లో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాజన సింహగర్జన సభ నిర్వహించారు. జాజుల మాట్లాడుతూ పంచ వృత్తులను ప్రభుత్వం గుర్తించి వారికి చేయూతనందించాలని కోరారు. బీసీల రాజ్యాధికారమే లక్ష్యంగా అందరూ ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల విశ్వకర్మలను, బీసీలను మోసం చేస్తోందని ఆరోపించారు. పెట్రోల్ పోసుకున్న హరీశ్‌రావుకు అగ్గిపెట్టె దొరకలేదు.. కానీ అతను రెచ్చగొట్టడం వల్ల బంగారం లాంటి శ్రీకాంతాచారి బలిదానం చేశాడని ఆవేదన వ్యక్తంచేశారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతిచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతోజు బ్రహ్మచారి, కొలే జగన్నాథ చారి మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వకర్మ ఫెడరేషన్ ఏర్పాటు చేసి, పాలకమండలిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పులిగిల్ల రంగాచారి, తూర్కు నరసింహ, లించారి, వీరభద్రం పాల్గొన్నారు.

కేసీఆర్ ఓటమి ఖాయమైంది

- బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒకవైపు.. మేం, టీజేఎస్, ప్రజాసంఘాలు మరోవైపు
- ఏ కూటమి కావాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారు
- తెలంగాణలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి లేవు
- కేసీఆర్ నియంత.. క్రిమినల్ పొలిటీషియన్
- ఆయన పాపాలపుట్ట పగిలినందుకే మేడిగడ్డ కుంగింది
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అక్కడికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి
- కమ్యూనిస్టులతో పొత్తుల అంశం ఇంకా ముగియలేదు
- అవును నేను పప్పునే.. కందిపప్పును.. కానీ కేటీఆర్ మాత్రం గన్నేరు పప్పు
- హైదరాబాద్ అభివృద్ధికి మా దగ్గర మెగా మాస్టర్ ప్లాన్ ఉంది
- పదేళ్ల పాలన, విజన్‌పై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కూడా రావాలని సవాల్
- 'మీట్ ది ప్రెస్'లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి వంటివన్నీ ఒక్క వ్యక్తి ఉక్కుపాదం కింద నలిగిపోతున్నాయని.. ఈసారి కేసీఆర్ కుటుంబాన్ని ఓడించాలన్నదే ప్రజల నిర్ణయమని టీపీసీసీ చీఫ్, ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యమం చేశారనే గుడ్‌విల్‌తో 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చారని.. చంద్రబాబుతో కాంగ్రెస్ పొత్తును రాజకీయ ప్రయోజనానికి, సెంటిమెంట్‌కు వాడుకుని 2018లో గట్టెక్కారని చెప్పారు. కానీ ఈ పదేళ్లలో కేసీఆర్ గుడ్‌విల్ జీరో అయిందన్నారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొని సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిన విషయాన్ని ప్రజలు గమనంలోకి తెచ్చుకుని, కాంగ్రెస్‌ను గెలిపించేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అనే అపోహలు పటాపంచలు అయ్యాయన్నారు. ఓవైపు కేసీఆర్ కూటమిలో బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ఉంటే.. మరోవైపు తమ కూటమిలో కాంగ్రెస్‌తోపాటు టీజేఎస్, ప్రజా సంఘాలు, కలిసివస్తే లెఫ్ట్ పార్టీలు ఉన్నాయని తెలిపారు. ఏ కూటమి కావాలో ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని అన్నారు. శుక్రవారం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

''నా 20ఏళ్ల అనుభవంతో చెప్తున్నా. ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ఈసారి తప్పకుండా ఓడిస్తారు. తెలంగాణలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి వంటివన్నీ ఒక్క వ్యక్తి ఉక్కుపాదం కింద నలిగిపోతున్నాయి. తెలంగాణను టీజీ నుంచి టీఎస్‌గా మార్చడంలో, తెలంగాణ అధికారిక చిహ్నంలో కేసీఆర్ రాచరిక పోకడలు కనిపిస్తున్నాయి. త్యాగాల గుర్తుగా ఉండాల్సిన తెలంగాణ చిహ్నం రాచరికానికి దర్పణంగా నిలుస్తోంది. గెలిచినోడు రాజు, ఓడినోడు బానిస అనేది కేసీఆర్ పోకడ. ప్రభుత్వాన్ని చూసి ప్రజలు భయపడి బతికే రోజులు వచ్చాయి. ఇది తెలంగాణకు మంచిది కాదు. కేసీఆర్ నియంత ముసుగులో ఉన్న క్రిమినల్ పొలిటీషియన్. ఈ పదేళ్లలో మొత్తం రూ.22.71లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. అవన్నీ ఎవరి జేబుల్లోకి పోయాయి? తెలంగాణ ప్రజల భవిష్యత్తు, బంగారు తెలంగాణ ఏమయ్యాయి? కేసీఆర్ పాలనలో తెలంగాణ సమాజంలోని ప్రతి ఒక్కరూ పరోక్షంగా, ప్రత్యక్షంగా బాధితులే.

అందుకే మేడిగడ్డ కుంగింది

కేసీఆర్ పాపాల పుట్ట పగిలినందుకే మేడిగడ్డ కుంగింది. మేడిగడ్డ కుంగిందో లేదో, నాణ్యతా లోపం ఉందో లేదో తెలుసుకునేందుకు ప్రభుత్వం అక్కడికి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి. మీడియాను, ఇంజనీర్లను కూడా తీసుకెళ్లాలి. కేసీఆర్ అంటే టీఆర్ఎస్ వాళ్లకు కాల్వలు, చెరువులు, రిజర్వాయర్లలా అనిపిస్తే మాకు మాత్రం కాళేశ్వరం కరప్షన్ రావు అనిపిస్తోంది. మేం 2014 ఎన్నికల మేనిఫెస్టోలోనే రైతు బంధు ఇస్తామని చెప్పాం. అధికారంలోకి వచ్చి ఉంటే అమలు చేసేవాళ్లం. దాంతో కేసీఆర్ వచ్చి తానే రైతుబంధును సృష్టించినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారు.

కేటీఆర్.. గన్నేరు పప్పు

తనను పప్పు అంటూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ స్పందించారు. ''అవును నేను పప్పునే. కందిపప్పును. కొడంగల్ ప్రాంతంలో పండే కందిపప్పును. ప్రొటీన్లు ఎక్కువ ఉండి ప్రపంచ ఖ్యాతి ఆర్జించిన కందిపప్పును. కానీ కేటీఆర్ మాత్రం గన్నేరు పప్పు. ఆరోగ్యంగా ఉండాలంటే కందిపప్పు, ముద్దపప్పు తింటారు. కానీ గన్నేరు పప్పు తింటే చస్తారు..''అని రేవంత్ వ్యాఖ్యానించారు.

పాలనపై చర్చిద్దాం వస్తారా?

కాంగ్రెస్ హయాంలోని పదేళ్లలో (1994–2004), బీఆర్ఎస్ హయాంలో (2004–14) ఏం జరిగిందో చర్చించేందుకు మేం సిద్ధం. వచ్చే పదేళ్లలో ఏం చేస్తామో కూడా ప్రజలకు చెబుదాం. కేసీఆర్ చర్చకు రావాలి. లేదంటే హరీశ్, కేటీఆర్‌లలో ఎవరొచ్చినా పర్వాలేదు. బీజేపీ, ఎంఐఎం ప్రతినిధులను కూడా పిలవాలి. ఏ పార్టీ విధానమేంటో? ఏ పార్టీ ఏం చేసిందో? ఆరోగ్యకర వాతావరణంలో చర్చించుకుందాం. నాతోపాటు కాంగ్రెస్ పక్షాన సీఎల్పీ నేత భట్టి వస్తారు.

హైదరాబాద్‌ను వరల్డ్ డెస్టినీగా మారుస్తాం

కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ సంపదను సృష్టిస్తే ఆ ఆదాయాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం మా వద్ద మెగా మాస్టర్ ప్లాన్ ఉంది. ఈ నగరాన్ని వరల్డ్ డెస్టినీగా మారుస్తాం. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రభుత్వంపై రూపాయి భారం పడకుండా మూసీ చుట్టూ అద్భుత ప్రణాళికను పీపీపీ పద్ధతిలో అమలు చేస్తాం. రోడ్లు వేస్తాం. అర్బన్, సబర్బన్, రూరల్ తెలంగాణను మూసీతో కనెక్ట్ చేస్తాం. నదిని ప్రక్షాళన చేస్తాం. ఇరువైపులా రేడియల్ రోడ్లు వేసి నల్లగొండ వరకు డిస్నీవరల్డ్ లాగా, సింగపూర్ అమ్యూజ్‌మెంట్ పార్కుల్లాగా ప్రాజెక్టును అమలు చేస్తాం. హైదరాబాద్‌కు సమీపంలోని రాచకొండ గుట్టల్లో 25–30 వేల ఎకరాల్లో ప్రజల భాగస్వామ్యంతో కొత్త నగరాన్ని సృష్టించే ప్రణాళిక మా వద్ద ఉంది.

లెఫ్ట్‌తో చర్చలు ముగియలేదు

కాంగ్రెస్ పక్షాన వామపక్షాలతో సీఎల్పీ నేత భట్టి, వంశీచంద్‌రెడ్డి చర్చలు జరిపారు. ఇవి ముగిశాయని నేను అనుకోవడం లేదు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీ సహజ మిత్రులు. చర్చల సారాన్ని త్వరలోనే వెల్లడిస్తాం. ధరణిని సమూలంగా మారుస్తాం. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సరికొత్త వెబ్‌సైట్‌ను తీసుకొస్తాం.

సోనియా వల్లే తెలంగాణ సాకారం

ఏపీలో కాంగ్రెస్‌పై రాజకీయ అణుబాంబు పడుతుందని తెలిసినా ధర్మం వైపు నిలబడేందుకే సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నారు. ఆమె ఆ నిర్ణయం తీసుకోకపోతే 100 మంది కేసీఆర్‌లు వచ్చి వెయ్యేళ్లు ఉద్యమించినా తెలంగాణ వచ్చేది కాదు. ప్రాణత్యాగాల గురించి మాత్రమే మాట్లాడితే.. 1,200 మంది అమరుల తర్వాత కేసీఆర్ ప్రాణం 1,201వది అయ్యేది. అంతకన్నా జరిగే నష్టం ఏమీ ఉండేది కాదు. తెలంగాణ ప్రజల డిమాండ్‌కు శాశ్వత పరిష్కారం కోసమే సోనియా తెలంగాణ ఇచ్చారు..''అని రేవంత్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే

- కావాలనే రాహుల్ నాపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు
- ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పునరుద్ఘాటించారు. శుక్రవారం హైదరాబాద్ దారుస్సలాంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఎవరి మద్దతు లేకుండానే అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వస్తామని కలలు కంటున్నారని, సీఎం పదవికోసం ''నువ్వా, నేనా''అని కొట్లాడుతున్నారని విమర్శించారు.

అజహరుద్దీన్‌తో పరిచయం లేదు

భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజహరుద్దీన్‌తో తనకు పరిచయం లేదని అసదుద్దీన్ అన్నారు. షర్మిల ఎందుకు ఎన్నికల్లో పోటీ చేయడం లేదో తెలియదని, అది ఆమె నిర్ణయమన్నారు.

రాహుల్‌పై నిప్పులు

కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీపై అసదుద్దీన్ ఒవైసీ నిప్పులు చెరిగారు. తనపై రాహుల్ కావాలనే అవినీతి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక ఎన్నికలకు ముందు తన ఇంటికి ఎవరిని పంపావో.. ఆ రహస్యం ఏంటో చెప్పమంటావా అంటూ హెచ్చరించారు. రేవంత్ ఓటుకు నోటు కేసుపై రాహుల్ ఎందుకు నోరు మెదపటం లేదో చెప్పాలా? అంటూ ప్రశ్నించారు. బండి సంజయ్ బీసీ కదా.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయనను ఎందుకు తొలగించారని బీజేపీని నిలదీశారు. ఆ పార్టీ బీసీని సీఎం చేస్తామంటే ఎలా నమ్మాలన్నారు. కిషన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా అంబర్ పేట నుంచి పారిపోయారని.. ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇద్దరు సిట్టింగ్‌లను ఓడిస్తాం..

మజ్లిస్ పోటీ చేయని స్థానాల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తామని, పోటీ చేస్తున్న స్థానాల్లో మాత్రం ఓడిస్తామని ఒవైసీ చెప్పారు. మజ్లిస్ గెలవాలి కాబట్టి రాజేంద్రనగర్‌లో ప్రకాశ్‌గౌడ్, జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్‌ని ఓడిస్తామని స్పష్టం చేశారు.

బాబ్రీ మసీదు కూల్చివేతలో కాంగ్రెస్‌దీ పాత్ర

బాబ్రీ మసీదు కూల్చివేతలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఎంత ఉందో కాంగ్రెస్ పార్టీదీ అంతే ఉందని అసదుద్దీన్ ఆరోపించారు. రాజీవ్‌గాంధీ హయాంలోనే మోసం చేసి బాబ్రీ మసీదు తాళాలు తీశారని ఆరోపించారు. రాజీవ్ బాబ్రీ మసీదు కూల్చివేతకు సహకరిస్తే ఇప్పుడు ప్రధాని మోదీ రామమందిరం పనులు పూర్తి చేస్తున్నారన్నారు. జనవరిలో జరిగే రామమందిర ప్రారంభానికి మోదీ.. రాహుల్‌ను కూడా తీసుకెళ్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

అఫిడవిట్లతో జాగ్రత్త

- నామినేషన్లు వేసే అభ్యర్థులకు సీఈఓ సూచనలు
- క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతే అఫిడవిట్లు సమర్పించాలి
- వాటిల్లోని అన్ని కాలమ్స్ తప్పకుండా పూరించాలి
- నామినేషన్ తిరస్కరణకు గురైతే అభ్యర్థిదే బాధ్యత
- ఆదివారం మినహా మిగతా రోజుల్లో నామినేషన్ల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో రాష్ట్రంలో శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. నామినేషన్ల దాఖలులో అభ్యర్థులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, అఫిడవిట్లకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతే సమర్పించాలని స్పష్టం చేశారు. అఫిడవిట్‌లోని అన్ని కాలమ్స్ తప్పకుండా పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. వివరాల సమర్పణలో పొరపాట్లుంటే నామినేషన్ తిరస్కరిస్తామని, అందుకు అభ్యర్థే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. ఆదివారం మినహా మిగతా రోజుల్లో నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని వెల్లడించారు. అభ్యర్థులు గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, కానీ ఒకదానికి మాత్రమే డిపాజిట్ చెల్లుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

13 నియోజకవర్గాల్లో 4 గంటల వరకే పోలింగ్

రాష్ట్రంలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ గంట కుదించడం జరిగిందని సీఈఓ తెలిపారు. సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే జరుగుతుందని, మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని చెప్పారు.

రైతుబంధుపై ప్రతిపాదనలు రాలేదు..

ప్రగతిభవన్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి వివరణ వచ్చిందని, ఆ నివేదికను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించినట్లు వికాస్‌రాజ్ తెలిపారు. రైతుబంధు పథకం కింద లబ్ధిదారులకు సాయం అందజేతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ప్రతిపాదన అందలేదన్నారు. కోడ్ ఉల్లంఘనలపై 137 కేసులు ఫైల్ చేశామని, ఇందులో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించి 13, కాంగ్రెస్ 16, బీజేపీ 5, బీఎస్పీకి సంబంధించి 3 కేసులు ఉన్నాయని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎంపీల భద్రత జిల్లా ఎస్పీలు పర్యవేక్షిస్తారన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం 4 నెలలుగా దాదాపు 22 శాఖలతో సమావేశాలు నిర్వహిస్తోందని, అందులో ఐటీ శాఖ కూడా ఉందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ శాఖలు బాధ్యతతో పనిచేస్తున్నాయని వివరించారు.

తొలిసారిగా పెద్దసంఖ్యలో యువ ఓటర్లు

రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.21 కోట్లకు చేరిందని, ఇందులో పురుషులు 1.609 కోట్లు, మహిళలు 1.608 కోట్లు ఉన్నారని సీఈఓ తెలిపారు. అక్టోబర్ 31వ తేదీ వరకు వచ్చిన ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన నవంబర్ 10వ తేదీలోగా పూర్తి చేస్తామన్నారు. 18–19 సంవత్సరాల మధ్య ఉన్న ఓటర్లు 9.10 లక్షల మంది ఉన్నారని, ఇంత పెద్ద సంఖ్యలో యువ ఓటర్లుండడం ఇదే తొలిసారి అని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,356 పోలింగ్ స్టేషన్లు న్నాయని, ఇందులో పట్టణ ప్రాంతంలో 14,458, గ్రామీణ ప్రాంతాల్లో 20,898 ఉన్నాయన్నారు. ఓటర్లకు ముందస్తుగానే ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులు అందజేస్తామని, ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రూ.453.93 కోట్లు సీజ్

రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.453.93 కోట్లు సీజ్ చేసినట్లు వికాస్‌రాజ్ తెలిపారు. రూ.165.43 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.43.86 కోట్ల విలువైన వాహనాలు, కుక్కర్లు, చీరలు, సెల్‌ఫోన్లు తదితర వస్తువులు సీజ్ చేశామన్నారు. నగదు రవాణాకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా రూపొందించిన నిబంధనలు పాటించాలని సూచించారు. సీజ్ చేసిన ప్రతి రూపాయికి రసీదు ఇవ్వడం జరుగుతుందని, ఆధారాలు చూపితే తిరిగి ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 362 కేసులు నమోదు చేయగా, 256 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. 2,928 బైండోవర్లు ఉన్నాయని, 7,460 ఆయుధాలు డిపాజిట్ చేశామని తెలిపారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు 238 జారీ చేశామని, ఇప్పటివరకు సీ విజిల్‌కు 2,487, 1950 నంబర్‌కు 437 ఫిర్యాదులు వచ్చాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 205 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని వికాస్‌రాజ్ తెలిపారు.



ప్రధానమంత్రి మోదీకి త్రిపురేశ్వరి ఆలయ నమూనాను అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి దంపతులు

రాష్ట్రపతి, ప్రధానితో గవర్నర్ ఇంద్రసేనారెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలతో భేటీ అయ్యారు. ఇటీవల గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గురువారం ఢిల్లీకి వచ్చిన ఇంద్రసేనారెడ్డి సతీసమేతంగా ప్రధాని మోదీని కలిశారు. అనంతరం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతితో భేటీ అయ్యారు. రాష్ట్రంలో త్రిపుర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సత్వర అమలుపై దృష్టి సారించాలని రాష్ట్రపతి ఇంద్రసేనారెడ్డికి సూచించారు. రాష్ట్రపతి, ప్రధానికి త్రిపురేశ్వరి ఆలయ నమూనాను ఇంద్రసేనారెడ్డి అందించారు.

దళితులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంపదను ప్రజలకు పంచుతాం
- షర్మిల కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం సంతోషం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: దళితబంధు రాలేదన్న కారణంతో తన చావుకు సీఎం కేసీఆరే కారణమంటూ లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా బోరోజ్ గ్రామానికి చెందిన రమాకాంత్ మరణానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళిత, గిరిజన కుటుంబాలకు చెందిన వారు ఎవరూ నిరాశ, నిస్పృహలకు గురై ఆత్మహత్యలు చేసుకోవద్దని ఆయన కోరారు. మోసపూరిత ప్రకటనలతో ప్రజలను కలల ప్రపంచంలోకి నెట్టి, వారి చావులకు కారణమవుతున్న బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులతో కలసి ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సమాజం ఏమైపోయినా సరే తాను, తన పార్టీ బాగుండాలనే భావనతో పాలకులు ఉండడం దురదృష్టకరమన్నారు. కేసీఆర్ తాను సీఎం అయ్యేందుకు దళిత ముఖ్యమంత్రి అనే హామీని వాడుకున్నారని, ఆ తర్వాత దళితులకు మూడెకరాల భూమి అని చెప్పారని, ఇప్పుడు దళితబంధు ఇస్తామని ఎన్నికల్లో ఓట్లు వేయించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల జీవితాలతో సీఎం కేసీఆర్ చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే తెలంగాణ ప్రజల కలలను నిజం చేస్తుందని, కాబోయే కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో దళిత, గిరిజనుల అభివృద్ధికే నిధులన్నీ ఖర్చుపెడతామని, సంపదను రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు పంచుతామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న రమాకాంత్ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

వామపక్షాలతో చర్చలు జరుగుతున్నాయి

కాంగ్రెస్, వామపక్షాల పొత్తు గురించి భట్టి మాట్లాడుతూ 'వామపక్షాలతో చర్చలు జరుగుతున్నాయి. జాతీయ స్థాయిలో ఈ అంశం చర్చలో ఉంది. జాతీయ స్థాయి నేతలు తగిన సమయంలో ప్రకటిస్తారు'అని చెప్పారు. వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడం సంతోషంగా ఉందని, ఆమె తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ ఎక్కడ పోటీ చేయాలనేది ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్‌కు అవసరం లేదని, ఆయన ఎంఐఎం అభ్యర్థులు ఎక్కడ పోటీ చేయాలో చూసుకుంటే సరిపోతుందని అన్నారు. రాహుల్ ఎక్కడ పోటీ చేయాలో, తామెక్కడ పోటీ చేయాలో కాంగ్రెస్ పార్టీ సీఈసీ నిర్ణయిస్తుందని భట్టి చెప్పారు.

తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- కాంగ్రెస్ గెలుపును అడ్డుకోకూడదనే ఈ నిర్ణయం
- కేసీఆర్ ఓడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల ప్రకటించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయడం లేదని చెప్పారు. కాంగ్రెస్ గెలుపు అవకాశాలను అడ్డుకోకూడదనే ఈ కీలక నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామన్నారు. కేసీఆర్ ఓడిపోయే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని, అందుకే కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండేందుకే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలనుకున్నామన్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులన్నా, కార్యకర్తలన్నా తనకు అపారమైన గౌరవం ఉందని, ఢిల్లీ వెళ్లి సోనియా, రాహుల్ గాంధీలను కలసినప్పుడు.. తనను వారు కుటుంబ సభ్యురాలిగా చూశారని చెప్పారు. 'నేను పాలేరు నుంచి పోటీ చేద్దామనుకున్నా.. అయితే కాంగ్రెస్ నుంచి పొంగులేటి శీనన్న నిలబడుతున్నారు. నేను పాదయాత్ర చేసినప్పుడు నా పక్కన నడచినవారు పొంగులేటి శీనన్న. వైఎస్సార్ చనిపోయినప్పుడు ఓదార్పు యాత్రలో నాతో నిలబడ్డారు'అని షర్మిల అన్నారు. 'అలాంటి పొంగులేటిని నేను ఎలా ఓడించగలను. గెలుపు గొప్పదే.. కానీ దాని కంటే త్యాగం ఇంకా గొప్పది'అని పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో పోటీ చేయాలన్నది తన కోరిక అంటూ షర్మిల కంటతడిపెట్టుకున్నారు. తెలంగాణ ప్రజల కోసమే పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నామన్న ఆమె.. పార్టీ శ్రేణులందరూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. తాను తప్పు చేస్తే క్షమించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనే విషయాన్ని ఆలోచిస్తానన్నారు.

రాహుల్ గాంధీకి లేఖ

బీఆర్ఎస్ నీచపాలన అంతం కోసం ఎటువంటి కఠిన నిర్ణయానికైనా సిద్ధమని షర్మిల స్పష్టం చేశారు. కేసీఆర్ అవినీతి, రౌడీరాజ్యం అంతమొందించగలిగే కాంగ్రెస్ పార్టీ ఓటు చీల్చవద్దనే ఈ త్యాగం చేశామన్నారు. ఈ మేరకు ఆమె రాహుల్ గాంధీకి లేఖ రాశారు.

ఆ రెండు సీట్లు దక్కేలా చూడండి

కాంగ్రెస్‌తో పొత్తుకోసం ఆగని సీపీఐ యత్నాలు

- మరోసారి చర్చించాలని కేంద్ర కమిటీకి రాష్ట్ర నేతల విజ్ఞప్తి
- కొత్తగూడెం, చెన్నూరు సీట్లు దక్కేలా చూడాలని వినతి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌పార్టీతో ఎలాగైనా పొత్తు కుదుర్చుకోవాలని సీపీఐ భావిస్తోంది. గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన కొత్తగూడెంతోపాటు చెన్నూరు లేదా మునుగోడు స్థానాలను ఇవ్వాలని కోరుతోంది. అందుకోసం ప్రయత్నాలు తీవ్రం చేయాలని పార్టీ జాతీయ కార్యదర్శి డి.రాజాను స్థానిక నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు కేంద్ర కమిటీకి బాధ్యత అప్పగిస్తూ రాష్ట్ర సమితి ఏకగ్రీవ తీర్మానం చేసింది. కాంగ్రెస్‌తో పొత్తుకు సంబంధించి సీపీఐ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్‌తో పొత్తు విషయాన్ని తేల్చే బాధ్యతను కేంద్ర కమిటీకి అప్పగిస్తూ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకులతో చర్చించి రెండు అసెంబ్లీ స్థానాలు దక్కేలా ప్రయత్నించాల్సిందిగా కోరామని ఆయన చెప్పారు. కేంద్ర కమిటీ తీసుకునే నిర్ణయాన్ని బట్టి నడుచుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

పార్టీలో గందరగోళం..

కాగా, కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకొని ఒంటరిగా బరిలో నిలవాలని సీపీఎం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే సీపీఐ మాత్రం అలా తెగతెంపులు చేసుకోవడానికి ఏమాత్రం సిద్ధపడడం లేదని తెలుస్తోంది. వామపక్షాలన్నీ కలసి పోటీ చేసినా ఎక్కడా గెలిచే పరిస్థితి లేదనీ, కాబట్టి ఎలాగైనా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటేనే అసెంబ్లీలో అడుగు పెట్టగలమని ఆ పార్టీ భావిస్తోందని సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలవకపోవడం, శాసనసభలో ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిందనీ, కేడర్ చెల్లాచెదురైపోతున్నారనేది సీపీఐ భావనగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి ఎలాగైనా అసెంబ్లీలో అడుగుపెట్టి తీరాలని సీపీఐ యోచిస్తోంది. అయితే సీపీఐ రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమావేశంలో మాత్రం నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తినట్లు తెలిసింది. కొందరు సీపీఎం సహా ఇతర వామపక్ష, లౌకిక శక్తులతో కలసి పోటీ చేయాలని కోరగా, కొందరు ఎలాగైనా కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటేనే బాగుంటుందని అన్నట్లు తెలిసింది. అంతేకాదు మునుగోడు, కొత్తగూడెం సీట్ల విషయంపై ఆయాచోట్ల తలెత్తిన అసంతృప్తి కూడా ఈ సమావేశంలో బయటపడినట్లు సమాచారం. ఒకవేళ కాంగ్రెస్‌తో పొత్తు ఖరారై కొత్తగూడెం, చెన్నూరు స్థానాలు ఇచ్చినా మునుగోడులో పోటీ చేసి తీరాల్సిందేనని కొందరు పట్టుబట్టినట్లు తెలిసింది. దీంతో గందరగోళ వాతావరణం నెలకొనడంతో సమావేశానికి వచ్చిన సభ్యులను శాంతింప చేయడం కష్టమైందని సమాచారం. ఈ నేపథ్యంలో పొత్తు బాధ్యతను కేంద్ర కమిటీకి అప్పగించినట్లు తెలిసింది. ఒకవేళ కాంగ్రెస్‌తో సయోధ్య కుదరకుంటే, తదుపరి ఏం చేయాలన్న దానిపైనా కూడా కేంద్ర కమిటీనే తేల్చాలని కోరినట్లు వెల్లడైంది. కాంగ్రెస్‌తో పొత్తు కుదరకుంటే దాదాపు 20 సీట్లలో పోటీ చేసే విషయం కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం.



ట్రెండ్
సైలెంట్ వాకింగ్

మనతో మనం మాత్రమే

మార్నింగ్ వాక్‌కు గుంపుగా బయలుదేరుతారు కొందరు. తోడు లేనిదే కదలరు కొందరు. ఒంటరిగా బయలుదేరితే పాటలు వింటూ నడుస్తారు కొందరు. లేదా ఫోన్లు మాట్లాడుతూ ఉభయతారకంగా నడుస్తారు ఇక మనతో మనం ఉండేది ఎప్పుడు? ఇప్పుడు 'సైలెంట్ వాకింగ్' ట్రెండింగ్‌లో ఉంది. అంటే ఫోన్లు, సాటి మనుషులు ఎవరూ లేకుండా ఒక్కరే మనతో మనం ఉంటూ నడవడం. దీనివల్ల మానసికంగా, భౌతికంగా ప్రయోజనం ఉందంటున్నారు నిపుణులు.

ఉదయం ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని ఎదురు చూస్తారు రిటైర్డ్ టీచర్ విశ్వనాథం. ఆయన తన అపార్ట్‌మెంట్‌లో ఉన్న ముగ్గురు నలుగురితో కలిసి ఉదయాన్నే వాకింగ్‌కు వెళతారు. ఫోన్ తీసుకువెళతారు. ఆ ముగ్గురు నలుగురు కలవగానే ఇక కబుర్లు మొదలు. నవ్వులు, పరిహాసాలు ఎలా ఉన్నా ఎంతలేదన్నా రాజకీయాలు చర్చకు వస్తాయి. ఆ తర్వాత ఇంట్లో సమస్యలు చర్చకు వస్తాయి. ఏవో పాత గొడవలు గుర్తుకు వస్తాయి. చిన్నపాటి వాదనలు జరుగుతాయి. ఈలోపు మెసేజ్‌లు, ఫేస్‌బుక్ చెకింగు, ఒక ఫోన్ కాల్ ఎవరిదో మాట్లాడటం... ఉదయాన్నే మనసు, శరీరం తేలిక కావాల్సింది పోయి బరువైపోతాయి.

ఐ.టి. ఫీల్డ్‌లో పని చేసే అవివాహిత చందన సాయంత్రం ఇల్లు చేరుకుని వాకింగ్‌కు బయలుదేరుతుంది. హెడ్‌ఫోన్స్‌లో పాటలు వింటూ నడుస్తుంటుంది. ఆ పాటల్లో పూర్తిగా లీనం కాకుండా మెసేజ్‌లు, కాల్సూ వస్తూనే ఉంటాయి. పాటలు కూడా విన్నవే వినడం వల్ల కొత్త అనుభూతి కలగదు. పాటలు వినాలి కాబట్టి వింటున్నానా అనే సందేహం వస్తుంది.

గృహిణి సుభాషిణి సాయంత్రం వీలు చూసుకుని ఎలాగో వాకింగ్‌కు బయలుదేరుతుంది. కాని ఆమె వాకింగ్‌కు బయలుదేరిన వెంటనే ఊళ్లో ఉన్న తల్లికి ఫోన్ చేయాలి. అది తల్లి ఆమెతో చేసుకున్న అగ్రిమెంట్. కూతురితో మాట్లాడకపోతే ఆమెకు తోచదు. సుభాషిణి వాకింగ్ మొదలెట్టి తల్లికి కాల్ చేయగానే తల్లి ఏవేవో విషయాలు ఏకరువు పెడుతుంది. కొన్ని ఫిర్యాదులు, కొడుకు మీద అభ్యంతరాలు, ఇంకేవో ఇరుగు పొరుగు గాసిప్... ఎంత లేదన్నా అలజడి కలిగిస్తాయి. ఇదా వాకింగ్ అంటే.

సైలెంట్ వాకింగ్ విరుగుడు

టిక్‌టాక్ ఇన్‌ఫ్లూయెన్సర్ మాడీ మాయో మొన్నటి సెప్టెంబర్‌లో ఈ 'సైలెంట్ వాకింగ్'ను ప్రతిపాదించింది. ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, స్మార్ట్ వాచీలతో సహా అన్ని లంపటాలను వదిలి ఎవరితోనూ వాగుడు పెట్టుకోకుండా హాయిగా మౌనంగా మనతో మనం ఉంటూ నడవడం చాలా బాగుంది అని ఆమె పెట్టిన ఒక పోస్టు ఆమెను ఫాలో అయ్యే యువతకు నచ్చింది. అప్పటి నుంచి సైలెంట్ వాకింగ్ మెల్లమెల్లగా ప్రచారం పొందింది.

మన గురించి ఆలోచిస్తున్నామా?

మన గురించి మనం ఆలోచించుకోవడానికి, మన ఆలోచనలు పదును పెట్టుకోవడానికి, మన లక్ష్యం వైపు దృష్టి నిలపడానికి ఎప్పుడూ కూడా ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫోన్లు అడ్డం పడుతూనే ఉన్నాయి. ఆఖరుకు నడకలో కూడా ఏదో ఒక అంతరాయం. ఇంటి నుంచి బయటకు వచ్చినా ఇంటి నుంచి ఫోన్ వస్తే ఇక ఇంట్లో ఉన్నట్టే తప్ప బయట ఉన్నట్టు అనిపించదు. 'సైలెంట్ వాకింగ్ రెండు పనులు చేస్తుంది. ఒకటి మన ఆలోచనలు మనల్ని వినేలా చేస్తుంది... రెండు ప్రకృతిని విని స్పందించేలా చేస్తుంది' అని ఒక సైలెంట్ వాకర్ చెప్పింది. మరో స్టూడెంట్ అయితే 'ఫోన్లు పారేసి హాయిగా అరగంట సేపు నడిస్తే నాకు చాలా స్వేచ్ఛతో ఉన్నట్టు అనిపిస్తోంది. అదీగాక నా చదువు మీద దృష్టి నిలుస్తోంది' అని చెప్పింది.

ఒత్తిడి తగ్గుతుంది

భవ బంధాలు తెంచుకున్నట్టుగా ఏ కమ్యూనికేషన్ లేకుండా కనీసం రోజులో 30 నిమిషాలు ఒక రకమైన ఏకాంత సమయం గడపడమే సైలెంట్ వాకింగ్. దీని వల్ల యాంగ్జయిటీ వంటివి తగ్గి మానసికంగా ఒక ప్రశాంతత వస్తుందని పరిశీలకులు అంటున్నారు. ఐదు నిమిషాలు ఫోన్ కనపడకపోతే కంగారు పడేవారు అరగంట ఫోన్‌ను ఇంట్లో పడేసి బయట పడి నడిస్తే ఆ స్వేచ్ఛ మనసుకు దొరుకుతుంది. ఈ అరగంటలో కొంపలేమీ మునిగిపోవు అని తెలుస్తుంది. మన గుప్పిట్లో ఫోన్ ఉన్నంత సేపు మెడ మీద కత్తి వేళ్లాడుతున్న భావనే... ఎప్పుడు ఎవరు ఏ విధంగా డిస్ట్రబ్ చేస్తారో తెలియదు కదా.


ధ్యానంలో కూడా మనల్ని మనం పరిశీలించుకోవడం, ఆలోచనలను పరిశీలించుకోవడం ముఖ్యం అంటారు. సైలెంట్ వాకింగ్‌లో నడుస్తూ అలాంటి పనే చేస్తాం. క్రిక్కిరిసిన జీవితంలో మనవైన ఆలోచనలకు చోటు ఇచ్చి, పాజిటివ్ ఆలోచనలు చేస్తూ ముందుకు పోయేందుకు దోహదం చేసేదే సైలెంట్ వాకింగ్.

మౌన మునులుగా మారి రేపటి నుంచి మౌన నడకకు బయలుదేరండి.

సేఫ్టీ అలర్ట్స్

ఆపద సమయంలో స్మార్ట్ కేర్

పిల్లలు ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటారు. తల్లిదండ్రులు ఇంట్లో ఒంటరిగా ఉంటారు. ఇలాంటి ఒంటరి తల్లిదండ్రులను ప్రమాదాల బారి నుంచి రక్షించడానికి కేరళ స్టార్టప్ 'స్మార్ట్‌కేర్' ఎమర్జెన్సీ అలర్ట్ టెక్నాలజీతో కొన్ని పరికరాలను రూపొందించింది....



హైదరాబాద్ కూకట్‌పల్లి లోని రిటైర్డ్ ఉద్యోగి రాజేశ్వరరావు ఒంటరిగా ఉంటాడు. భార్య రెండు సంవత్సరాల క్రితం చనిపోయింది. కొడుకు, కోడలు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. విశాఖపట్టణంలో ఉండే అనసూయమ్మకు ఒక్కగానొక్క కూతురు పుణెలో ఉద్యోగం చేస్తుంది. అనసూయమ్మ భర్త చనిపోయి చాలా కాలం అయింది.

రాజేశ్వరరావు ఒకరోజు ఇంట్లో కాలు జారిపడ్డాడు. ఆ సమయంలో వేరే ఊరి నుంచి వచ్చిన బంధువు ఒకరు ఉండడంతో ఆయనను త్వరగా హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు.

అనసూయమ్మకు కూడా ఇలాగే జరిగింది. పడిన తర్వాత చాలాసేపటికి ఎవరో ఇంటికి రావడంతో ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మరింత ఆలస్యం అయి ఉంటే అనసూయమ్మ ప్రమాదంలో పడేది.

అయితే అన్ని సందర్భాల్లోనూ ఎవరో ఒకరు వచ్చి బాధితులను హుటాహుటిన హాస్పిటల్‌కు తీసుకువెళతారని గ్యారెంటీ లేదు. ఇక కేరళ విషయానికి వస్తే ఒంటరిగా జీవిస్తున్న వృద్ధుల సంఖ్య అక్కడ ఎక్కువగా ఉంది. వారు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసిందే... స్మార్ట్‌కేర్.

కేరళకు చెందిన వేణునాథ్ స్వీడన్‌లో చదువుకునే రోజుల్లో ఒక వృద్ధురాలి ఇంట్లో అద్దెకు ఉండేవాడు. ఆమె వయసు ఎనభై సంవత్సరాలు. ఆ వృద్ధురాలి ఒంటరి జీవితం చూసి వేణుకు జాలిగా అనిపించేది. ఒక రాత్రి ఆమె అనారోగ్యానికి గురైంది. సీరియస్ అయ్యే పరిస్థితి వచ్చింది. ఆమె తన చేతికి ఉన్న కంకణంలాంటి దానిపై ఉన్న బటన్‌ను నొక్కింది. వెంటనే టేబుల్ మీద ఉన్న పరికరం తనతో మాట్లాడడం మొదలుపెట్టింది. తనకు ఇబ్బందిగా ఉన్న విషయం గురించి చెప్పింది ఆమె. ఇరవై నిమిషాల లోపే వైద్యుడు, సహాయక బృందం ఆమె ఇంటికి వచ్చారు. ప్రాథమిక చికిత్స చేసి హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

ఆ సమయంలో ఆ పరికరం గురించి వేణుకు విపరీతమైన ఆసక్తి ఏర్పడి దాని గురించి వివరాలు తెలుసుకున్నాడు. మన దేశంలో కూడా ఇలాంటి టెక్నాలజీ ఉంటే బాగుండేది అనుకున్నాడు.

స్వీడన్‌లో డాటా సైంటిస్ట్‌గా కొంతకాలం ఉద్యోగం చేసిన వేణు ఆ తరువాత ఇండియాకు వచ్చి స్నేహితుడు అరుణ్ నాయర్‌తో కలిసి 'అస్స్రిడ్ స్మార్ట్‌కేర్ ప్రాడక్స్' కంపెనీ మొదలు పెట్టాడు.

అంతకుముందు ఉద్యోగం చేస్తూనే జీతంలో సగం మొత్తాన్ని వృద్ధులకు ఉపకరించే ఉపకరణాల గురించి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై ఖర్చు చేసేవాడు. ఎంతోమంది నిపుణులతో మాట్లాడేవాడు.



స్మార్ట్‌కేర్ బృందం

స్మార్ట్‌కేర్ ఉత్పత్తుల్లో ఒకటి... వైర్‌లెస్ ఫాల్ సెన్సర్. దీన్ని బాత్‌రూమ్ గోడలకు బిగిస్తారు. వృద్ధులు పడిపోతే కంపెనీకి అలర్ట్ పంపుతుంది. కంపెనీ వెంటనే వైద్యులను ప్రమాద బాధితుల ఇంటికి పంపుతుంది. చేతికి ధరించే 'విబ్బీ డిటెక్టర్' కూడా వృద్ధులు ప్రమాదంలో ఉన్నప్పుడు అలర్ట్ పంపుతుంది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో బాధ పడేవారికి ఇది బాగా ఉపకరిస్తుంది. 'హీట్ అలారమ్' అనేది వైర్‌లెస్ ఇండోర్ సెన్సర్. లాకెట్‌లా మెడలో ధరించవచ్చు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు హెచ్చరిస్తుంది.

తక్కువ బరువుతో ఉండే 'మైఎమీ' లాకెట్ వృద్ధులు ఇల్లు దాటి బయటికి వెళ్లినప్పుడు ఉపయోగపడుతుంది. ఆపద సమయంలో సహాయం కోసం దీనిపై ఉన్న బటన్‌ను నొక్కాలి...'స్మార్ట్‌కేర్' ఉత్పత్తుల్లో ఇవి కొన్ని మాత్రమే.

'స్మార్ట్‌కేర్' నలభై హాస్పిటల్స్‌తో కలిసి పని చేస్తోంది. కోల్‌కత్తా, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు నగరాలకు కూడా కంపెనీ విస్తరించే ప్రయత్నాల్లో ఉంది.

మొక్కవోని ఆకాంక్ష

ఈ రోజుల్లో ఇంట్లో కూర్చొనే షాపింగ్ చేసి లక్షలు ఖరీదు చేసే వస్తువులను సైతం క్షణాల్లో కొనేస్తున్నారు. వంట చేయడం కుదరనప్పుడో, తినడానికి ఏమీ లేనప్పుడో, బయటకు వెళ్లే ఓపిక లేనప్పుడో వెంటనే ఫుడ్ ఆర్డర్ పెట్టేస్తున్నారు. ఆర్డర్ ఇచ్చిన అరగంటలోపు వేడివేడి ఆహారం ఇంటి గుమ్మం ముందుకు వచ్చేస్తుంది. ఈ డెలివరీ యాప్‌లను ఆధారంగా చేసుకుని మొక్కల వ్యాపారం ప్రారంభించింది ఆకాంక్ష గుప్తా. ఫుడ్ డెలివరీ అయినట్టుగానే మొక్కలు, విత్తనాలు, ఎరువులను ఆర్డర్ ఇచ్చిన గంటల వ్యవధిలో కస్టమర్లకు అందిస్తోంది. కంపెనీ ప్రారంభించిన రెండేళ్లలో కోట్ల టర్నోవర్‌తో నడుస్తోంది. మొక్కలను ఎలా డెలివరీ చేస్తోందో ఆకాంక్ష మాటల్లోనే...



ఆకాంక్ష

ఢిల్లీలోని మోడల్ టౌన్‌లో నివసించే సాంప్రదాయ ఉమ్మడి కుటుంబం మాది. నాన్న వ్యాపారి. అమ్మ ఇంటి పనులు చూసుకునేది. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో బీకామ్ హానర్స్ పూర్తయ్యాక...ఉద్యోగం చేస్తాను అని ఇంట్లో వాళ్లకు చెప్పాను. అందరూ ఆశ్చర్యపోయారు. అమ్మాయిలు ఇంట్లో ఉండి పనులు చూసుకుంటుంటే, అబ్బాయిలు బయటకు వెళ్లి పనిచేసి సంపాదించడం పద్ధతి అనేది వాళ్ల నమ్మకం. దీంతో వాళ్లను ఒప్పించడానికి చాలా సమయం పట్టింది. నేను ఉద్యోగం ఎందుకు చేయాలనుకుంటున్నానో అన్నివిధాలుగా వివరించాను. అందుకు వాళ్లు సమ్మతించి ప్రోత్సహించారు. దీంతో ఈఎక్స్‌ఎల్ కంపెనీలో ఉద్యోగంలో చేరాను. ఇక్కడ రెండేళ్లు పనిచేశాక, 2016లో అహ్మదాబాద్ ఐఐఎమ్‌లో ఎమ్‌బీఏ పూర్తిచేశాను. తర్వాత 'డెలాయిట్' మేనేజ్‌మెంట్ కన్సల్‌టెంట్‌గా చేరాను.

లాక్‌డౌన్ మార్చేసింది...

డెలాయిట్‌లో పనిచేస్తున్నప్పుడు... తెలిసిన వాళ్ల అబ్బాయి సంభవ్ జైన్ పరిచయమయ్యాడు. సంభవ్ కూడా ఎమ్ఎన్‌సీలో పనిచేస్తుండడం, ఇరుకుటుంబాలకు నచ్చడంతో 2019లో మా పెళ్లి జరిగింది. పెళ్లి అయిన కొన్నినెలలకే లాక్‌డౌన్ విధించారు. ఇంట్లో ఉండి పనిచేస్తున్నప్పటికీ వారాంతపు సెలవుల్లో చాలా సమయం దొరికేది. మొక్కలు పెంచడం అంటే ఎంతో ఆసక్తి చూపే సంభవ్ సమయం మొత్తం గార్డెనింగ్‌కు కేటాయించేవాడు. సంభవ్ నిర్వహించే వర్క్‌షాపుల్లో ''మొక్కలు ఎలా పెంచాలి? మొక్కలు బాగా పెరిగేందుకు సలహాలు సూచనలు'' సంభవ్‌తో కలిసి నేను చెప్పేదాన్ని. ఆరేడు నెలల్లోను మేము నిర్వహించిన వర్క్‌షాపులకు మూడువేల మందికి పైగా హాజరై గార్డెనింగ్ గురించి తెలుసుకున్నారు. ఇలా లాక్‌డౌన్‌లో మా జీవితాలు గార్డెనింగ్ వైపు మళ్లాయి. ఈ మార్పే మమ్మల్ని వ్యాపారవేత్తలుగా మార్చింది.



ఆకాంక్ష, సంభవ్ జైన్

సమస్యల నుంచి...

వర్క్‌షాపుల్లో చాలా మంది.. మొక్కలు పెంచాలని ఉంది కానీ, మంచి మొక్కలు, కుండీలు, ఎక్కడ కొనాలో తెలియడం లేదు. ఆన్‌లైన్‌లో కూడా మంచి స్టోర్లు ఏవీ లేవు. అరకొర ఆన్‌లైన్ స్టోర్లు కస్టమర్లకు నచ్చడం లేదు'' అని చెప్పారు. దీంతో 2020లో సంభవ్ ఉద్యోగం వదిలేసి 'ది బన్యన్ కంపెనీ' పెట్టాడు. తనకి నేను సాయంగా ఉన్నాను. ఒక దగ్గర నర్సరీ పెంచుతూ అక్కడ నుంచి కస్టమర్లకు ఆర్డర్లు ఇవ్వడానికి రవాణా ఖర్చు ఎక్కువ అవడంతోపాటు, కొన్నిసార్లు రవాణాలో మొక్కలు పాడైపోయేవి. దీంతో మా కంపెనీ బాగా నష్టపోయింది.

ఫుడ్ లా మొక్కలు కూడా...

కంపెనీ అనేక నష్టాలను చూశాక ఎలా కంపెనీని నిర్వహించాలని తీవ్రంగా ఆలోచించాను. అప్పుడే నాకు ఫుడ్ డెలివరీ యాప్స్ గుర్తుకొచ్చాయి. ఫుడ్‌ను డెలివరీ చేసే యాప్స్‌లా మొక్కలను ఎందుకు డెలివరీ చేయకూడదు... అనిపించింది. దీనివల్ల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయి అనుకుని వెంటనే 2021లో 'ఉర్వాన్.కామ్' కంపెనీని ప్రారంభించాను. అర్బన్, ఫారెస్ట్‌ల నుంచి పదాలను తీసుకుని ఉర్వాన్ పేరు పెట్టాను. ఈ కంపెనీ ప్రారంభించిన వెంటనే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. కుటుంబ సభ్యులంతా షాక్ అయ్యారు. ''ఉద్యోగం వదిలేసి సంభవ్ చేసిన వ్యాపారంలో నష్టం వచ్చింది. మళ్లీ ఆకాంక్ష కూడా అదే పనిచేస్తోంది. ఈ వ్యాపారం కూడా నష్టపోదని గ్యారెంటీ ఏంటీ? సంభవ్ నువ్వు అయినా ఉద్యోగం చెయ్యి'' అందరు సలహాలు ఇచ్చారు. కొంతమంది అయితే ఈ వ్యాపారం ఎప్పటికీ విజయవంతం కాదన్నారు. కానీ నేను, సంభవ్ ఏమాత్రం వెనక్కు తగ్గకుండా ముందుకు సాగాం. చివరకు ఒక బిజినేస్ అడ్వైజర్ దగ్గరకు వెళ్లి సలహా అడిగితే... ''ఇది అంత మంచి వ్యాపారం కాదు. దీనివల్ల ఆదాయం ఏమీ రాదు. మీ ఇద్దరూ ఉద్యోగాలు చేసుకోవడం మంచిది'' అని సలహా ఇచ్చారు.

వెబ్‌సైట్ క్రియేట్ చేసిన తరువాత నర్సరీ నిర్వాహకులను కలిసి వెబ్‌సైట్‌లో యాడ్ చేశాము. కొంతమందికి కనీసం వాట్సాప్ మెస్సేజ్‌లు కూడా పంపడం రాదు. ఆన్‌లైన్‌లో మొక్కలు విక్రయించిన అనుభవం ఎవరికీ లేదు. దీంతో అందరికి దీనిలో శిక్షణ ఇచ్చాము. ప్రారంభంలో పెద్దగా ఆదాయం ఏమీ రాలేదు. కానీ రెండు వారాల తరువాత మేము పెట్టిన పెట్టుబడికి తగిన ఆదాయం రావడం మొదలైంది. కస్టమర్లు పెరగడంతో..స్నేహితులు, బంధువులు మా కంపెనీలో పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టారు. ఆర్డర్ ఇచ్చిన మరుసటి రోజుకల్లా దగ్గర్లోని నర్సరీల నుంచి కస్టమర్లకు మొక్కలు డెలివరీ ఇస్తున్నాం. దీనికి అదనపు ప్యాకింగ్ చార్జీలు లేకపోవడం, బయటి రేటుకే ఆన్‌లైన్‌లో దొరుకుతుండడంతో ఎక్కువమంది మా దగ్గర కొనడం ప్రారంభించారు. తొలినాళ్లల్లో నెలకు ఐదువందల మొక్కలు విక్రయించడం కష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు నెలకు మూడులక్షలకు పైగా మొక్కలను డెలివరీ ఇస్తున్నాము. ఇద్దరితో ప్రారంభమైన మా వ్యాపారం నేడు పాతిక మందికి చేరింది. మూడు నర్సరీల నుంచి నలభై నర్సరీలు అయ్యాయి. ఢిల్లీ, ఎన్‌సీఆర్‌లోనేగా బెంగళూరులోనూ మా మొక్కలు డెలివరీ ఇస్తున్నాము. వచ్చే సంవత్సరం వందకోట్ల టర్నోవర్ లక్ష్యంగా పనిచేస్తున్నాము.

''కొన్నిసార్లు మనం తీసుకునే నిర్ణయాలు ఎవరికీ నచ్చకపోవచ్చు. కానీ ఆ నిర్ణయం మీద, మన మీద మనకు నమ్మకం ఉంటే ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొని విజయం సాధించవచ్చు'' అని ఆకాంక్ష గుప్తా నిరూపించి చూపిస్తోంది.

క్లీనింగ్ టిప్

ఫ్యాబ్రిక్ సోఫాను శుభ్రం చేయడానికి, ఆరు టీస్పూన్ల బాత్ సోప్ పౌడర్ తీసుకోండి. దీనిలో తగినన్ని వేడి నీళ్లు పోస్తూ బాగా కలపండి. దానికి రెండు టీస్పూన్ల అమ్మోనియా లేదా తేనె జోడించండి. ఆ తరువాత, ఈ ద్రావణాన్ని చల్లబరచండి. చల్లబడిన తర్వాత దానిని బాగా కలిపితే నురగ వస్తుంది. ఇప్పుడు సోఫాపై భాగంలో గుడ్డ లేదా స్పాంజ్ సహాయంతో ఈ నురుగుతో శుభ్రం చేయండి. దీని తరువాత సోఫాను ఫ్యాన్ కింద ఆరనివ్వండి. దీంతో ఫ్యాబ్రిక్ సోఫా కొత్తదానిలా మెరిసిపోతుంది.



కాంగ్రెస్‌కు షర్మిల మద్దతు.. ఆమె పార్టీ విధాన నిర్ణయం కావచ్చు: సజ్జల



సాక్షి, అమరావతి: త్వరలో జరగనున్న తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వైఎస్ షర్మిల మద్దతివ్వడం ఆమె పార్టీపరంగా తీసుకున్న నిర్ణయం కావచ్చునని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. పక్క రాష్ట్ర విషయాల గురించి సీఎం జగన్ పెద్దగా పట్టించుకోరని ఆయనన్నారు. వైఎస్ కుటుంబాన్ని కాంగ్రెస్ ఇబ్బంది పెట్టిందన్న విషయం అందరికీ తెలుసునని.. సోనియా దగ్గరికి వెళ్లినప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు షర్మిలమ్మ కూడా ఉన్నారని గుర్తుచేశారు. అయినా ఆమె పార్టీ విధాన పరమైన నిర్ణయంలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతిచ్చి ఉండొచ్చునని ఆయనన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం సజ్జల మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు స్కాంలు చాలా ఉన్నాయి. వాటికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి కాబట్టే కేసులు పెట్టారు. ఎన్నికల సమయంలో ఆయనపై రాజకీయ కక్ష సాధింపు ఎందుకు చేస్తాం. అలాచేసే వాళ్లమైతే అధికారంలోకి వచ్చిన వెంటనే చేసి ఉండే వాళ్లం. తీగ లాగితే డొంక కదిలినట్లు ఇప్పుడు అన్ని ఒక్కొక్కటి బయటకొస్తున్నాయి. నిజానికి.. చంద్రబాబు పాలన అంతా కుంభకోణాలమయం. లిక్కర్ స్కాంలో ఫైనాన్స్ శాఖ, కేబినెట్ నిర్ణయానికి సంబంధం లేకుండా ప్రివిలేజ్ ఫీజు ఎత్తేశారు. దీనివల్ల ఖజానాకు రూ.1,300 కోట్ల నష్టం జరిగింది. ఈ నిర్ణయం సీఎంకి సంబంధం లేకుండా జరిగిందంటే ఎలా? చంద్రబాబును విచారించకుండా ఎలా ఉంటాం'అని ప్రశ్నించారు.

మీడియా మంచికోరే సీఎం జగన్: అమర్



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో వేలాదిమంది జర్నలిస్టుల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా జర్నలిస్టుల గృహ వసతిపై నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ కృతజ్ఞతలు తెలిపారు. మీడియా మంచి కోరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చివరిగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత.. మళ్లీ జర్నలిస్టుల గృహ వసతి గురించి ఆలోచించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన స్పష్టం చేశారు. పాదయాత్ర సందర్భంగా చాలా చోట్ల జర్నలిస్టులు జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జగన్ తన పార్టీ ఎన్నికల ప్రణాళికలో పొందుపరిచిన హామీని ఈ రోజు నెరవేర్చారని వివరించారు.

సంపూర్ణ సాధికారత

అణగారిన వర్గాల అభ్యున్నతికి సమగ్ర కులగణన

సీఎం జగన్ అధ్యక్షతన కీలక నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం

ఈనెల 20వ తేదీ తర్వాత రాష్ట్రంలో కులగణన ప్రక్రియ ప్రారంభం

- ప్రభుత్వ ఉద్యోగులకు 3.64% డీఏ
- పోలవరం ముంపు బాధితులకు ఉచితంగా ఇళ్ల పట్టాలు, భూముల రిజిస్ట్రేషన్
- అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీకి గ్రీన్ సిగ్నల్
- 28న విద్యా దీవెన, 30న కళ్యాణమస్తు, షాదీ తోఫా పంపిణీ

సాక్షి, అమరావతి: సంపూర్ణ సామాజిక సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుల గణనకు శ్రీకారం చుడుతోంది. సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆరోగ్య, విద్యా ఫలాలు అందేందుకు వీలుగా ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దాదాపు శతాబ్దం తర్వాత రాష్ట్రంలో కుల గణన ద్వారా మరిన్ని పేదరిక నిర్మూలన పథకాలు, మానవ వనరుల అభివృద్ధితో పాటు తారతమ్యాలు, అసమానతలను రూపుమాపేలా ప్రణాళిక రూపొందించింది. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి కీలక సమావేశంలో ఈమేరకు కుల గణన నిర్ణయానికి ఆమోదం లభించింది. సమాచార, పౌర సంబంధాలు, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మంత్రి మండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ఈ నెల 20వతేదీ తర్వాత కుల గణన ప్రక్రియ చేపడతామని తెలిపారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆయా సామాజిక వర్గాల నాయకులతో సమావేశాలు, ఐదు ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి అభిప్రాయ సేకరణ చేపడతామన్నారు. కుల గణన చేపట్టాలని కోరుతూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపినా స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మ బంధువుగా సీఎం జగన్ చేపడుతున్న కుల గణనను 'సామాజిక సాధికార సురక్ష'గా అభివర్ణించారు. సంక్షేమ ఒరవడిలో భాగంగా నవంబరు 7వతేదీన వైఎస్సార్ రైతు భరోసా సాయం పంపిణీతో పాటు 15వతేదీన భూమిలేని నిరు పేదలకు అసైన్డ్ భూముల పంపిణీ, 22-ఏ జాబితా నుంచి ఇనామ్ భూముల మినహాయింపు, ఎస్సీ కార్పొరేషన్ రుణాల ద్వారా భూమి కొనుగోలు చేసిన వారికి రుణాలను మాఫీ చేయడంతో పాటు వాటిపై పూర్తి హక్కులు కల్పిస్తామన్నారు. ఎస్సీ శ్మశాన వాటికల కోసం భూములు, లంక భూములకు పట్టాల పంపిణీ చేపడతామన్నారు. 28వ తేదీన జగనన్న విద్యా దీవెన, 30న పేదింటి ఆడబిడ్డలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా అందజేస్తామన్నారు. జర్నలిస్టుల చిరకాల వాంఛ, విజ్ఞప్తిని గౌరవిస్తూ అక్రిడేటెడ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు సీఎం జగన్ సారథ్యంలోని మంత్రి మండలి అంగీకారం తెలిపిందని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు 3.64 శాతం డీఏ (01-07-2022 నుంచి) ఇవ్వనున్నట్లు చెప్పారు. విశాఖపట్నానికి చెందిన అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేని గ్రూప్-1 అధికారిగా నియామకానికి ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లాలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు, యూజర్ చార్జీల నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు చెప్పారు. పోలవరం ముంపు గ్రామాల పునరావాసంలో భాగంగా ఏలూరు జిల్లా పరిధిలో పోలవరం, వేలేరుపాడు, కుకునూరు మండలాల పరిధిలో 12,984 కుటుంబాలకు, తూర్పు గోదావరి జిల్లాలో దేవీపట్నం, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో 3,823 కుటుంబాలకు కేటాయించిన ఇళ్ల పట్టాలకు, భూమి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ భూమి కేటాయింపునకు సంబంధించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని వెల్లడించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



అణగారిన వర్గాల అభ్యున్నతికి కుల గణన మరింత దోహదం చేస్తుంది. ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా చేయూత అందిస్తుంది. ఇంకా ఎవరైనా అర్హులు ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలి పోయినా కూడా ఈ గణన ద్వారా తెలుస్తుంది. తద్వారా వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుంటుంది.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

10న ఆన్‌లైన్‌లో 2.25 లక్షల వైకుంఠ ద్వార దర్శన టికెట్లు

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల: డిసెంబర్ 23-జనవరి 1 వరకు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించిన 2.25 లక్షల రూ.300 దర్శన టికెట్ల కోటాను (రోజుకు 2 వేల టికెట్లు) నవంబర్ 10న ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేయనుంది. ఈ విషయాన్ని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో చెప్పారు. తిరుపతిలోని 9 కేంద్రాల్లో 100 కౌంటర్లలో డిసెంబర్ 22న వైకుంఠ ద్వార దర్శనానికి 10 రోజులకుగాను 4.25 లక్షల టైం స్లాట్ సర్వదర్శనం టోకెన్లు విడుదల చేస్తామని వివరించారు. డిసెంబర్ 23-జనవరి 1 వరకు చంటి పిల్లలు, దివ్యాంగులు, వృద్ధులు, ఎన్ఆర్ఐ కోటా దర్శనాలను రద్దు చేసినట్లు తెలిపారు. భక్తులు శ్రీవాణి ట్రస్ట్‌కు రూ.10 వేలు విరాళం ఇవ్వడంతో పాటు రూ.300 దర్శన టికెట్ కొనుగోలు చేయాలని, ఈ టికెట్లను పొందిన వారికి మహా లఘు దర్శనం (జయ విజయుల వద్ద నుంచి) ఉంటుందని చెప్పారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను నవంబర్ 10-18 వరకు నిర్వహిస్తామని చెప్పారు. నవంబర్ 12న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానాన్ని, 24న చక్రతీర్థ ముక్కోటి నిర్వహిస్తామన్నారు. శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు దర్శించుకున్నారు.

ర్యాలీలు అంటే.. బెయిల్ ఇచ్చే వాళ్లమా?

- చంద్రబాబు బహిరంగ ర్యాలీలు నిర్వహించడం, పాల్గొనడం చేయరాదు
- అదనపు షరతులు అవసరం లేదన్న వాదనను తిరస్కరించిన హైకోర్టు



సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడు నారా చంద్రబాబు నాయుడుకు హైకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మధ్యంతర బెయిల్ మంజూరు సందర్భంగా విధించిన షరతులకు అదనంగా ఎలాంటి షరతులు విధించాల్సిన అవసరం లేదన్న చంద్రబాబు వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఎక్కడా బహిరంగ ర్యాలీలు నిర్వహించడం గానీ, అందులో పాల్గొనడం గానీ చేయరాదని చంద్రబాబును హైకోర్టు ఆదేశించింది. అలాగే బహిరంగ సభల్లో కూడా పాల్గొనరాదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి ఎలాంటి బహిరంగ వ్యాఖ్యలు చేయకూడదని కూడా ఆయన్ను ఆదేశించింది. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతులకు అదనంగా తాజా షరతులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. కోర్టు షరతులను ఉల్లంఘించకుండా చంద్రబాబు కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఇద్దరు డీఎస్పీలను అనుమతించాలన్న సీఐడీ అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తెల్లాప్రగడ మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సహేతుక ఆంక్షలే..

స్కిల్ స్కామ్ కేసులో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించిన చంద్రబాబుకు కంటి శస్త్రచికిత్స నిమిత్తం హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా విధించిన షరతులకు అదనంగా మరిన్ని షరతులు విధించాలని కోరుతూ సీఐడీ అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. చంద్రబాబుకు కేవలం ఆరోగ్య పరిస్థితి ఆధారంగానే మధ్యంతర బెయిల్ మంజూరు చేసినట్లు తాజా ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పునరుద్ఘాటించారు. ఆరోగ్య పరిస్థితి ఆధారంగా ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను కస్టోడియల్ బెయిల్‌తో సమానంగా పరిగణించడానికి వీల్లేదని ఉత్తర్వుల్లో స్పష్టతనిచ్చారు. 'చంద్రబాబును చూడకుండా ప్రజలను నియంత్రిస్తూ ఈ కోర్టు ఆదేశాలు జారీ చేయజాలదు. మధ్యంతర బెయిల్ పిటిషన్‌లో చంద్రబాబు ఎక్కడా ర్యాలీలు, బహిరంగ సభల నిర్వహణకు అనుమతినివ్వాలని కోరలేదు. మెడికల్ బెయిల్‌కు అదనంగా బహిరంగ సభలు, ర్యాలీల నిర్వహణకు చంద్రబాబు అనుమతి కోరి ఉంటే ఆ పరిస్థితులకు అనుగుణంగా ఈ కోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చేదా? అనే ప్రశ్న తలెత్తుతోంది. మా ముందున్న ఆధారాలను పరిశీలించిన తరువాత రాజకీయ ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించకుండా చంద్రబాబును ఆదేశించేందుకు ఈ కోర్టు సుముఖత చూపుతోంది. ఇది చంద్రబాబు ప్రాథమిక హక్కులను హరించడం కాదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఇది కోర్టు విధిస్తున్న సహేతుక ఆంక్ష మాత్రమే. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న తరువాత మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో ఈ నెల 31న విధించిన షరతులకు అదనంగా ఈ షరతులు విధిస్తున్నాం' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీఎంని రుషికొండకు వెళ్లొద్దంటారా?

- పిటిషనర్‌కు సుప్రీం కోర్టు చీవాట్లు
- లింగమనేని పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: విశాఖలోని రుషికొండ నిర్మాణాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. ముఖ్యమంత్రిని రుషికొండకు వెళ్లొద్దంటారా అంటూ పిటిషనర్‌ను నిలదీసింది. రాజకీయ పరిష్కారాలకు కోర్టుకు ఎందుకు వస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రుషికొండలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు వ్యతిరేకంగా లింగమనేని శివరామ ప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్‌కు పలు ప్రశ్నలు వేసింది. ముఖ్యమంత్రిని రుషికొండకు వెళ్లొద్దంటారా అంటూ సీజేఐ ఘాటుగా స్పందించారు. ఇందులో ప్రజా ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. రాజకీయ పరిష్కారాలకు కోర్టు వేదిక కారాదని వ్యాఖ్యానించారు. రుషికొండ నిర్మాణాలపై జోక్యం చేసుకోబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు, జాతీయ హరితట్రిబ్యునల్ ఆదేశాలపై సీజేఐ ఆరా తీశారు. ఈ తరహా కేసులను హైకోర్టు తేల్చగలదని అన్నారు. హైకోర్టు లేదా ఎన్జీటీలకు వెళ్లాలని పిటిషనర్‌కు సూచించారు. హైకోర్టుకు వెళ్తామని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. అనంతరం కేసు డిస్మిస్ చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

రాష్ట్రీయం

ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కేసు విచారణపై హైకోర్టు స్టే

తనపై కేసు కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసిన శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ పరిధి మంథని పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై నమోదైన కేసులో విచారణపై హైకోర్టు స్టే విధించింది. శ్రీధర్‌బాబుపై తదుపరి చర్యలను నిలిపివేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. పెద్దపల్లి జిల్లా రామగుండం కమిషనరేట్ పరిధి మంథని పోలీస్ స్టేషన్‌లో అక్టోబర్ 20న నమోదైన కేసును కొట్టివేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు పుట్టా మధుకర్ హంతకుడు, రౌడీ, అరాచకవాది అని శ్రీధర్‌బాబు ఓ వీడియోలో ఆరోపించారని మంథనికి చెందిన రఘుప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'బోల్డ్ ఫ్రం ది బ్లూ'అనే పేరుపై ఈ వీడియో మధుకర్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఉందని, ఓటర్లను ప్రభావితం చేసేలా ఉందని...ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లే అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీధర్‌బాబుపై కేసు నమోదు చేయగా..ఫిర్యాదులో ఉన్నట్లు తానెప్పుడూ మధుకర్‌పై హంతకుడన్న ఆరోపణలు చేయలేదని, వీడియోను మార్ఫింగ్ చేసి పోలీసులకు సమర్పించారని వివరణ ఇచ్చారు. వాస్తవమైన ఆడియోను రిటర్నింగ్ అధికారి పరిశీలించలేదని, ఈ కారణంగా తనపై కేసు చెల్లదని హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి విచారణను ఆపేలా, అరెస్టు సహా ఎలాంటి చర్యలు చేపట్టకుండా కేసు కొట్టివేయాలని క్వాష్ పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ అనంతర విచారణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

మరోసారి 'ప్రవాసీ'

▶ మొదటి పేజీ తరువాయి

చేపడుతున్నట్టు ఓ ముఖ్యనేత సాక్షికి వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినపుడు కూడా తెలంగాణకు చెందిన నేతలు ఆయా ప్రాంతాలకు వెళ్లి పూర్తిసమయం కేటాయించి పనిచేసిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. నేతల మధ్య సమన్వయం సాధించడంతో పాటు, ఎన్నికలకు సంసిద్ధత, ఇతర అంశాల్లో ఏవైనా లోటుపాట్లు, లోపాలు గుర్తిస్తే వాటిని సరిచేసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. స్థానికంగా కార్యకర్తల ఇళ్లల్లోనే భోజనాలు చేయడం ద్వారా వారితో కలిసిపోయేందుకు వీలు కలుగుతుందని, క్షేత్రస్థాయిలో పోలింగ్ బూత్ కమిటీల సమన్వయం, ఎన్నికల ప్రచారం, ఇతర అంశాలపై దృష్టి సారించడం ద్వారా పార్టీ పరంగా డబుల్ చెకింగ్‌కు వీలు కలుగుతుందని తెలిపారు.

దేవరకద్ర మార్గంలో ఎలక్ట్రిక్ రైళ్లు

- కృష్ణా స్టేషన్ వరకు విద్యుదీకరణ అందుబాటులోకి
- రాయచూరు సహా మరికొన్ని ప్రాంతాల రైళ్లను ఆ మార్గం మీదుగా నడిపే యోచన



సాక్షి, హైదరాబాద్: పాత లైన్ల విద్యుదీకరణ పూర్తి చేసిన రైల్వే శాఖ ఇప్పుడు కొత్త లైన్లను వేగంగా విద్యుదీకరిస్తోంది. మహబూబ్‌నగర్-కర్నాటకలోని మునీరాబాద్ మధ్య రైల్వే లైన్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో తెలంగాణ సరిహద్దు పరిధిలో దేవరకద్ర- కృష్ణా స్టేషన్ల మధ్య ఇటీవలే లైన్ అందుబాటులోకి వచ్చింది. 64 కి.మీ. ఈ నిడివిలో ప్రయాణికుల రైళ్లను ఇటీవలే స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. తాజాగా ఇప్పుడు దేవరకద్ర-కృష్ణా స్టేషన్‌ల మధ్య మార్గాన్ని కూడా విద్యుదీకరించారు. పనులు పూర్తి కావటంతో డీజిల్ లోకోమోటివ్‌ల బదులు ఎలక్ట్రిక్ లోకో మోటివ్‌లతో రైళ్లను తిప్పనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ప్రకటించింది.

ఉపయోగాలెన్నో..

ప్రస్తుతం కాచిగూడ నుంచి బెంగళూరు, రాయచూరు తదితర ప్రాంతాలకు గద్వాల మీదుగా ఎలక్ట్రిక్ లోకోమోటివ్ రైళ్లు నడుస్తున్నాయి. వాస్తవానికి రాయచూరుకు గద్వాల మీదుగా కాకుండా కృష్ణా మీదుగా వెళ్లేది దగ్గరి దారి. ఇన్నాళ్లూ విద్యుదీకరణ పూర్తి కాకపోవటంతో రైళ్లను నడపటం సాధ్యం కాలేదు. ఇప్పుడు దేవరకద్ర- కృష్ణా స్టేషన్ల మధ్య విద్యుత్ లైన్ అందుబాటులోకి రావటంతో ఇక రాయచూరు సహా కొన్ని ఇతర రైళ్లను ఈ మార్గం మీదుగా మళ్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనివల్ల గద్వాల మార్గంపై ఒత్తిడి తగ్గుతుంది. ఎలక్ట్రిక్ ఇంజన్లతో పోలిస్తే డీజిల్ లోకోమోటివ్‌ల వినియోగం ఖర్చుతో కూడుకున్నది. ఇప్పుడు ఆ ఇంధన భారం కూడా తగ్గనుంది. వేగంలో పెద్దగా తేడా రాకున్నా, ఇంజన్ పికప్ బాగా మెరుగుపడుతుంది. ఇది ప్రయాణ సమయాన్ని తగ్గిస్తుంది. సరుకు రవాణా రైళ్లకు ఒకటికి మించి ఇంజన్లను వాడుతుంటారు. మూడు డీజిల్ ఇంజన్ల బదులు రెండు ఎలక్ట్రిక్ ఇంజన్లు ఎక్కువ వ్యాగన్లు ఉన్న రైలును సులభంగా లాగుతాయి. కొన్ని రకాల సరుకును తరలించే సందర్భంలో.. రెండు డీజిల్ ఇంజిన్ల బదులు ఒక్క ఎలక్ట్రిక్ ఇంజన్ సరిపోతుంది.

ఇక విద్యుదీకరించాల్సింది ఆ రెండు మార్గాలే

ఇక మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ (పనులు జరుగుతున్నాయి), ఇటీవలే అందుబాటులోకి వచ్చిన మెదక్-అక్కన్నపేట మార్గాలను మాత్రమే విద్యుదీకరించాల్సి ఉంది. మనోహరాబాద్-కొత్తపల్లి ప్రాజెక్టులో భాగంగా, సిద్దిపేట వరకు లైన్ అందుబాటులోకి రావటంతో ఇటీవలే ప్రయాణికుల రైళ్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. మనోహరాబాద్-సిద్దిపేట మధ్య విద్యుదీకరణ ప్రాజెక్టు మంజూరు కావటంతో వచ్చే నెలలో టెండర్లు పిలిచేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పనులు ప్రారంభమైన ఏడాదిలో అది కూడా పూర్తయ్యే అవకాశం ఉంది.

జేబులో నోటులాంటి కేసీఆర్‌ను వదులుకోవద్దు

- మంత్రి కేటీఆర్
- బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేత పల్లపు గోవర్ధన్, కార్పొరేటర్ మహాలక్ష్మి



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మహాలక్ష్మి. చిత్రంలో గోవర్ధన్, దానం తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సంపదను పెంచి పేదలకు పంచి వారిని కడుపులో పెట్టుకుని చూడాలన్నదే సీఎం కేసీఆర్ విధానమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడిస్తాం, కూల్చేస్తామని కొందరు అంటున్నారని, జేబులో నోటు లాంటి సీఎంను వదులుకోవద్దని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేపీ నేత పల్లపు గోవర్ధన్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ చిల్లర మాటలకు పడిపోతే హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుందని అన్నారు. హైదరాబాద్‌లో మౌలిక వసతులు మెరుగు పరుస్తూ నగరాన్ని పసిగుడ్డులా చూసుకుంటున్నామన్నారు. 'వండి పెట్టుడు.. మూతి తుడుసుడు తప్ప అన్నీ ప్రభుత్వమే చేస్తుంది'అని వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లు

హైదరాబాద్ మహా నగరంలో పేదల కోసం ఇప్పటికే లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి 70వేలు పంపిణీ చేశామని, మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరో లక్ష ఇళ్లు నిర్మిస్తామని కేటీఆర్ వెల్లడించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా హైదరాబాద్ మెట్రోను 400 కి.మీ మేర విస్తరిస్తామన్నారు. సినీ నటులు రజనీకాంత్, సన్నీ డియోల్, లయ తదితరులు హైదరాబాద్‌ను అమెరికా నగరాలతో పోల్చిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు యునైటెడ్ ముస్లిం ఫోరం మద్దతు

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతును ఇస్తున్నట్లు యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రకటించింది. ప్రగతిభవన్‌లో ఫోరం ప్రతినిధులు శుక్రవారం మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ముస్లింల జీవితాల్లో గణనీయ మార్పు వచ్చిందని, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచడంతో పాటు మైనారిటీ విద్యా సంస్థల ఏర్పాటు వంటివి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో అక్బర్ నిజాముద్దీన్, జియాఉద్దీన్ నయ్యర్, సయ్యద్ మసూద్ తదితరులున్నారు.

ట్రిబ్యునళ్లు ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: చట్టప్రకారం పంచాయతీ, మున్సిపల్ ట్రిబ్యునళ్లు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, మున్సిపల్ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. 'తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం- 2018, మున్సిపాలిటీస్ చట్టం-2019 ప్రకారం ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలి. కానీ, ట్రిబ్యునళ్లు లేకపోవడంతో ఇప్పటికే లక్షల కేసులతో సతమతమవుతున్న రెగ్యులర్ కోర్టులపై ఈ కేసుల భారం పడి.. తీవ్ర పనిభారం పెరుగుతోంది. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో చట్టాలను అతిక్రమిస్తే ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఆయా ప్రాంతాల్లోని ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయాలని చట్టం చెబుతోంది. ఈ చట్టాలు అమల్లోకి వచ్చినా ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రధాన న్యాయమూర్తి ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ట్రిబ్యునళ్ల ఏర్పాటు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలి'అని కోరుతూ హైకోర్టుకు ఓ లేఖ అందింది. ఈ లేఖను హైకోర్టు టేకెన్ అప్ పిల్‌గా విచారణకు స్వీకరించింది. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ లక్ష్మీనారాయణ ధర్మాసనం విచారణ చేపట్టి అధికారులకు నోటీసులు జారీ చేసింది.

బీజేపీ నాలుగో జాబితాపై కసరత్తు

నేడు ఢిల్లీకి కిషన్‌రెడ్డి, ఇతర నేతలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అభ్యర్థుల నాలుగో జాబితాపై కసరత్తు సాగుతోంది. ఇప్పటికి మూడు జాబితాల్లో 88 మంది అభ్యర్థులను ఖరారు చేసిన పార్టీ నాయకత్వం మిగిలిన 31 సీట్లపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్రమంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ నేతలు ప్రకాష్ జవదేకర్, తరుణ్ చుగ్, అరవింద్ మీనన్ భేటీ అయ్యారు. జనసేన పొత్తు ప్రకటన దరిమిలా పార్టీలో వస్తున్న వ్యతిరేకతపై చర్చించినట్టు సమాచారం. జనసేనకు కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, తాండూరు సీట్లు, వేములవాడ, హుస్నాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థుల ఖరారులో ఏర్పడిన చిక్కుముడిని విప్పడం తదితర అంశాలు చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా శనివారం సాయంత్రం కిషన్‌రెడ్డి, ముఖ్యనేతలు బండిసంజయ్, ఈటల రాజేందర్, డీకే అరుణ ఢిల్లీ వెళ్లనున్నట్టు చెబుతున్నారు. జనసేనకు కేటాయించే సీట్లతో పాటు మిగిలిన సీట్లపై అక్కడ పెద్దలతో చర్చించనున్నారని అంటున్నారు. ఏదేమైనా రెండు రోజుల్లో నాలుగో జాబితా వెలువడవచ్చునని తెలుస్తోంది. ఆరేడు సీట్లలో పార్టీ నేతల్లో తీవ్రమైన పోటీ నెలకొన్న నేపథ్యంలో ఆ స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన ఉండకపోవచ్చునని చెబుతున్నారు. మరో మూడు, నాలుగు రోజుల తర్వాత వీటిని ప్రకటించవచ్చునని అంటున్నారు.

నేడు మేడిగడ్డకు కిషన్‌రెడ్డి, ఈటల బృందం....

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా.. మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగడం, అన్నారం బ్యారేజీలోనూ సమస్యలు ఏర్పడటం వంటి పరిణామాల నేపథ్యంలో శనివారం పార్టీ నేతలు జి.కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డా.కె.లక్ష్మణ్, ఎం.రఘునందన్‌రావు అక్కడకు వెళ్లనున్నారు. శనివారం ఉదయం 9.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు అంబట్‌పల్లికి చేరుకుంటారు. 11.15 నుంచి గంట పాటు మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీని సందర్శిస్తారు. అక్కడి పరిస్థితులు పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 నిముషాలకు తిరిగి బయలుదేరి మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు.

అధికారంలోకి రాగానే 'కాళేశ్వరం'పై విచారణ

- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- మేడిగడ్డ కుంగినందుకు కేసీఆర్ నైతిక బాధ్యత వహించాలి
- సీఎం సూపర్ ఇంజనీర్‌గా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి



కామారెడ్డిలో బీజేపీ శ్రేణుల బైక్ ర్యాలీ

సాక్షి, హైదరాబాద్/సాక్షి, కామారెడ్డి: సీఎం కేసీఆర్‌కు ఏమాత్రం నీతి, నిజాయితీ ఉన్నా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటు, తదనంతర పరిణామాలకు నైతిక బాధ్యత వహించాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం ఓ సూపర్ ఇంజనీర్‌గా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని తెలిపారు. సీఎం సహా అధికారులు, కాంట్రాక్టర్లు.. బాధ్యులు ఎంతటి వారైనా చట్టం పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ఫెయిల్

కాళేశ్వరంప్రాజెక్టు భవిష్యత్ ఏమిటనేది తీవ్ర ఆందోళన కలిగించే అంశమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టు డిజైన్, కట్టిన స్థలం ఎంపికలో తప్పు జరిగిందని నిపుణులు చెప్పినా సీఎం పట్టించుకోలేదని విమర్శించారు. 'కేసీఆర్ కమీషన్లు తీసుకోవడంలో, తెలంగాణ సొమ్ము దోచుకోవడంలో సక్సెస్ అయ్యారు.. కానీ ప్రాజెక్టు విషయంలో ఫెయిలయ్యారు..' అని ఆరోపించారు. పిల్లర్ల కుంగుబాటుతో పది టీఎంసీల నీటిని వృధాగా వదిలేయాల్సి వచ్చిందన్నారు. పునాది సరిగా లేదని ప్లానింగ్, డిజైనింగ్‌తో పాటు పనుల్లో నాణ్యత లోపించిన కారణంగానే పిల్లర్లు కుంగాయని డ్యాం సేఫ్టీ అథారిటీ తన నివేదికలో తెలిపిందన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రాజెక్టుకు నాణ్యత లేని ఇసుక వాడారని తేల్చిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు వ్యయం, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పారదర్శకత లోపించిందని విమర్శించారు. కాళేశ్వరం ఫ్యామిలీ డ్రీమ్ ప్రాజెక్టు అని కేసీఆర్ ప్రచారం చేసుకున్నారని, దాని వల్ల కేసీఆర్ ఫ్యామిలీకి లాభం తప్పితే, ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని ఆరోపించారు.

బీఆర్ఎస్ సర్కారు మోసాలపై చార్జిషీట్ సిద్ధం

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాలపై చార్జిషీట్లు సిద్ధం చేశామని, త్వరలో వాటిని ప్రజల ముందుంచుతామని.. కామారెడ్డిలో 'బూత్ విజయ్ అభియాన్'కార్యక్రమంలో మాట్లాడుతూ కిషన్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ గజ్వేల్‌లో రెండుసార్లు గెలిచినా అక్కడ జరిగిన అభివృద్ధి శూన్యమని, పైగా అక్కడి ప్రజలు పడిన కష్టాలు అంతా ఇంతా కాదన్నారు. గజ్వేల్‌లో ఓటమి భయంతోనే కామారెడ్డికి వస్తున్నారని, ఆయన్ను ఓడించేందుకు గజ్వేల్, కామారెడ్డి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.



సెమీఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం

ఆద్యంతం నిలకడగా ఆడిన రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ బోపన్న-ఎబ్డెన్ జోడీ 6-3, 6-2తో ఐదో సీడ్ మార్సెల్ గ్రానోలెర్స్ (స్పెయిన్)-హొరాసియో జెబలాస్ (అర్జెంటీనా) జంటను ఓడించింది. 54 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేశారు.

సంయుక్త ఆధిక్యంలో విదిత్



గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తొమ్మిదో రౌండ్ తర్వాత భారత గ్రాండ్ మాస్టర్ విదిత్ 6.5 పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఎసిపెంకో (రష్యా)తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను విదిత్ 37 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఆరు పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు.

డిసెంబర్ 19న దుబాయ్‌లో ఐపీఎల్ వేలం



న్యూఢిల్లీ: వచ్చే 2024 ఐపీఎల్ సీజన్‌కు సంబంధించిన ఆటగాళ్ల వేలం ప్రక్రియ తొలిసారిగా దేశం దాటనుంది. గతంలో టోర్నీ విదేశాల్లో నిర్వహించినప్పటికీ వేలం పాట మాత్రం భారత్‌లోనే జరిగింది. ఇప్పుడు కొత్తగా ఈ వేలాన్ని దుబాయ్‌లో డిసెంబర్ 19న నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఈ మేరకు పది ఫ్రాంచైజీ యాజమాన్యాలు, ఇతర స్టేక్ హోల్డర్లకు బోర్డు సమాచారం ఇచ్చింది. ఆటగాళ్లను అట్టిపెట్టుకునే ఫ్రాంచైజీలకు ఇచ్చిన గడువును పెంచింది. ఈ నెల 15న ముగియాల్సిన తుది గడువును 26వ దాకా పొడిగించింది. ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు వెచ్చించే మొత్తాన్ని కూడా పెంచారు. ఆటగాళ్ల కొనుగోలుకు రూ. 100 కోట్ల దాకా వెచ్చించవచ్చు.

సెమీస్‌లో ఓడిన భారత్



కౌలాలంపూర్: సుల్తాన్ ఆఫ్ జొహర్ కప్ జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టుకు చుక్కెదురైంది. జర్మనీ జట్టుతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో టీమిండియా 3-6 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున అమన్‌దీప్ లాక్రా (35వ ని.లో), ఉత్తమ్ సింగ్ (58వ ని.లో), రోహిత్ (60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. రెండో సెమీఫైనల్లో ఆస్ట్రేలియా 2-1తో పాకిస్తాన్‌పై గెలిచి నేడు జరిగే ఫైనల్లో జర్మనీతో తలపడుతుంది. మూడో స్థానం కోసం పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.

భారత్‌కు నాలుగు స్వర్ణాలు

అస్తానా (కజకిస్తాన్): ఆసియా యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు అదరగొట్టారు. నాలుగు విభాగాల్లో స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. భావన శర్మ (48 కేజీలు), తనూ (54 కేజీలు), నిఖిత చంద్ (60 కేజీలు), కీర్తి (ప్లస్ 81 కేజీలు) పసిడి పతకాలను గెల్చుకున్నారు. ఫైనల్స్‌లో గుల్సెవర్ గనియెవా (ఉజ్బెకిస్తాన్)పై భావన; యునుసోవా (ఉజ్బెకిస్తాన్)పై తనూ; ఇస్మోయిలోవా (ఉజ్బెకిస్తాన్)పై నిఖిత చంద్; ఉమిత్ (కజకిస్తాన్)పై కీర్తి గెలుపొందారు.

అఫ్గాన్... అదే జోరు

- ప్రపంచకప్‌లో నాలుగో విజయం
- నెదర్లాండ్స్‌పై ఏడు వికెట్లతో గెలుపు
- సెమీఫైనల్ ఆశలు సజీవం
- రాణించిన నబీ, హష్మతుల్లా, రహ్మత్ షా


హష్మతుల్లా, అజ్మతుల్లా

లక్నో: సమష్టి ప్రదర్శనతో అదరగొడుతూ... అంచనాలకు మించి రాణిస్తూ... వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో అఫ్గానిస్తాన్ నాలుగో విజయం నమోదు చేసింది. ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన మూడు జట్లపై సంచలన విజయాలు సాధించిన అఫ్గానిస్తాన్ తాజాగా నెదర్లాండ్స్ జట్టును ఓడించి సెమీఫైనల్ రేసులో నిలిచింది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ ఏడు వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. సైబ్రాండ్ (86 బంతుల్లో 58; 6 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించగా, మ్యాక్స్ ఓ డౌడ్ (40 బంతుల్లో 42; 9 ఫోర్లు) రాణించాడు. అఫ్గాన్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నబీ 3 వికెట్లు, నూర్ అహ్మద్ 2 వికెట్లు తీశారు. అనంతరం అఫ్గానిస్తాన్ 31.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 181 పరుగులు చేసి గెలిచింది. రహ్మత్ షా (54 బంతుల్లో 52; 8 ఫోర్లు), కెప్టెన్ హష్మతుల్లా (64 బంతుల్లో 56; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు.

డచ్ రనౌట్...

నెదర్లాండ్స్ జట్టులో టాప్-5లో ఒక్క ఓపెనర్ వెస్లీ (1) మినహా... తర్వాత వరుసగా నలుగురు బ్యాటర్లు మ్యాక్స్ ఓ డౌడ్, అకెర్మన్ (35 బంతుల్లో 29; 4 ఫోర్లు), సైబ్రాండ్, కెప్టెన్ ఎడ్వర్డ్స్ (0) రనౌట్ కావడమే డచ్ కొంపముంచింది. వన్డేల్లో ఒక జట్టు తరఫున టాప్-5లో నలుగురు రనౌట్ కావడం ఇదే ప్రథమం. సమన్వయలోపం, పరుగేలేని చోట ప్రయత్నించి భంగపడటంతో నెదర్లాండ్స్ కష్టాలు కొనితెచ్చుకుంది. తర్వాత వచ్చిన బ్యాటర్లలో ఏ ఒక్కరు చెప్పుకోదగ్గ స్కోరు చేయలేదు.

గెలిపించిన రహ్మత్, హష్మతుల్లా

సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన అఫ్గాన్‌కు ఓపెనర్ల వైఫల్యం కంగారుపెట్టింది. రహ్మానుల్లా గుర్బాజ్ (10), ఇబ్రహీం జద్రాన్ (20) నిరాశపరిచారు. ఈ దశలో రహ్మత్ షా, కెప్టెన్ హష్మతుల్లా ఇన్నింగ్స్ నడిపించి, గెలిపించే బాధ్యత తీసుకున్నారు. ఈ క్రమంలో రహ్మత్ షా (47 బంతుల్లో) ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. మూడో వికెట్‌కు 74 పరుగులు జోడించాక జుల్ఫికర్ బౌలింగ్‌లో రహ్మత్ షా నిష్క్రమించాడు. తర్వాత వచ్చిన అజ్మతుల్లా (31 నాటౌట్; 3 ఫోర్లు)తో కలిసి అబేధ్యమైన నాలుగో వికెట్‌కు 52 పరుగులు జత చేసిన హష్మతుల్లా జట్టును విజయతీరానికి చేర్చాడు.

ఇక్కడిదాకా బాగానే ఉన్నా...

అఫ్గాన్ ఏదో గాలివాటం గెలుపులేమీ గెలవలేదు. చక్కని బౌలింగ్, నిలకడైన బ్యాటింగ్‌తో మాజీ చాంపియన్లను ఓడించి 8 పాయింట్లతో సెమీఫైనల్ రేసులో నిలిచింది. ఇప్పటివరకైతే బానే ఉంది. కానీ హష్మతుల్లా జట్టుకు మిగిలినవి రెండు మ్యాచ్‌లే! అవి కూడా గట్టి ప్రత్యర్థులైన ఆస్ట్రేలియా (7న ముంబైలో), దక్షిణాఫ్రికా (10న అహ్మదాబాద్‌లో)లతో కావడంతో... సెమీస్ చేరడం, కల సాకారమవడం మాత్రం అంత సులభమైతే కాదు. అయితే సంచలనాల మజా ఆఖరి దశను రసవత్తరం చేస్తే మాత్రం... 2003లో కెన్యా సెమీస్ చేరినట్లే... అఫ్గాన్‌కు ఆ అవకాశం దక్కినా దక్కొచ్చు!

స్కోరు వివరాలు

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: వెస్లీ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 1; మ్యాక్స్ ఓ డౌడ్ (రనౌట్) 42; అకెర్మన్ (రనౌట్) 29; సైబ్రాండ్ (రనౌట్) 58; ఎడ్వర్డ్స్ (రనౌట్) 0; బస్ డి లీడే (సి) ఇక్రామ్ (బి) నబీ 3; జుల్ఫికర్ (సి) ఇక్రామ్ (బి) నూర్ అహ్మద్ 3; వాన్ బీక్ (స్టంప్డ్) ఇక్రామ్ (బి) నబీ 2; వాన్‌డెర్ మెర్వ్ (సి) జద్రాన్ (బి) నూర్ అహ్మద్ 11; ఆర్యన్ దత్ (నాటౌట్) 10; మీకెరన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 4; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (46.3 ఓవర్లలో ఆలౌట్) 179. వికెట్ల పతనం:** 1-3, 2-73, 3-92, 4-92, 5-97, 6-113, 7-134, 8-152, 9-169, 10-179. **బౌలింగ్:** ముజీబ్ 10-0-40-1, ఫరూఖీ 5-0-36-0, ఒమర్జాయ్ 3-0-11-0, నబీ 9.3-1-28-3, రషీద్ ఖాన్ 10-0-31-0, నూర్ అహ్మద్ 9-0-31-2.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాన్ బీక్ 10; జద్రాన్ (బి) వాన్‌డెర్ మెర్వ్ 20; రహ్మత్ షా (సి అండ్ బి) జుల్ఫికర్ 52; హష్మతుల్లా (నాటౌట్) 56; అజ్మతుల్లా (నాటౌట్) 31; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (31.3 ఓవర్లలో 3 వికెట్లకు) 181. వికెట్ల పతనం:** 1-27, 2-55, 3-129. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 8.3-0-49-0, వాన్ బీక్ 7-0-30-1, మీకెరన్ 5-0-35-0, వాన్‌డెర్ మెర్వ్ 5-0-27-1, జుల్ఫికర్ 3-0-25-1, అకెర్మన్ 3-0-12-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	7	7	0	14	2.102
దక్షిణాఫ్రికా	7	6	1	12	2.290
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
న్యూజిలాండ్	7	4	3	8	0.484
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
పాకిస్తాన్	7	3	4	6	-0.024
శ్రీలంక	7	2	5	4	-1.162
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
బంగ్లాదేశ్	7	1	6	2	-1.446
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు



న్యూజిలాండ్ X పాకిస్తాన్
వేదిక: బెంగళూరు
ఉదయం గం. 10:30 నుంచి

ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
వేదిక: అహ్మదాబాద్
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

టి20 ప్రపంచకప్ టోర్నీకి ఒమన్, నేపాల్ అర్హత





కీర్తిపూర్ (నేపాల్): వచ్చే ఏడాది వెస్టిండీస్-అమెరికాలలో జరిగే టి20 పురుషుల ప్రపంచకప్ క్రికెట్ టోర్నమెంట్‌కు నేపాల్, ఒమన్ జట్లు అర్హత సాధించాయి. ఇక్కడ జరుగుతున్న ఆసియా రీజియన్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఈ రెండు జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లి టి20 ప్రపంచకప్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఒమన్ జట్టు 10 వికెట్ల తేడాతో బహ్రెయిన్ జట్టును ఓడించగా... నేపాల్ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుపై గెలిచింది. టి20 ప్రపంచకప్ టోర్నీకి నేపాల్ జట్టు అర్హత సాధించడం ఇది రెండోసారి కాగా... ఒమన్ జట్టు మూడోసారి ఈ మెగా టోర్నీలో పోటీపడనుంది. నేపాల్ 2014లో, ఒమన్ 2016, 2021 ప్రపంచకప్ టోర్నీల్లో పాల్గొన్నాయి.

మరో రెండు బెర్త్‌ల కోసం...

వచ్చే ఏడాది జూన్ 4 నుంచి 30వ తేదీ వరకు వెస్టిండీస్-అమెరికాలలో జరిగే తొమ్మిదో టి20 ప్రపంచకప్‌లో తొలిసారి 20 జట్లు బరిలోకి దిగనున్నాయి. ఇప్పటికి 18 జట్లు అర్హత పొందాయి. ఆతిథ్య దేశాల హోదాలో వెస్టిండీస్, అమెరికా నేరుగా అర్హత సంపాదించాయి. 2022 ప్రపంచకప్ ద్వారా భారత్, ఇంగ్లండ్, పాకిస్తాన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, నెదర్లాండ్స్ జట్లకు బెర్త్‌లు లభించాయి. ర్యాంకింగ్ ఆధారంగా అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ జట్లకు బెర్త్‌లు దక్కాయి. ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా నేపాల్, ఒమన్... యూరోప్ క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా స్కాట్లాండ్, ఐర్లాండ్... తూర్పు ఆసియా-పసిఫిక్ క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా పాపువా న్యూగినీ... అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా కెనడా అర్హత సాధించాయి. ఈనెల 22 నుంచి 30 వరకు నమీబియాలో ఏడు దేశాల మధ్య (జింబాబ్వే, కెన్యా, నమీబియా, నైజీరియా, రువాండా, టాంజానియా, ఉగాండా) జరిగే ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా చివరి రెండు బెర్త్‌లు ఖరారవుతాయి.

వృత్తి అగర్వాల్‌కు ఐదో పతకం


రజత పతకంతో వృత్తి


శ్రావ్య శివాని, రష్మిక

పనాజీ (గోవా): జాతీయ క్రీడల్లో తెలంగాణ స్విమ్మర్ వృత్తి అగర్వాల్ అద్భుత ప్రతిభ కనబరిచింది. ఈ క్రీడల్లో శుక్రవారం ఆమె ఐదో పతకాన్ని సొంతం చేసుకుంది. 400 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వృత్తి (4ని:30.03 సెకన్లు) రజత పతకాన్ని దక్కించుకుంది. గుజరాత్‌లో జరిగిన గత జాతీయ క్రీడల్లో వృత్తి మూడు రజతాలు, ఒక కాంస్యంతో నాలుగు పతకాలు సాధించింది. ఈసారి ఆమె మూడు రజతాలు, రెండు కాంస్యాలతో ఐదు పతకాలను తన ఖాతాలో జమ చేసుకుంది.

ఫైనల్లో రష్మిక-శివాని జోడీ

జాతీయ క్రీడల మహిళల టెన్నిస్ ఈవెంట్ డబుల్స్ విభాగంలో తెలంగాణకు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక-శ్రావ్య శివాని జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో రష్మిక-శివాని ద్వయం 6-4, 6-7 (5/7), 10-5తో షర్మదా బాలూ-సోహా సాదిక్ (కర్ణాటక) జంటను ఓడించింది. సింగిల్స్ విభాగంలో రష్మిక సెమీఫైనల్లోకి ప్రవేశించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


Reliance
NOW OPEN AT:
• RC PURAM, BESIDE D-MART
• SANGAREDDY: OPP. ITI GOVT. COLLEGE
Reliance digital
PERSONALISING TECHNOLOGY
ఈ ధనత్రయోదశికి,
#UnlimitedCelebrations
ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్
₹10000 వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్*
10% ఇన్‌స్టంట్ డిస్కౌంట్
SBI card
25 అక్టోబర్ – 5 నవంబర్ 2023
పొందండి ₹4000* విలువగల అజియో మరియు రిలయన్స్ ట్రెండ్స్ వోచర్స్
సమర్పిస్తున్నవారు
intel evo | ONEPLUS
#MakeFriendsWithTechnology
ధనత్రయోదశి స్పెషల్ ఆఫర్*
ధనత్రయోదశి రోజున ఖచ్చితమైన డెలివరీ పొందండి*
MATCH DAY DEALS
SAMSUNG Neo QLED 3 Year
Starting from ₹99990*
*Price after Cashback
BENEFITS FREEBIES WORTH UPTO ₹124990/-*
OLED TV 3 Year
Starting from ₹89990*
LG SAMSUNG SONY
BENEFITS FREEBIES WORTH UPTO ₹19990* (ON SELECT OLEDS)
LG NanoCell ULTRA BRIGHT PANEL 3 Year
139CM (55) 55NANO83 ₹99990 ₹59990*
165CM (65) 65NANO83 ₹159990 ₹89990*
TCL Google TV P635 2 Year
146CM (58) ₹32990*
165CM (65) ₹43990*
193CM (75) ₹65990*
*Price after Cashback
QLED SMART TV 2 Year
139CM (55) ₹35990*
TCL Hisense SANSUI
109CM (43) FHD ₹16990
109CM (43) UHD ₹21990
MAX 20% DISCOUNT UP TO ₹20000* ON LEADING BANKS
ONEPLUS
OnePlus Open
Open for Everything
₹149999
Starting from ₹139999*
VIVO Y56 5G ₹24999 Starting from ₹18999*
BENEFIT GET CASHBACK OF 10% UP TO ₹1899 ON SELECT CARDS
OPPO A79 5G ₹22999 Starting from ₹19999*
BENEFIT GET 10% CASHBACK UP TO ₹2000 IN SBI CREDIT CARD
DEAL PRICE
SAMSUNG Galaxy 5G
A34 5G ₹28999 Starting from ₹23999*
A54 5G ₹38999 Starting from ₹33499*
BENEFIT GET LOYALTY BONUS EXTRA
iPhone
13 128GB ₹59900 Starting from ₹53900*
14 128GB ₹69900 Starting from ₹60900*
JBL TWS LIVE PRO 2 ANC ₹1111*
Noise Ultra 3 ₹8999 ₹2999
Intel® Core™ i5
Multi-Tasking Laptop Starting from ₹36999*
Gaming Laptop Starting from ₹44499*
AMD R5
Multi-Tasking Laptop Starting from ₹33499*
Gaming Laptop Starting from ₹45499*
PRICE CASHBACK & PROMO. GET ADDITIONAL EXCHANGE BONUS OF UP TO ₹10000*
Macbook Air
Supercharged by the Apple M1 chip
EMI Starting from ₹1590*
iPad 9th Gen WiFi 64GB
₹33900 Starting from ₹22499*
JBL DOLBY ATMOS SOUNDBAR
Starting from ₹16990*
BENEFIT UPTO 25% CASHBACK + 2 YEARS WARRANTY
PLAYSTATION®5 CONSOLE CRICKET 24 BUNDLE
₹57990 Starting from ₹47990*
FROST FREE
HAIER 240L ₹22490* EMIs of ₹1874
LG 242L ₹22990* EMIs of ₹1916
SAMSUNG 301L ₹30490* EMIs of ₹2541
FROST FREE
SAMSUNG 236L ₹22890* EMIs of ₹1908
WHIRLPOOL 231L ₹24490* EMIs of ₹2041
LG 340L ₹29990* EMIs of ₹2499
SIDE BY SIDE
KELVINATOR 584L ₹51990* EMIs of ₹4333
LG 655L ₹72990* EMIs of ₹6083
SAMSUNG 653L ₹97990* EMIs of ₹8166
FREE** 10 KG TOP LOAD WASHING MACHINE WORTH ₹32500 (ON SELECT SAMSUNG SBS*)
*PRICE AFTER BANK CASHBACK
FRONT LOAD
IFB 6.5 Kg ₹30490* EMIs of ₹2541
LG 8 Kg ₹33490* EMIs of ₹2791
SAMSUNG 8 Kg ₹33990* EMIs of ₹2833
FRONT LOAD
SAMSUNG 9 Kg ₹34490* EMIs of ₹2874
LG 9 Kg ₹34990* EMIs of ₹2916
IFB 8 Kg ₹36990* EMIs of ₹3083
*PRICE AFTER BANK CASHBACK
BREAKFAST COMBO
HOT AND COLD BOTTLE + SANDWICH MAKER + ELECTRIC KETTLE
COMBO OFFER ₹1999*
WATER PURIFIER
AQUAGUARD UV+UF ₹10290*
AQUAGUARD RO+UV ₹18500*
LG RO ₹20590*
MIXER & GRINDER
BAJAJ 750W 3 JARS ₹2999*
HAVELLS 750W 4 JARS ₹4399*
PHILIPS 1000W 3 JARS ₹7099*
CONVECTION MICROWAVES
LG 20L SOLO ₹6950*
IFB 30L CONVECTION ₹16600*
SAMSUNG 28L CONVECTION ₹16300*
BAJAJ 3 BURNER ₹4999*
USHA 3 BURNER ₹5599*
PRESTIGE 3 BURNER ₹5699*
HDFC BANK
రూ. 10000 వరకు క్యాష్‌బ్యాక్ కన్స్యూమర్ ఫైనాన్స్‌పై
Reliance resQ
1800 889 1044
reliancedigital.in
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE